
ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 468
వెల : రూ.20/-
ఏప్రియల్ 2024




జనసాహితి ప్రచురణ

కవిత

# కవితా కుసుమార్చన

- రజి

'అంతర్జాతీయ కవితా దినోత్సవ' శుభ తరుణాన
అవనివ్యాపిత పూవులనేకం కదిలి వచ్చి
అనంత 'కవితా రూపాని'కి...
ఆంధ్ర లోగిలిలోచేసిన...సాహితీకుసుమార్చనమిది!

★ ★ ★

మోడు వారిన ఎడారి తోటలో...
మెడ వంచని పత్రహరితమే పాలస్తీనా!
నెత్తుటి, కన్నీటి ధారలలో తడుస్తూ...
పోరుతోంది... శాంతి కోసం,
'ఆలివ్ ఆకుల' పతాకధారియై...

దేశ ఉనికే ప్రశ్నార్ధకమైన బాధితులు...
నెలలు, నెలలుగా నివాసాలపై
ఎగురుతున్న బాంబర్ల హెూరు...
వందలు, వేలు, పదుల వేలుగా
లెక్క తేలుతున్న విగతజీవులు...
సర్వం కోల్పోయిన లక్షలాది శరణార్థులు...
శిధిలమైన జనజీవనం...
శిథిలాల నడుమే జీవనం...
శిధిలాల క్రిందే ఖననం...
రంజాన్ మాసమంతా
కాలే కడుపులతో ఉపవాసం...
గంజి కోసం బారులు తీరిన చిన్నారులు...
క్షతగాత్రులతో నిండిన ఆసుపత్రులు...
బారు తుపాకులెక్కు పెట్టి
ముష్కరులు సాగించే అమానుషాలు...
మాతృభూమిలో కాందిశీకులను చేసిన అహంకారం...
అహంకారానికి లోబడని పోరులో మృత్యుధిక్కారం...
వెల్లడవుతోన్న -
యూదు జాత్యహంకార 'నెతన్యాహు' తత్వం...
'రాబందు రెక్కల' రాజకీయ కుటిలత్వం...
సంఘీభావానికి చెల్లుచీటీనిచ్చిన
'మోషా' ప్రభుత్వ కపటత్వం...
ధిక్కార పాలస్తీనాతో గొంతులు కలుపుతూ
వెల్లువవుతున్న ప్రపంచ ప్రజల సోదరత్వం...

'శ్వేత్య'హంకారం పై కడదాకా రణం చేసిన
'నల్ల కలువ'బెంజిమెన్ మొలైసీ దక్షిణాఫ్రికా -
వేల మైళ్ళ దూరాన్నున్నా...
అంతర్జాతీయ న్యాయవేదికనుండి
పాలస్తీనా కోసం సాగిస్తున్న పోరాటం...

★ ★ ★

'పొద్దు తిరుగుడు' పువ్వు తీరున
'నాటో' వైపు ఒరిగిన 'ఉక్రెయినం'...
'చామంతపు' అగ్రరాజ్య 'భల్లూకపు'పరిష్వంగం-
ఏళ్ల తరబడి సాగుతున్న సమరం...
సమిధలవుతున్న సామాన్య జనం...
అమెరికా, 'నాటో'ల ఆయుధ వ్యాపారం
'మూడు యుద్ధాలు, ముప్పయ్ అమ్మకాలు'గా వర్ధిల్లుతున్న వైనం..

★ ★ ★

'భూతల స్వర్గపు' ప్రసిద్ధకాశ్మీర్'తులిప్'లు
'కాడలు' వేళ్ళాడుతూ కదులుతున్నాయి, కళావిహీనంగా...
అరుణ రాగ రంజితమైన
'కుంకుమపువ్వు' కదిలింది, వెన్నుదన్నుగా...
'కాషాయుల' పాలనలో
కనీస రక్షణ అధికరణాల తొలగింపు...
మూడుముక్కలతో 'భూతాల'స్వర్గంగా
కాశ్మీరం కబళింపు...
'ఈవీ'లకు కీలకమైన 'లిథియం' గనులు
బడా బాబులకు బదలాయింపు...
ఇనుప టోపీల నిరంతర నిఘాల నీడన
'ప్రజాస్వామ్య' పునరుద్ధరింపు?!

★ ★ ★

ఆతిథ్య తెలుగు అభివ్యక్తీకరణకు ఎదురుచూస్తే ...
ఆంగ్ల వేషధారణతో అరువు మాటల వెక్కిరింపు...
'అధికార మల్లెలు', తొడిమలు ఎగరేసి వీరంగంవేస్తే...
బాధామయ ప్రజల గాథల గాన ప్రతినిధి, రాకపోతుందా...
అంతర్జాతీయ కవితా సుమార్చన ఆగిపోతుందా?!
చూడు... చూడు...
ప్రజల పనుపున 'మేడే పూలు'అకాలంలోనూ
రేకువిప్పి కేకలేశాయి...
అడవి నుండీ తరలివచ్చిన 'మోదుగల'న్నీ
వసంతాన్నీ స్వాగతిస్తూ...
పోరుగొంతుతో వంత పాడాయి!

ముక్తాయింపు :

సలుపుతున్న గాయాలనే
స్పందన గేయాలుగా మలచి...
విరులల్లిన సమర కవితా తోరణమిది!

పూలు దారాలతో...పూలకు(వు)రి బిగించినందుకే
తల్లడిల్లిన కరుణశ్రీ...
పలుదేశాల గుండెలు చీల్చుకొని ప్రవిస్తున్న నెత్తుటేర్లనుగాంచి...
ఆ కాలపు తన లోపాలు తలపుకు వచ్చి...
నిలువు నిలువునా నీరయ్యాడు!

అయితే.... కవితావిశ్వరూప సాక్షాత్కారి శ్రీశ్రీ...
కదిలి,ముందడుగేయమన్నాడు....నిబ్బరంగా!
'ప్రజా ధిక్కార' ధారణతో
కవితా సార్థకతను చాటమన్నాడు... చిరంతనంగా!

(మార్చ్ 21... అంతర్జాతీయ కవితా దినోత్సవ సందర్భంగా....)

జనసాహితి ప్రచురణ

47 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

468

సంపుటి : 47

సంచిక : 9

ఏప్రియల్ 2024

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...

| | | | | |
|---|---|---|---|---|
| ముఖచిత్రం | : | ఎన్నికల బాండ్ల భాగోతం – చిత్రం (అంతర్జాలం నుండి) | | .....01 |
| రెండవ అట్ట | : | కవితా కుసుమార్చన (కవిత) | – రవి | .....02 |
| మూడవ అట్ట | : | అంకెయ లేక (కవిత) | – రవి నన్నపనేని | .....35 |
| నాల్గవ అట్ట | : | లెనిన్ జయంతి సందర్భంగా – చిత్రం (అంతర్జాలం నుండి) | | .....36 |
| సంపాదకీయం | : | నిరంకుశత్వ ప్రజాస్వామ్యం! | | .....05 |
| తీర్మానం | : | అఖిల భారత ప్రజాసాహిత్య, సాంస్కృతిక వేదిక | | .....07 |
| వ్యాసం | : | కామ్రేడ్ లెనిన్ రేపటి ఆశ.. శ్వాస కూడా.... | – మాధవ్ రామచంద్రన్ | .....08 |
| | : | మెగెసెసే అవార్డు స్వీకారోపన్యాసం | – టి.ఎం. కృష్ణ | .....11 |
| పాట | : | మన పెరియార్ – టి.ఎం. కృష్ణ | అనువాదం : హష్మీ | .....13 |
| ధారావాహిక | : | దేశ విభజన వస్తువుగా సాహిత్యం (17, 18)<br>సలీంఖాన్ గిమ్మీ నవల "సాంఝ్"<br>సోహన్‌సింగ్ శీతల్ నవల "టూటన్‌వాలా ఖుహ్" | – కొత్తపల్లి రవిబాబు | .....14 |
| | : | తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట సాహిత్య పరిచయం : 3<br>గొల్లపూడి నారాయణరావు రెండు నవలలు | – మండవ సుబ్బారావు | .....22 |
| సజీవ సాహిత్యం | : | నా మాట | – కొమ్మిరెడ్డి విశ్వమోహన్‌రెడ్డి | .....16 |
| గల్పిక | : | టముకు | – శంకరం | .....17 |
| పుస్తక పరిచయం | : | 'ఇవీ మన మూలాలు' | – ఓవీవీయస్ | .....19 |
| | : | 'ఎన్నికల ప్రజాస్వామ్యం' | – హరిబాబు | .....30 |
| సినిమా సమీక్ష | : | 'రజాకార్' | – ఐ.టి.ఆర్.వి. శివాజీరావు | .....26 |
| స్పందన | : | అంబానీ ఇంట పెళ్ళి! | – మనస్విని | .....29 |
| కవిత | : | ప్రతిష్టా పాండ్య – అను : రాఘవశర్మ (**18**); | | |
| వివిధ | : | హిందూ దైవ భావనను ఢీకొంటున్న టి.ఎం. కృష్ణ (**12**); ముప్పై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**04**); స. రఘునాథతో ఇష్టాగోష్టి (**13**); లద్దాక్ ప్రజాఉద్యమానికి సంఘీభావం ప్రకటిద్దాం (**21**); నా విలువైన పదేళ్ళ జీవితకాలాన్ని ఎవరు తిరిగి ఇవ్వగలరు? (**28**); కృతజ్ఞతలు (**31**); చైతన్యవాహిని (**32**); ఈ పుస్తకాలు అందాయి (**33**); వార్తాసాహితి (**34**) | | |

ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : 9490196890 E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 0971-278X
LIBRARY OF CONGRESS
LCCN 94903393

రచనలు పంపవలసిన చిరునామా :
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

‘ప్రజాసాహితి’

కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు

“అకౌంట్ నెం.

*0680101004936*

*IFSC No. CNRB0000680*

**ఫోన్ : 70759 57010**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**

మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.

చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.

డి.డి.లపై *‘ప్రజాసాహితి, విజయవాడ’* అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు

**1/4 డెమ్మీ పరిమాణం**

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం


## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత ‘ప్రజాసాహితి’కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# ముప్పై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

**సంచిక : 9 సంపుటి : 17 ఏప్రిల్ 1994**



**చిత్రకారుడు** మోహన్ గీసిన “సామాన్య ప్రజలందరూ ఒకే పిడికిలిగా మారి సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొంటున్న చిత్రాన్ని ముఖచిత్రంగా “సాంస్కృతిక సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం”గా ఈ నెల సంచికను ప్రచురించారు. 1994 ఏప్రిల్ 15న మొరాకో దేశ రాజధాని మర్రాకేశ్‌లో గాట్ ఒప్పందంపై ఆమోదం తెలియపర్చే సంతకాల కార్యక్రమం ముగుస్తున్న సందర్భంగా “గాట్ ఒప్పందాన్ని ప్రతిఘటించండి” అంటూ సంపాదకీయం రాశారు. డంకెల్ డ్రాఫ్ట్‌ను వ్యతిరేకిస్తూ దివికుమార్ పద్యం – “ఎవరు హక్కుదారులు”ను, రాంచందర్ పాట – “గాట్ ఒప్పందానికి, సాంస్కృతిక సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడండి!”నీ, ఏప్రిల్ 11 నుండి 15 వరకు చీకటి దినాలుగా పాటించండి అంటూ ఏప్రిల్ 3, 4, 5 తేదీలలో హైదరాబాదులో జరిగిన “అఖిల భారత సాంస్కృతిక సామ్రాజ్యవాద వ్యతిరేక సదస్సు” ఇచ్చిన పిలుపును ప్రచురించారు.

“కొల్లాయి గట్టితేనేమి? నవలను నేనెందుకు రాశాను” – మహీదర రామమోహనరావు వ్యాసాన్నీ, “హింస + విధ్వంసం = రాజ్యాంగ యంత్రం” అనే శోధన్ రాసిన కవితనూ, పి. చంద్రశేఖర్ అజాద్ కథ “సా.వా.స”, (సామ్రాజ్యవాద సంస్కృతిగాడు), అల రాసిన కవిత “పులి జాలి”, “ఆదివాసీ సంఘీభావ కమిటీ వారి నిజనిర్ధారణ నివేదికలు”, వరంగల్ మేధావుల నివేదికపై రవిబాబు వ్యాసం, బజరా గల్పిక – “దేశభక్తుడి శ్వేతపత్రం”, ‘ఆంక్షలు – నిషేధాలు’ శీర్షికన తస్లీమా నస్రీన్‌కు, రష్దీకి మద్దతుగాను “మీ తప్పంటే నేన్నమ్మను” ఛాయరాజ్ రాసిన కవితను ప్రచురించారు.

ఏప్రిల్ 3, 4, 5 తేదీల్లో కా॥ నూతన్ నగర్ (రాణా ప్రతాప్ హాల్) హైదరాబాద్‌లో జరిగిన “సామ్రాజ్యవాద సాంస్కృతిక దాడి వ్యతిరేక అఖిల భారత సదస్సు ఆమోదించిన తీర్మానాలు”ను ప్రచురించారు. రచయితలకు సూచనలు, చందాదారులకు, పాఠకులకు, సానుభూతిపరులకు విజ్ఞప్తి ప్రకటించారు. “సాంస్కృతిక సామ్రాజ్యవాద వ్యతిరేకోద్యమం”కు నాంది పలికిన “సాంస్కృతిక సామ్రాజ్యవాద వ్యతిరేక అఖిల భారత సదస్సు” తాలుకు రిపోర్టు, జనసాహితి సభ్యుడు “వట్టూరి సుబ్బారావు” మరణానికి జనసాహితి సంతాపాన్ని ప్రకటించారు.

1968లో మార్టిన్ లూథర్ కింగ్ హత్య సందర్భంగా “హింసాత్మక, అణచివేతకు వ్యతిరేకంగా, అమెరికాలో నల్లజాతివారి పోరాటానికి మద్దతుగా” మావో రాసిన వ్యాసాన్నీ, ఉద్యమ సూరీడు రాసిన “ఎలక్ట్రానిక్ బూతు” అనే ‘స్పందన’ను ప్రచురించారు. చలపతి రాసిన పాట “కోట్ల గారడీ చూడు”, మూర్తి రాసిన గల్పిక “బ్రాహ్మణ్యం” ప్రచురించారు. అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి సంయుక్త కార్యదర్శి కా॥ అరుణ్ సన్యామత్‌కు విప్లవ జోహార్లు ప్రకటించారు. నాల్గవ కవరు పేజీలో చిత్రకారుడు మోహన్ గీసిన “స్థానిక ప్రజాకళలపై సామ్రాజ్యవాద సంస్కృతి యొక్క దాడిని” చిత్రంగా ప్రచురించారు.

1/8 డెమ్మీలో 66 పుటలు. వెల : రూ. 6/–

## సంపాదకీయం

# నిరంకుశత్వ ప్రజాస్వామ్యం!

**అతిపెద్ద** ప్రజాస్వామ్య భారతదేశంలో లోక్‌సభ, సార్వత్రిక ఎన్నికల ప్రకటన వెలువడింది. ఎన్నికలనే ప్రక్రియ (ఈవెంట్)లో పాల్గొనటానికి పాలకవర్గ పార్టీలన్నీ సిద్ధమయ్యాయి. తమ వాగ్దానాల వరాలను, పథకాల హామీలను ప్రజలపై కుమ్మరిస్తున్నాయి. మద్యం, మాదకద్రవ్యాలు వరదలై ప్రజానీకాన్ని ముంచెత్తనున్నాయి. కులమతాల అంతరాలు, వివక్షలు, ఘర్షణలు రెచ్చిపోతాయి. డబ్బుల కట్టలు ప్రజల కళ్ళముందు నాట్యమాడతాయి. అట్టడుగువర్గాల అభ్యున్నతే లక్ష్యంగా బాకాలు ఊదరగొడతాయి. ఇక ఉపాధి లేక డొక్కలెండుతున్న ప్రజానీకానికి ఎన్నికల ప్రచారపు తాత్కాలిక కనీస ఉపాధి దొరుకుతుంది. పార్టీలవారు దయతలిస్తే బిర్యానీ పాకెట్టూ దొరుకుతుంది. ఓటు హక్కునూ, ఎన్నుకోవల్సిన పద్ధతులనూ నిర్వీర్యం చేస్తూ పాలకవర్గ పార్టీలు వ్యాపింపచేస్తూన్న ఎన్నికల పతన సంస్కృతి ఇది.

ప్రస్తుతం 155.6 ట్రిలియన్ల (ఒక ట్రిలియన్ అంటే లక్ష కోట్లు) అప్పుల్లో దేశాన్ని ముంచి, నిరంకుశ రైతు చట్టాలను, కార్మికుల చట్టాలను, అడవుల నుండి ఆదివాసీలను గెంటివేసే అటవీ హక్కుల చట్టాలను అమలుచేస్తూ, విద్య, వైద్యం ప్రభుత్వరంగ సంస్థలన్నిటినీ ప్రైవేటుపరం చేస్తూ, అత్యధిక నిరుద్యోగులను కలిగివుండి, 74 శాతం ప్రజలు పోషకాహార లోపంతో జీవించటానికి బాధ్యులైన పరిపాలకులు మరోసారి మేకతోలు కప్పుకుని మరో 25 ఏళ్ళు తాము రూపొందించిన వికసిత భారత్‌కు 'మోదీ గ్యారంటీ'ని ప్రకటించారు. దానికి అంతో ఇంతో తేడాతో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ 'న్యాయ్ గ్యారంటీ'ని ప్రకటించింది. ఇక రాష్ట్రాల్లో 'మేము సిద్ధం' అంటే 'మేము సంసిద్ధం' అంటూ ప్రజల జీవితాలతోనూ, జీవన విధానాలకు బాధ్యత వహించటంలోనూ ఏ మాత్రమూ సంబంధం లేకుండా ఎన్నికల ప్రక్రియ (ఈవెంట్) కోలాహలంగా మొదలయ్యింది. ప్రజలు మరింత పేదరికంలోకి దిగజారుతున్న దేశ, రాష్ట్ర పరిస్థితులకు గల కారణాలను – పరిష్కారాలను ఏ పార్టీ మేనిఫెస్టోలోనూ పేర్కొనలేదు.

అమృతకాల్, వికసిత భారత్‌లను ప్రకటించిన మోదీ ప్రభుత్వం ఇప్పటికే కాశ్మీరు ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కును కాపాడే 370ను రద్దుచేసి, కాశ్మీరులోని భూములను కార్పొరేట్లకు అప్పగించింది. తమకు నచ్చిన మతాన్ని ఆచరించే హక్కును ఉల్లంఘించటం వంటి పలు విషయాలతో కూడిన యూనిఫాం సివిల్‌కోడ్‌ను తీసుకువచ్చింది. అడవినీ, అటవీ సంపదలను దోచుకోవటానికి మణిపూర్‌లో జాతుల మధ్య చిచ్చురేపింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి 2014 డిసెంబరు 31కి ముందు భారతదేశానికి వలస వచ్చిన ముస్లిమేతర మతస్తులైన హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, క్రైస్తవులకు ఏ విధమైన పత్రాలు లేకుండానే ఒక సంవత్సరం భారతదేశంలో ఉంటే పౌరసత్వాన్ని ఇచ్చే పౌరసత్వ సవరణ చట్టం సిఏఏ, ఎన్ఆర్‌సిలను ఎన్నికలకు మూడురోజుల ముందే అమలులోకి తెచ్చింది. ముస్లిములను బూచిగా చూపిస్తూ మతోన్మాదాలను రెచ్చగొడుతూ లౌకికతత్త్వ భావనలకు విరుద్ధంగా ఎన్నికలలో పావుగా ఈ చట్టాన్ని ప్రయోగించింది. అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించి అసత్య, అశాస్త్రీయ ప్రచారాలతో ప్రజల ఇహలోక సమస్యలకు పరలోక పరిష్కారాలను చూపుతుంది.

ఇక ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం దొంగలు, దొంగలు ఊళ్ళు పంచుకుని దొరలైపోయిన ప్రజాస్వామ్యపు మేడిపండు స్వరూపాన్ని బట్టబయలు చేసింది. పెద్దనోట్ల రద్దుతో నల్లధనాన్ని దేశంలోకి తెప్పిస్తానని చెప్పి ప్రజలను మోసగించిన ఏలినవారే నల్లధనం యొక్క విపరీతమైన ముప్పును ఎదుర్కోవటానికి ఇంతకంటే ప్రత్యామ్నాయం లేదంటూ ఎన్నికల బాండ్లను ఏకపక్షంగా తీసుకువచ్చారు. ఇది అవినీతికరమైనదని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్, సిపిఎంవారు కోర్టులో పిల్ వేశారు. ఈ కేసును చూస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్, మరో నలుగురుతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం – ఇది భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణం అని వ్యాఖ్యానించింది. రహస్యంగా రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే అవకాశం ఇవ్వటం అంటే రాజ్యాంగంలోని 19(1)ఎ ని ఉల్లంఘించటమేనని కూడా ప్రకటించారు. ఆర్‌టిఐ చట్టం నుండి ఈ బాండ్ల సమాచారాన్ని ఇవ్వటం మినహాయించటమే పాలకవర్గ పార్టీ కపటత్వాన్ని తెలియచేస్తూంది.

2019 ఏప్రిల్ 1 నుండి 2024 ఫిబ్రవరి 15 వరకు 22,217 ఎన్నికల బాండ్లు ఆయా రాజకీయ పార్టీలకు చేరితే అందులో 22,030 బాండ్లను ఆయా పార్టీలు నగదుగా మార్చుకున్నాయి. అందులో 70 శాతం పైగా బాండ్లు అధికార పార్టీ బిజెపికే చెందటం ఆ బాండ్ల విధానపు లక్ష్యాన్ని తెలియచేస్తుంది. ఒక్క వామపక్ష పార్టీలే బాండ్లు ప్రవేశపెట్టటాన్ని వ్యతిరేకించాయి. ఆ పార్టీలే నేటికీ బాండ్లను స్వీకరించలేదు.

ఈ బాండ్ల పథకంద్వారా విరాళాలు ఇచ్చి వ్యాపారం చేసుకోవటాన్ని, కాంట్రాక్ట్‌లకు లంచం ఇవ్వటాన్ని, దోపిడీ విధానాలనూ చట్టబద్ధం చేశారు. స్వయానా సుప్రీంకోర్టు ఆదేశించినా ఎస్‌బిఐ వివరాలు ప్రకటించటంలో జాప్యం చేసిందీ అంటే ప్రభుత్వరంగ సంస్థలు పరిపాలకుల జేబు సంస్థలుగా పనిచేస్తున్నాయే గానీ రాజ్యాంగబద్ధంగా కాదు అని తేటతెల్లమవుతుంది. 'రిపోర్టర్స్ కలెక్టివ్' అందించిన సమాచారం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో ఎస్‌బిఐ 2019–2020లో జారీ అయిన ఎన్నికల బాండ్లు గడువు ముగిసినా 48 గంటల్లోనే దాత – గ్రహీత – బాండ్ల విలువలను మోదీ ప్రభుత్వానికి అందించారు. వాస్తవానికి ఈ బాండ్లను 15 రోజుల్లోగా మార్చుకోకపోతే ఆ మొత్తం

ప్రధానమంత్రి జాతీయ సహాయనిధికి బదిలీ అవుతాయి. ఆ విధంగా కేంద్ర ప్రభుత్వం 187 బాండ్లను రిడీమ్ చేసింది కూడా. 2018లో కేంద్రం ఈ స్కీమ్‌ను ప్రవేశపెట్టినపుడే వాటికి కేటాయించిన నెంబర్ల ప్రకారం ఎస్‌బిఐ సమాచారాన్నంతా వెంటనే చెప్పగలిగిన అవకాశం ఉన్నా సుప్రీంకోర్టుకు మాత్రం జాప్యం చేస్తూ గడువును పొడిగించమని అడగటం పాలకులకు బ్యాంకింగ్ రంగం దాసోహమవటాన్ని తెలియ చేస్తోంది. 'రాయిటర్స్ వార్తాసంస్థ' – కంపెనీలకు, పార్టీలకు మధ్య బాండ్ల వ్యవహారాలను నడుపుతున్న సంస్థల వివరాలను, వారిలో అత్యధిక బాండ్లను బిజెపికి సమకూర్చిపెట్టిన ప్రూడెంట్ ట్రస్టు గురించీ, దాని పని విధానాలను తెలియచేసింది. గత 11 ఏళ్ళలో ఈ ఒక్క సంస్థే 2,256 కోట్లు విరాళాలు సేకరించింది. అందులో 80 శాతం బిజెపికే అందించింది.

మొత్తం బాండ్ల వ్యవహారాన్ని పరిశీలిస్తే బిజెపి ప్రభుత్వపు క్విడ్ ప్రోకో (నీకింత–నాకింత) అర్థమవుతుంది. చాలా కంపెనీల నుండి ఎన్నికల ముందే బాండ్లు అందటం, బాండ్లు ఇచ్చిన కంపెనీలన్నీ కేంద్ర ఏజెన్సీల దాడుల తర్వాతే మోదీ ప్రభుత్వానికి ముడుపులు చెల్లించటం, 30 ఫేక్ కంపెనీల ద్వారా 143 కోట్ల రూపాయలు అందటం అనేవి క్విడ్ ప్రోకోకి ఋజువు. కార్పొరేట్ల నుండేకాక ఇతర శత్రుసంస్థల నుండీ బాండ్లు అందుతున్నాయేమో. 'ది వైర్' ఈ బాండ్ల వ్యవహారంలో రాజకీయ పార్టీలకు – ఫార్మా కంపెనీలకు మధ్య గల ఆర్థిక బంధాలను కూడా వెల్లడి చేసింది. గ్లోబల్ కరప్షన్ బారో మీటర్ (జి.సి.బి) సంస్థ మనదేశంలో సాగుతున్న అవినీతి భాగోతాలుగా ఎలక్టోరల్ బాండ్లు, రాఫెల్ యుద్ధ విమానాలు, యెడ్డీ డెయిరీ, వాటర్ బోర్డ్, ఆదానీ పవర్, బాల్కో (భారత అల్యూమినియం కంపెనీ) ఆయుష్మాన్ భారత్, పప్పుదినుసుల పంపిణీలోనూ, 14.56 లక్షల కోట్ల రుణమాఫీలు వంటివి ఉన్నాయని ఏనాడో ప్రకటించింది. అంటే ఇందుగలడందులేడన్నట్లు ఆహారము, ఆరోగ్యము, ఫాక్టరీలు, రోడ్లు, వంతెనలు అన్నిరంగాలలో క్విడ్ ప్రోకో ద్వారా తన అవినీతి సామ్రాజ్యాన్ని విస్తరింపజేసి కార్పొరేట్లకు, బహుళజాతి కంపెనీలకు దేశంలోని సహజ సంపదలను, శ్రమశక్తిని అప్పనంగా బిజెపి ప్రభుత్వం దోచిపెడుతోందన్నది నిరూపితమైంది. తనకు ఎదురు నిలిచే, లేదా పోటీకి వచ్చేవారందరిపైనా ప్రజాతంత్ర సంస్థలపైనా, నిర్బంధాలను, ఉపా చట్టాన్ని ప్రయోగిస్తూ, రాజకీయ నాయకులను అవినీతి పేరుతో అరెస్టులు చేయించి జైల్లో పెడుతూన్నది. తన నిరంకుశ, నియంతృత్వ పాలనకు సామాజికంగానూ, రాజకీయంగా ఎదురు లేకుండా చేసుకుంటూ ఆర్థిక పరాధీనతలోకి దేశాన్ని తోసేస్తూంది.

ప్రాథమిక అవసరాలైన విద్యా, వైద్యాన్ని కార్పొరేటీకరించటం వెనుక, నిత్యావసర వస్తువుల ధరలు పెరగటం వెనుక, ఆర్టికల్ 370 రద్దు, అటవీ సంరక్షణ చట్టం సవరణ, మూడు రైతాంగ నల్లచట్టాల, నాలుగు లేబర్‌కోడ్‌లను అమలుచేయటాల వెనుక, విచ్చలవిడి విషసంస్కృతి, మద్యం, మాదకద్రవ్యాలు పెచ్చరిల్లటం వెనుక కార్పొరేట్లకు దోచిపెట్టే పాలకుల విధానాలు ఈ బాండ్ల వ్యవహారంతో నగ్నంగా బయటపడ్డాయి. లంచాన్ని లీగలైజ్ చేసి దోపిడీని చట్టబద్ధం చేస్తూ ప్రజల హక్కులను కాలరాస్తూన్న ఈ విధానాలే ప్రజల్ని మరింత దోపిడీ పీడనలకు గురిచేస్తున్నాయి. ఆర్థిక సామాజిక అసమానతలను పెంచుతున్నాయి.

ఎలక్టోరల్ బాండ్ల అవినీతి కుంభకోణం బయటపడి నివ్వెర పరుస్తుండగానే వైజాగ్ ప్రైవేటు పోర్టులో మాదకద్రవ్యాల కంటైనర్ పట్టివేత విషయం దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇంతకుముందు 2021లో ఆఫ్ఘనిస్తాన్ నుండి విజయవాడ చిరునామాకు వస్తూన్న 21 వేల కోట్ల విలువైన హెరాయిన్‌ని గుజరాత్‌లోని ముంద్రాపోర్టులో పట్టుకున్నారు. అట్లాగే తెలంగాణ, ఆంధ్రాలలో మరికొన్నిచోట్లా పట్టుకున్నారు. విశాఖ అటవీప్రాంతం కేంద్రంగా పక్క రాష్ట్రాలతో చేస్తూన్న గంజాయి, మాదక ద్రవ్యాల వ్యాపారం చిన్నదేమీ కాదు. ఒక్క ఏపిలోనే 20.19 లక్షల మంది గంజాయిని వినియోగిస్తున్నారు. అందులో పావువంతు 17 ఏళ్ళలోపు పిల్లలే ఉన్నారు. వాస్తవానికి 2021లో దేశవ్యాప్తంగా 7,49,761 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అందులో ఏపి వాటా 2 లక్షల కిలోలకి పైబడే. ఈ నాలుగేళ్ళలో ఏపిలో 5,33,620 లక్షల కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు పట్టుకుంటున్నది 2% మాత్రమేననీ, మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌లో ఆంధ్ర మొదటిస్థానంలో ఉందని గణాంకాలు చెబుతున్నాయి. వీటికి అలవాటుపడుతున్న పిల్లల, యువత కుటుంబాల భవిష్యత్తే అంధకారమవుతుంది.

పట్టుబడిన 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌లో అధికశాతంలో కొకైన్, మిగతా మెథక్వలోన్, మార్ఫిన్, హెరాయిన్, యాంఫిటమిన్, మెస్కలిన్‌లు వున్నాయి. ఇప్పటికే మాదకద్రవ్యాలు వాడటం వలన రోడ్ యాక్సిడెంట్లలో చనిపోతున్నవారి సంఖ్య, ఆత్మహత్యలు చేసుకుంటున్నవారి సంఖ్య గత సం॥కన్నా 26 శాతం పెరిగింది. ఇక నేరపూరితమైన హింసాప్రవృత్తులకు గురై ఎంతోమంది జీవితాలు నాశనమవుతున్నాయి. ప్రజారోగ్యాన్ని మెరుగుపర్చటం ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యమని 47వ రాజ్యాంగ అధికరణ నిర్దేశిస్తున్నా ఇప్పటికే మన ప్రభుత్వాలు మద్యం ఉత్పత్తులపై ఆధారపడే పరిపాలన సాగిస్తుండటం పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలకు నిదర్శనం.

తెల్లదొరలు పోయి నల్లదొరల పరిపాలన ప్రారంభమయినపుడే ఇది అర్థవలస దేశమనీ, బడా కార్పొరేట్లకు, బహుళజాతి కంపెనీల దోపిడీకి అనుగుణంగా దేశంలో ఆర్థిక విధానాలు రూపకల్పన చేస్తున్నారనీ, ఇక్కడ సంపదనంతా దోచిపెడ్తున్నారని "తాకట్టులో భారతదేశం" 50 ఏళ్ళ క్రితమే అంచనావేసింది. ఇప్పుడు దేశాన్ని ముక్కముక్కలుగా విడగొట్టి అమ్ముతున్నారు. ప్రజల మధ్య కుల, మతాల వైషమ్యాలు పెంచి, మూఢత్వ, అశాస్త్రీయ భావజాలాన్ని మెదళ్ళలో నింపి వారి చైతన్యాన్ని నిర్వీర్యం చేసి తమ దోపిడీ పీడనలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

సామ్రాజ్యవాద, కార్పొరేట్ అనుకూల ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిద్దాం! మద్యం, మాదకద్రవ్యాలను అలవాటుచేసి, మతోన్మాద కార్యక్రమాలను ముమ్మరం చేసి ప్రజలను చీలుస్తూ వారిలో మానవత్వాన్ని చంపేస్తూన్న విషసంస్కృతి వ్యాప్తిని అడ్డుకుందాం. నిరంకుశ, నియంతృత్వ పాలనకు చరమగీతం పాడుదాం. ✺

# అఖిల భారత ప్రజాసాహిత్య, సాంస్కృతిక వేదిక విస్తృత కార్యవర్గ సమావేశం

**అఖిల** భారత ప్రజాసాహిత్యవేదిక కలకత్తాలో 21 ఏప్రిల్ 2012లో నిర్వహించిన మహాసభకు 8 రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ మహాసభలో కొత్తపల్లి రవిబాబుతోపాటు కార్యవర్గం ఎన్నికైంది. ప్రతి ఆరు నెలలకు ఇంగ్లీషు, హిందీ భాషలలో 'పీపుల్స్ లిటరేచర్' (ప్రజాసాహిత్యం) అనే పత్రికను వెలువరించాలని కార్యవర్గం నిర్ణయించింది. ఆ తరువాత 2019లో జరిగిన కార్యవర్గ సమావేశం వేదిక కార్యక్రమాలను సాంస్కృతికరంగానికి విస్తరింపచేయాలనే నిర్ణయం చేసింది. దానికి అనుగుణంగా 15, 16 డిసెంబరు 2019లో కలకత్తాలో జరిగిన మహాసభలో 'అఖిల భారత ప్రజాసాహిత్య, సాంస్కృతిక వేదిక' అవతరించింది. దీనికి అధ్యక్షునిగా ప్రసిద్ధ కళాకారుడు గౌతమ్ ముఖర్జీ, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి రవిబాబుతో పాటు ఇతర రాష్ట్రాల సభ్యులతో కార్యవర్గము ఏర్పడింది.

వేదిక తరఫున 'పీపుల్స్ లిటరేచర్' ఇప్పటికి 10 సంచికలు వెలువడ్డాయి.

వేదికకు సంబంధించిన విస్తృత కార్యవర్గ సమావేశం 2, 3 మార్చి 2024లలో విజయవాడలో జరిగింది. పది రాష్ట్రాల నుండి 50 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. వేదిక కార్యకలాపాల నివేదికను ప్రధాన కార్యదర్శి ప్రవేశబెట్టారు. సాంస్కృతికరంగంలో మన కర్తవ్యాల గురించి అధ్యక్షుడు గౌతమ్ ముఖర్జీ మాట్లాడారు. తమ నాటక బృందం 'సావిక్ సాంస్కృతిక చక్ర' చేబట్టిన ప్రదర్శనల గురించి ప్రసంగించారు. ఆయా రాష్ట్రాల ప్రతినిధులు వారివారి ప్రాంతాలలో చేస్తున్న కార్యక్రమాలను, ఎదుర్కొంటున్న ఇబ్బందులను, వాటిని అధిగమిస్తూ ముందుకు సాగుతున్న వైనాన్ని తెలియచేశారు.

వేదిక ఉపాధ్యక్షుడు దివికుమార్, ఈ సంస్థకు గల రాజకీయ అవగాహనను వివరించారు. ఈనాడు సర్వత్రా వ్యాపించిన సాంస్కృతిక కాలుష్యం గురించీ, కుళ్ళిపోయిన సంప్రదాయ, సామ్రాజ్యవాద సంస్కృతి గురించీ వేదిక కోశాధికారి రమణ ప్రసాద్ మాట్లాడారు.

కర్నాటకకు చెందిన ప్రజారచయిత స. రఘునాథ ప్రజాసాహిత్య దృక్పథాన్ని సవివరంగా విశ్లేషిస్తూ మాట్లాడారు. ప్రతినిధులు ఆయా ప్రసంగాల తర్వాత జరిగిన చర్చలో పాల్గొన్నారు.

తమిళనాడుకు చెందిన మహిళా బృందం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రజాకళాకారులూ, ఒరిస్సా నుండి వచ్చిన బసుదేవ దాస్ మొదలైనవారు జనం పాటలు విన్పించారు.

గౌతమ్ ముఖర్జీ తాము ప్రదర్శించే 'అమ్మ' నాటకంలో తాను అమ్మ పాత్రలో నటించిన సన్నివేశాల్నీ ఆంధ్రప్రదేశ్ ప్రజాకళాకారులు రూపొందించిన వివిధ ప్రజాకళారూపాలలోని కొన్ని దృశ్యాలనూ ప్రదర్శించారు.

వక్తల ప్రసంగాలకు ఇంగ్లీషు, హిందీ, తెలుగు అనువాదాలను ఎప్పటికప్పుడు అందించారు.

ఈ ఏడాది చివర్లో వేదిక అఖిల భారత మహాసభ జరపాలని కార్యవర్గం నిర్ణయించింది.

## అఖిల భారత ప్రజాసాహితీ, సాంస్కృతిక వేదిక తీర్మానం (3-3-2024)

**తమ** ప్రతిభా ఉత్పత్తులను, రచయితలూ, కళాకారులూ సమాజంలోని సాధారణ ప్రజానీకపు ఉద్ధరణకై ఉపయోగించడం వారి విధ్యుక్త ధర్మం. పొలాల్లో పనిచేసే రైతులూ, కర్మాగారాల్లో కష్టించే కార్మికులూ – ఇంకా ఉత్పత్తిరంగంలో పనిచేసే అసంఖ్యాక శ్రామికులూ సమాజ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తారు.


కాని సమాజం సర్వత్రా ప్రజావ్యతిరేక సాహిత్యం, కళలతో ప్రజలను తప్పుదారి పట్టించే భూస్వామ్య, సామ్రాజ్యవాదశక్తుల చేతుల్లో బందీగా వుంది. ఈ శక్తులు ప్రజలలో ఐక్యతను మతపరమైన రాజకీయాలతో భగ్నం చేసి వారిని చీల్చివేస్తున్నాయి. ఆందోళన చేస్తున్న ప్రజలపై అణచివేతను ప్రయోగిస్తున్నాయి. తమ మతతత్వ రాజకీయాలకు మద్దతుగా వారు మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ ప్రజల దృష్టిని మళ్ళిస్తున్నారు. తమ మార్గంలోకి వచ్చేవిధంగా చేయడానికి వారు రచయితలకు, కళాకారులకు సన్మానాలు చేస్తున్నారు. బహుమతులు, బిరుదులు ప్రసాదిస్తున్నారు.

దీని ఫలితంగా తమ సమస్యలకు, ఆకాంక్షలకు పరిష్కారం చూపే ప్రజాసాహిత్యానికీ, కళలకు ప్రజలకు దూరమయ్యారు. కనుక ప్రతి రచయితా, కళాకారుడూ తమ ప్రతిభలను భూస్వామ్య, సామ్రాజ్యవాద సాహిత్యానికీ, కళలకూ వ్యతిరేకంగా చేసే పోరాటాలకు వినియోగించాలి. సామ్రాజ్యవాద యుద్ధాలలో బాధితులకు, సామ్రాజ్యవాద శక్తుల అణచివేతకు గురౌతున్న ప్రజలకు ప్రజా రచయితలూ, కళాకారులూ సంఘీభావాన్ని ప్రకటించాలి.

సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల కుట్రలనూ, కుహకాలను గమనించి, ప్రజారచయితలూ, కళాకారులూ ప్రజావ్యతిరేక రచనలను, సాంస్కృతిక రూపాలను త్రిప్పికొట్టాలనీ, సామాన్య మానవుడు కేంద్రంగా ఒక ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించాలనీ పిలుపునిస్తున్నాం. ✻

వ్యాసం

**ఇది లెనిన్ శత వర్ధంతి సంవత్సరం....**



# కామ్రేడ్ లెనిన్....
# రేపటి ఆశ.. శ్వాస కూడా....!

- మాధవ్ రామచంద్రన్

**వ్లాదిమిర్** ఇల్యిచ్ ఉల్యనోవ్, లెనిన్ కేవలం ఒక పేరు కాదు. 20వ శతాబ్దంలో చరిత్రపై, విప్లవాత్మక ఆలోచనపై, ఈ ప్రపంచ ప్రజల మనస్సులను అత్యంత ప్రభావితం చేసిన వ్యక్తిత్వం. లెనిన్‌కి అమరత్వం లేదంటే, ప్రపంచంలోని పోరాటశ్రేణులు, కార్మికశక్తులే కాదు.. ఎందరో కళాకారులు, ముఖ్యంగా రచయితలు ఏమాత్రం ఒప్పుకోరు. తమ అధ్యయనాల్లో, రచనల్లో ఆయనని ఈనాటికీ చిరంజీవిగానే నిలుపుతూనే వున్నారు. మార్సెల్ లిబ్మాన్ ఒకసారి రాసినట్లుగా 'లెనిన్ అంటే ప్రతి తిరుగుబాటు ఉద్యమపు తొలి పుట'.

కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసే కళాకారులకు, ముఖ్యంగా సోషలిస్టు విప్లవ లక్ష్యంతో కృషిచేస్తూ ప్రపంచంలోని అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించేవారందరికీ స్ఫూర్తిదాయకమైన పేరు లెనిన్. ప్రపంచంలోని వివిధ ప్రముఖ కవులు లెనిన్‌ని తమ రచనల్లో గొప్పగా చిత్రీకరించారు. వాటిని నేను ఇక్కడ చర్చించాలనుకుంటున్నాను. అయితే ఇది సమగ్రమైన జాబితా కాదు – లెనిన్ గురించి రాయడానికి ఎంతమందికి ప్రేరణ లభించిందనేదానికి నిదర్శనం ఆయనపై వచ్చిన అన్ని ప్రపంచ భాషల్లోని లక్షలాది రచనలు. కానీ ప్రపంచ కవిత్వంలో బాగా పేరుపొందిన కొన్నిటిని మాత్రమే ప్రస్తావిస్తాను. ఈ ప్రత్యేకమైన కవితలు 1920 మరియు 1960ల మధ్య కాలంనాటివి. అది ప్రపంచ సోషలిజం నిస్సందేహంగా ఆరోహణపై ఉన్న యుగం, రష్యన్ విప్లవం, లెనిన్ జ్ఞాపకం ఇప్పటికీ ప్రజల మనస్సులలో చిరస్థాయిగా ముద్రించబడే ఉంది.

ఒక గొప్ప కవితను ప్రసిద్ధ ఆఫ్రికన్ – అమెరికన్ కవి లాంగ్‌స్టన్ హ్యూస్ రాశారు. హ్యూస్ హార్లెం పునరుజ్జీవనోద్యమ నాయకుడిగా ప్రసిద్ధి చెందాడు. పౌరహక్కుల ఉద్యమంలో అతని ప్రమేయం, అమెరికాలోని నల్లజాతీయుల పోరాటాల పట్ల అతని జీవితకాల నిబద్ధత చాలా గొప్పవి. ఇక్కడ ప్రస్తావించిన కమ్యూనిస్టు రచయితల కంటే భిన్న రచయిత హ్యూస్. ఆయన కమ్యూనిస్టు కాదు. 1932లో యుఎస్ నుంచి వెళ్లిన ఆఫ్రో–అమెరికన్ల బృందంలో భాగంగా హ్యూస్ సోవియట్ యూనియన్‌ని సందర్శించారు. ఆ పర్యటన ఆయనలో లెనిన్ పట్ల విపరీతమైన ఆరాధన కలిగించింది. ఆయన రాసిన ఓ రెండు కవితలు..

మొదటిదాన్ని "బల్లాడ్స్ ఆఫ్ లెనిన్" అని పిలుస్తారు.

పాలరాయి సమాధిలో సజీవంగా
కామ్రేడ్ లెనిన్,
నాకు కూడా అక్కడే ఒక గదిని
ఏర్పాటు చేయండి.

నేను ఓ రైతుని, ఓ నీగ్రోని
ఎండలో చెరకు నరుకుతాను.
కామ్రేడ్ లెనిన్
కోసమే జీవిస్తాను.
ఇప్పుడే నా పని మొదలైంది.

రెండవది ఒక పద్యం. ప్రపంచవ్యాప్తంగా విప్లవాత్మక పోరాటాలలో నిమగ్నమైన ప్రజలకు లెనిన్ అంటే అర్థం ఏమిటో మరింత స్పష్టంగా తెలియజేసింది.

లెనిన్ ప్రపంచవ్యాప్తంగా నడుస్తాడు.
సరిహద్దులు అతన్ని నిరోధించలేవు.
బ్యారక్స్, బారికేడ్లు అతడ్ని అడ్డుకోలేవు.
ముళ్లతీగ అతన్ని గాయపర్చలేవు.
లెనిన్ ప్రపంచవ్యాప్తంగా నడుస్తాడు.
నలుపు, తెలుపు, గోధుమ వర్ణాలవారు
అతన్ని ఆవాహన చేసుకుంటారు
భాషకు అవరోధం లేదు
అన్ని భాషలవారు అతన్ని నమ్ముతారు.
లెనిన్ ప్రపంచవ్యాప్తంగా నడుస్తాడు.
సూర్యుడు ఒక గాయపు మచ్చలాగా అస్తమించాడు.
తెల్లవారుజాము చీకటిలో
ఎర్రటి నక్షత్రం ఉదయించింది.

తరువాతి కవిత లెనిన్ కోసం వ్లాదిమిర్ మయకోవస్కీ రాసిన సుదీర్ఘ కవితల్లో ఒకటి. "మా సోవియట్ యూనియన్‌లో ఉత్తమ మరియు అత్యంత ప్రతిభావంతులైన కవి"గా ఆయన గురించి స్టాలిన్ అభివర్ణించాడు. 1920లో లెనిన్ 50వ పుట్టినరోజు సందర్భంగా 100 సంవత్సరాల క్రితం మయకోవస్కీ తన మొదటి కవితను లెనిన్ కోసం రాశారు. ఈ ధారావాహికలోని చివరి కవిత లెనిన్ మరణం తరువాత రాశారు. మయకోవస్కీ లెనిన్ మరణాన్ని చాలా వ్యక్తిగతంగా తీసుకున్నట్లు, ఆ గొప్ప నాయకుడితో ఉన్న సాన్నిహిత్యం ఆయన్ని క్రుంగదీసినట్లు ఈ కవిత తెలియచేస్తుంది.

చివరి పద్యం 86 పేజీలకు పైగా 3,000 పంక్తులకు పైగా విస్తరించి ఉంది. ఇది రష్యన్ కమ్యూనిస్ట్ పార్టీకి అంకితం చేసాడు.

ఆయన 1924లో రాసిన కవిత 'లెనిన్' నుండి ఈ క్రింది పంక్తులు ఇస్తున్నా.

మయకోవస్కీ యొక్క విభిన్న శైలిలో ఇది కంపోజ్ చేయబడింది. లిరికల్ రూపానికి అతని ప్రయోగాత్మక విధానం జోడించారు.

సమయం వచ్చింది.
ఇక నేను ప్రారంభిస్తాను
లెనిన్ కథని.
కాదు
దుఃఖం వల్ల సమస్తం
క్షీణించిపోతోంది.
కానీ
మొదటి క్షణం దిగ్భ్రాంతి

లోతుగా కోసేస్తోంది.
బరువు, తీవ్రమైన నొప్పి
అన్ని మార్గాలూ మాస్కోని
స్తంభింపజేసాయి.
భూమి ఉద్వేగానికి లోనవుతుంది.
మంటలు
బాధితులను నడిపిస్తున్నాయి.
అతను ఎవరు?
ఎక్కడ నుండి వచ్చాడు?
ఈ అనంతమైన దుఃఖం ఎందుకు?
ఎందుకు అంతటి గౌరవం....
ఒంటరి మనిషి జీవితం ముగిసినప్పుడు?
పదం ద్వారా పదం లాగడం
జ్ఞాపకాల పేటిక నుండి
(ఈ కావ్యాన్ని పూర్తిగా శ్రీశ్రీ అనువదించారు.)

లెనిన్ గౌరవార్థం ఉర్దూలో రాసిన ఒక కవితని రాజా నయీమ్ ఇటీవల 'ది వైర్' కోసం రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. అల్లామా ఇక్బాల్ రాసిన గొప్ప కవిత అది. అల్లామా ఇక్బాల్, ప్రఖ్యాత కవి, న్యాయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు. మరియు సిద్ధాంతకర్త. ఈ పద్యం దేవుడు మరియు లెనిన్ మధ్య సంభాషణగా, ఈనాటి మానవత్వం వస్తువుగా రాసినది.

ఇక్బాల్ కవిత మూడవ భాగంలో చివరి పాదాలు ఇక్కడ అనువదించి ఇస్తున్నా.

మేల్కొల్పడానికి నా భూమి యొక్క దౌర్భాగ్యానికి వేలం వేయండి
ఉన్నత రాజభవనాల పునాదులు వణుకుతాయి

నమ్మకాల నొప్పితో బానిసల రక్తాన్ని పారించండి
పిచ్చుకలు గద్దల్ని సవాలు చేయగలగాలి.
తప్పు చేయకూడదు
ప్రజాస్వామ్యం ఈ కాలం చేతిలో ఉంది.
పాత సంకేతాలన్నింటినీ నిన్ను విచ్ఛిన్నం చేయమని వేడుకుంటున్నాను

ఆ పొలం తాలూకూ ప్రతీ పోచనీ తగలబెట్టేయండీ,
దానిలో ఇక రైతుల చెమట పారడానికి వీల్లేదు.

దేవుడు, మానవుల మధ్య దూరం వ్యర్థం
చర్చిల నుండి బిషప్‌లను తొలగించిపారేయండి.
అవి నకిలీవి.
ఇసుకతో నాకు సాధారణమైన ఇంటిని నిర్మించండి,
ఎందుకంటే నేను
ఆ పాలరాయి కట్టడాలను ద్వేషిస్తున్నాను.

లెనిన్‌ను ప్రశంసిస్తూ విస్తృతంగా రాసిన మరో కవి జర్మన్ నాటక రచయిత బెర్టోల్ట్ బ్రెష్ట్. బ్రెష్ట్ 20వ శతాబ్దానికి చెందిన ప్రముఖ నాటక రచయితలలో ఒకరు. రష్యన్ విప్లవం నుండి ప్రేరణ పొందిన నిబద్ధత గల కమ్యూనిస్ట్. జర్మనీ నుండి బహిష్కరించబడి, నాజీ నుండి తప్పించుకున్నాడు, చివరికి బెర్లిన్ కమ్యూన్‌ని స్థాపించడానికి యుద్ధం తరువాత జర్మనీకి తిరిగి వచ్చాడు.

లెనిన్‌పై బ్రెష్ట్ రాసిన అత్యంత ప్రసిద్ధ కవిత 'కాంటాటా ఆన్ ది డే ఆఫ్ లెనిన్స్ డెత్'

**1**

లెనిన్ కన్నుమూసిన రోజు
పహారాలో ఉన్న సైనికుడు
తన సహచరులకు ఇలా చెప్పాడు :
"నేను ఏ మాత్రం నమ్మడంలేదు
లోపలికి వెళ్లి,
అతని చెవిలో అరిచాను;
"ఇలిచ్
దోపిడీదారులు వస్తున్నారు!" అతను కదలలేదు

**10**

లెనిన్ వెళ్ళిపోయినట్లు
చెట్టు దాని ఆకులకు చెప్పినట్లు
నేను విన్నాను.

**12**

లెనిన్ భద్రంగానే వున్నాడు....
కార్మికవర్గపు విశాల హృదయంలో
అతను మా గురువు
ఆయన మాతోపాటు పోరాటం కొనసాగించారు
అతను
కార్మికవర్గపు విశాల హృదయంలో భద్రపరచబడ్డాడు.

'కాంటాటా ఆన్ ది డే ఆఫ్ లెనిన్స్ డెత్' పేరిట, బెర్టోల్ట్ బ్రెప్ట్ రాసిన ఈ కవితకు సంగీతాన్ని గొప్ప ఆస్ట్రియన్ స్వరకర్త హాన్స్ ఐస్లర్ సమకూర్చాడు.

లెనిన్ కోసం బ్రెప్ట్ 1935లో రాసిన మరో కవితకు 'హోల్ ఇన్ లెనిన్స్ షూస్' అనే పేరు పెట్టారు :

ప్యాలెస్ ఆఫ్ ది ట్రేడ్స్ యూనియన్ వద్ద
ఇల్లిచ్ ఇరవై మీటర్ల ఎత్తైన విగ్రహాన్ని చెక్కే మీరు..
అతని బూట్లో రంధ్రం ఉందని మర్చిపోకండి,
ఆ రంధ్రం ప్రపంచ పేదరికానికి సంకేతం.
నేను ఖచ్చితంగా విన్నాను,
అతను పశ్చిమ పవనాన్ని ఎదర్కొంటాడు,
అక్కడ చాలామంది నివసిస్తున్నారు,
వారు తమ బూటుల్లోని రంధ్రంతో
ఇలిచ్‌ను తమ స్వంత వ్యక్తిగా గుర్తిస్తారు.

బ్రెప్ట్ లెనిన్‌పై మరో కవితను రాశాడు. దీనికి "ది అన్ కాంకరబుల్ ఇన్స్క్రిప్షన్" అని పేరు పెట్టాడు. ఈ కవిత ఇటాలియన్ జైలులో ఒక అపోక్రిఫాల్ కథను గుర్తుచేస్తుంది, అక్కడ జైలు గోడలపై లెనిన్ పేరు కనిపించింది. జైలు అధికారులు దానిని తుడిచేసిన ప్రతిసారీ, ఆ మరుసటి రాత్రి మరింత స్పష్టంగా కనిపించేలా ఆ కవితను రాసేవారు. దాని స్పూర్తితో బ్రెప్ట్ ఈ కవితని రాశాడు.

లోతుగా చెక్కిన.. అజేయమైన శాసనం ఉంది :

'లెనిన్ దీర్ఘకాలం జీవించండి!'
ఇప్పుడు, సైనికుడు అన్నాడు
గోడను బద్దలు కొట్టడం తప్ప మరేం చేయలేము.

చిలీ కవి, నోబెల్ గ్రహీత పాబ్లో నెరుడా నేను చెప్పే చివరి కవి. నెరుడా నిబద్ధత గల కమ్యూనిస్ట్. అతను తన కవితలలో విప్లవకారుల పట్ల, సోషలిస్టు ఉద్యమం పట్ల తన అభిప్రాయాలను, ప్రశంసలను తన కవితలలో వ్యక్తం చేశాడు, సాధారణ ప్రజల జీవితాలను చిత్రీకరించాడు.

అతను 1959లో లెనిన్‌కు ఒక ఓడ్ (Ode) రాశాడు.
లెనిన్,
నేను మీకు వీడ్కోలు చెప్పాలి:
నేను చెట్లతో, చక్రాలతో, నాగలితో,
తృణధాన్యాలతో మీ పేరుని రాయాలి.
మీరు
నిజంగా భూమిలాగా ఉన్నారు
వి.ఐ.లెనిన్ కంటే భూమితో సంబంధం ఉన్న మనిషి
మరెవ్వడూ లేదు, ఎన్నడూ లేదు.

చర్చిలతో, మేఘాలతో సంభాషించడానికి ఇష్టపడే ఇతర గంభీరమైన పురుషులు చాలామంది ఉన్నారు, వారు పొడవైన, ఒంటరి పురుషులు.
లెనిన్ భూమితో మాత్రమే సంభాషించగలవాడు.
ఒప్పందం కుదుర్చుకోగలవాడు.
అతను అందరికన్నా దూరం నుండి వచ్చాడు, ప్రజలు, నదులు, కొండలు, స్టెప్పీలు.. అన్నిటినీ ఒక తెరిచిన పుస్తకంలా అతను చదివాడు,
అందరికన్నా ప్రేమగా చదివాడు,
అందరికంటే స్పష్టంగా ఉన్నాడు.
అతను ప్రజలను లోతుగా ప్రేమించాడు.

**IV**

కొంతమంది పురుషులు అధ్యయనం చేయడానికి మాత్రమే పరిమితమవుతారు.
లోతైన పుస్తకం, ఉద్వేగభరితమైన విజ్ఞానం,
వారి ధర్మంగా ఉద్యమం యొక్క ఆత్మను కలిగి వుంటారు.
కానీ
లెనిన్‌కి రెండు రెక్కలు ఉన్నాయి :
జ్ఞానం మరియు కదలిక
అతను ఆలోచన ద్వారా సృష్టించబడ్డాడు,
అర్థాన్ని
విడదీసి,
సత్యాన్ని వెలికితీశాడు.
మనిషి యొక్క ముసుగులను విచ్ఛిన్నం చేశాడు
అతడిప్పుడు ప్రతిచోటా ఉన్నాడు,
ఒకేసారి అన్ని ప్రదేశాలలో ఉన్నాడు.

పై కవులందరూ లెనిన్‌ను ప్రశంసిస్తూ కవితలు రాశారు. మయకోవస్కీ శైలి, బ్రెప్ట్ తెలివితేటలు, నెరుడా యొక్క శ్రద్ధ, ఆఫ్రికన్–అమెరికన్‌గా హ్యూస్ యొక్క అనుభవాలు, ఇక్బాల్ మాటలు లెనిన్‌ను అసాధారణంగా వర్ణిస్తాయి. ఏది ఏమయినప్పటికీ, వారందరూ చెప్పినట్లుగా, లెనిన్ వారసత్వం ప్రపంచవ్యాప్తంగా కనబడకుండా విస్తరిస్తూనే ఉంది.

నెరుడా రాసిన ఓడ్ (Ode) నుండి చివరి చరణంతో ఈ వ్యాసం ముగిస్తాను....

ధన్యవాదాలు లెనిన్!
నీ శక్తికి, బోధనలకు,
దృఢత్వానికి ధన్యవాదాలు,
లెనిన్‌గ్రాడ్‌కు, స్టెప్పీస్కు ధన్యవాదాలు....!

ధన్యవాదాలు లెనిన్!
(లెనిన్ శత వర్ధంతి సందర్భంగా....)

**– అంతర్జాలం నుంచి**

మెగెసెసే అవార్డు స్వీకారోపన్యాసం :

# ఆధిపత్యం చలాయించే సంస్కృతిని అసలు సంస్కృతిగానే గుర్తించకూడదు!

- టి.ఎమ్. కృష్ణ

**నేనొక** సంగీతకారుడిని. భారతదేశంలో వున్న రెండు విశిష్ట సాంప్రదాయక సంగీతాలలో ఒకదానిని అభ్యసిస్తున్నవాడిని. ఈ సంగీత ప్రపంచంలో నేనెప్పుడు భాగమైనానో జ్ఞాపకం తెచ్చుకుంటా. బ్రాహ్మణులెందరో నేర్చుకున్నట్లుగానే నేను నా బాల్యంలోనే ఈ కళలో ప్రవేశించాను. విజయం సాధించడమే లక్ష్యంగా నేను 22వ ఏటికి పూర్తికాలపు సంగీతకారునిగా రూపొందాను.

నేను సంగీతం అభ్యసించడం, పాడటంలో మునిగిపోవడానికి ఎన్నో అసాధారణమైన పరిస్థితులు పురికొల్పాయి. ఏమిటీ సంగీతం? దీని చరిత్ర ఏమిటి? దీని ప్రయోజనం ఏమిటి?

ఈ ప్రశ్నాపరంపర నన్ను నేను ప్రశ్నించుకునేట్లు చేసింది. నేను ఎవరిని? నా సామాజిక స్థితి ఏమిటి? నా సంగీతాన్ని ప్రశంసించే ప్రజలు ఎవరు? సంగీతం అంటే కేవలం శ్రావ్యత, లయ అనీ, అది మతపరంగా, సంప్రదాయపరంగా, ఆచారాలపరంగా ఒక కులానికి చెందినట్లుగా, అంటే మా బ్రాహ్మణ కులానికి చెందినట్లుగా, మేమే దానిని నేర్చుకోవాలనీ, సంరక్షించాలనీ - ఇతరులకు - ముఖ్యంగా భారతదేశంలో వున్న నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో చిట్టచివరన అడుగున వున్నవారికి దానితో సంబంధం లేదని దృఢ అభిప్రాయం సమాజంలో ఏర్పడింది.

ఒక విలువైన సౌందర్యాత్మకమైన అనుభవం రాజకీయ, సామాజిక వ్యవస్థకే పరిమితం కావడం తప్పు అని నాకు స్పష్టమైంది. ఇది సమాజానికి అన్యాయం. కళారంగానికి అన్యాయం. ఈ ఆధిపత్య ధోరణిని నేను తప్పక ప్రతిఘటించాలని తలచాను.

కులానికే పరిమితం కావడమనేది అత్యంత సులభం. కానీ నా కళ, నా జీవితంలో ప్రధానమైన నా కళ. భారతదేశంలో ఆధిపత్య సంస్కృతిలో ఒక భాగంగా వుంది. ఆధిపత్యం వహించే ఏ సంస్కృతి ఐనా శక్తిమంతమైనదని చెప్పుకోవచ్చు. కాని అటువంటి దానిని సంస్కృతి అని పిలువకూడదు. అధికారం అధికారమే. సంస్కృతి సంస్కృతే. ప్రతి కులానికీ అట్టడుగున అలమటిస్తున్న కులానికైనా - తనదంటూ సొంత కళ, బహుళ సంస్కృతులు వుంటాయి. అధికారానికైతే ఎత్తైన కోటలు వుంటాయి. సంస్కృతి సాధారణ స్థాయిలో వుంటుంది. ఈ ఎత్తైన కోటలను క్రిందకు దించాలి. నిర్లక్ష్యం చేయబడిన కళాత్మక సంప్రదాయాలను రంగస్థలం మీదకు తీసుకురావాలి.

సమాజానికి చెందిన భౌతికమైన, సాంస్కృతికమైన సంపదలో అందరూ భాగస్తులై వుండాలని ప్రజాస్వామ్యం చెబుతుంది. దీనిని సాధించాలంటే కేవలం సహనం కాదు సహానుభూతి కావాలి - ఒకరి ప్రక్కనొకరు వుండటం కాదు - వారు ఆప్యాయంగా కౌగిలించుకునే పరిస్థితి కావాలి.

ఒక పటం మీద గీసిన గీతలకు సంస్కృతులు పరిమితం కావు. సంక్లిష్టమైన, సుందరమైన ఈ భూగ్రహంలో వున్న ప్రతి మానవుడూ ఎదుర్కొనే పోరాటాలనూ, వేడుకలనూ కళ ప్రతిబింబిస్తుంది. కనుక సామాజిక, రాజకీయ పరిమితులను కళాసంప్రదాయాలను బంధించకూడదు.

ఈ దిశలో నా ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది. దీనిని మరింత అవగాహనతో, మరింత అధ్యయనంతో కొనసాగిస్తాను. సరిహద్దులు లేని జీవితాలతో కళలకు సంబంధం వున్నదని ఈ అవార్డు నాకు గట్టిగా తెలియచేస్తోంది నా సహచర మిత్రుల మార్గదర్శకత్వం, మద్దతులతో నేను ఈ స్థితికి చేరగల్గాను. ఈ అవార్డు నా పేరుతో వచ్చినా, ఇది నిజానికి నన్ను పెంచి పోషించి నన్ను నడిపిస్తున్న మహత్తర సంగీత సంప్రదాయానిధి అనుకోవాలి.

ఒక కర్నాటక గీతంలోని కొన్ని పాదాలు పాడి నేను ముగిస్తాను. దాని గురించి క్లుప్తంగా.

19వ శతాబ్దంలో గోపాలకృష్ణ భారతి అనే సంగీతకారుడు 6, 7 శతాబ్దాలకు చెందిన హిందూ దళిత యోగి నందనార్ రాసిన గీతాలతో ఒక సంగీత రూపకాన్ని రచించారు. నందనార్ దేవాలయంలోని శివుని సమక్షంలో పాడాలనుకుంటాడు. కాని 20వ శతాబ్దపు మొదటి సంవత్సరాల వరకు హిందూ దేవాలయాల్లోకి దళితుల ప్రవేశం నిషిద్ధమన్న విషయం మనం గమనంలో వుంచుకోవాలి.

ఈనాడు 21వ శతాబ్దంలో దళితులు దేవాలయాల్లోకి ప్రవేశిస్తున్నారు - అంతేగాక ఈనాడు వారు సమాజంలోని అన్ని అవకాశాల కొరకు హక్కుల కొరకు అధికారాల కొరకు పోరాడుతున్నారు. ఈనాటి నందనార్లు శక్తిమంతులు నిర్మాణయుతంగా పోరాడే శక్తి గలవారు. వారి హక్కుల గురించి వారికి తెలుసు. అయితే అట్టడుగున పడి వున్న కులాలవారు - జాతులవారు ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాలలో సమానత్వం కోసం రాజకీయంగా, సామాజికంగా, మతపరంగా పోరాడటానికి గల ద్వారాలు మూయబడి వున్నాయి. ✺

# కర్ణాటక సంగీతంలోని బ్రాహ్మణాధిక్యతను, హిందూ దైవ భావనను ఢీకొంటున్న టి.ఎమ్. కృష్ణ

**మదరాసు** మ్యూజిక్ అకాడమీ ఎంతో చరిత్ర కల్గిన సంస్థ. 1927లో మద్రాసులో జరిగిన అఖిల భారత కాంగ్రెసు సమావేశాలలో, దానికి అనుబంధంగా సంగీత మహాసభ కూడా జరిగింది. అప్పుడు వచ్చిన ఆలోచన కార్యరూపం ధరించి 1928 ఆగస్టు 18న వై.ఎమ్.సి.వి ఆడిటోరియంలో ఈ సంస్థ ప్రారంభమైంది.

తన 98వ వార్షిక అవార్డులను సంస్థ అధ్యక్షుడు ఎన్. మురళి 17 మార్చి 2024న ప్రకటించారు. ప్రతి ఏటా ఇచ్చే అవార్డులలో భాగంగా సంగీత కళానిధి అవార్డును కర్ణాటక సంగీతంలో విశేష కృషి చేసిన తెలుగు మూలాలున్న తమిళనాడుకు చెందిన 48 ఏళ్ళ తోడూర్ మాడభూషి కృష్ణ (టి.ఎమ్.కృష్ణ)కు ప్రకటించారు. “కొందరు కులీనవర్గాలకు మాత్రమే పరిమితమైన సంగీత కళను వివిధ సామాజిక శ్రేణులకు చెందిన శ్రోతలకు అందేట్లు చేసినందుకూ, సంఘ సంస్కరణకు సంగీతాన్ని ఒక సాధనంగా చేసినందుకూ, సంగీతంపై విశ్లేషణాత్మక గ్రంధాలను రచించినందుకూ, సామాజిక కర్తవ్యాలను చేపట్టినందుకూ’ ఈ అవార్డును టి.ఎమ్.కృష్ణకు ఇచ్చినట్లు అకాడమీ తన ప్రకటనలో వివరించింది. టి.ఎమ్.కృష్ణ తన సంగీత పరిజ్ఞానాన్ని భాగవతుల సీతారామశర్మ, చెంగల్పట్టు రంగనాధన్, సెమ్మంగూడి శ్రీనివాస అయ్యర్‌ల వద్ద శిష్యరికం చేసి అభివృద్ధి చేసుకున్నారని కూడా ఆ ప్రకటన తెలియచేసింది.

ఈ అకాడమీ 98వ వార్షిక మహాసభలు 15 డిసెంబరు 2014 నుంచి 1 జనవరి 2025 వరకు జరుగుతాయి. ఆ సందర్భంగా జరిగే సమావేశాలకు సంగీత కళానిధి అవార్డు అందుకుంటున్నవారు – అంటే ఈ ఏడాది టి.ఎమ్. కృష్ణ అధ్యక్షత వహిస్తారు. ఈ అవార్డు మిగిలిన అవార్డులను 1 జనవరి 2025న ఇస్తారు.

అయితే, కర్ణాటక సంగీతాన్ని పట్టణాలలోని ఎయిర్ కండిషన్డ్ ఆడిటోరియాల నుండి, పల్లెలకు, సాధారణ ప్రజల వద్దకు తీసుకు వెళ్ళాలనీ, ఈ సంగీత కళలో వున్న బ్రాహ్మణాధిక్యతను, హిందూ దైవ ప్రశంసలను బ్రద్ధలుకొట్టాలనీ గత దశాబ్దంగా నిర్విరామ కృషి చేస్తున్న టి.ఎమ్.కృష్ణకు ప్రకటించడాన్ని సంప్రదాయ సంగీత విద్వాంసులు జీర్ణించుకోలేకపోతున్నారు. టి.ఎమ్.కృష్ణకు కర్ణాటక సంగీతంలో వున్న పాండిత్యాన్ని ప్రక్కనబెట్టి, ఆయన రాజకీయ, సామాజిక అభిప్రాయాలు, కార్యాచరణ విమర్శిస్తూ తాము అకాడమీ కార్యక్రమాలను బహిష్కరిస్తున్నామనీ, తమకు నిర్ణయించిన తేదీలలో కార్యక్రమాలలో కచేరీలు చేయమనీ ఆరుగురు కళాకారులు ప్రకటించారు. వారు రంజని, గాయత్రి అనే ఇద్దరు మహిళా విద్వాంసులు కాగా దుష్యంత్ శ్రీధర్ హరికథా కళాకారుడు. మిగిలిన ముగ్గురు త్రిచూర్ సోదరులుగా ప్రసిద్ధి చెందిన శ్రీ కృష్ణమోహన్, రాంకుమార్ మోహన్, విశాఖ హరి, చిత్రవీణ, ఎన్. రవికిరణ్ తనకు 2017లో ఇచ్చిన సంగీత కళానిధి అవార్డును వాపసు చేస్తానని ప్రకటించాడు. ఈయనపై 2018లో ఇద్దరు విద్యార్థులపై లైంగిక వేధింపులు చేసాడన్న ఆరోపణ వుంది.

కర్ణాటక సంగీతానికి ఎంతో నష్టం చేసినవాడిగా, కర్ణాటక సంగీతంలో సనాతనత్వానికి గోరీకట్టి, మార్క్స్, లెనిన్, మావోలపై, ఏసుప్రభువుపై కీర్తనలు పాడి, నాస్తిక పెరియార్ భావాలను ప్రశంసిస్తూ పాటలు రాసి పాడి, భారతీయతను భగ్నం చేసినవానిగా టి.ఎమ్. కృష్ణను వారు నిరసించారు. తన 12వ యేట నుండీ కచేరీలు చేసిన టి.ఎమ్.కృష్ణ కర్ణాటక సంగీతంపై బ్రాహ్మణాధిక్యతను ప్రశ్నించాడు. పెరియార్ భావజాలంలోని హేతుబద్ధమైన ఆలోచనలను బలపరిచాడు. తాను కేవలం సంగీత విద్వాంసునిగానే కాకుండా, రచయితగా, సామాజిక కార్యకర్తగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఎన్ఆర్‌సి, సిఏఏల వ్యతిరేక ఆందోళనల్లో పాల్గొన్నారు. రైతుల పోరాటాలకు మద్దతునిచ్చారు.

గతంలో మ్యూజిక్ అకాడమీ కృష్ణను వెలివేసింది. కృష్ణ కూడా అకాడమీని వెలివేశాడు. గత పదేళ్ళుగా ఏ ప్రముఖ సంగీత సభలవారూ ఆయన కచేరీలను ఏర్పాటు చేయలేదు. అయినా ఆయన తన ప్రగతిశీల భావాలను మార్చుకోలేదు. ఏసు మీద పాడే భక్తి గీతాలకు శాస్త్రీయ సంగీతాన్ని సమకూర్చడం, ప్రతినెలా కర్ణాటక బాణీలో ఒక పాటని ఏసు మీదో, అల్లా మీదో కట్టి పాడటం తన నిత్య కార్యక్రమంగా రూపొందించుకున్నాడు. సంగీత ప్రపంచంలో అర్బన్ నక్సల్‌గా కృష్ణను సంప్రదాయవాదులు పరిగణించారు.

సంగీతం సార్వజనీనంగా వుండాలనీ, అది కొందరికి మాత్రమే పరిమితమై వుండగూడదనీ, కర్ణాటక సంగీత ప్రపంచంలో బ్రాహ్మణాధిపత్యం వల్ల అది సమాజంలో అన్ని వర్గాల ప్రజలకూ అందడంలేదనీ, కేవలం కులీనవర్గాలకే పరిమితమౌతోందనీ, ఇతర సంగీత ప్రక్రియలు తనలో కలుపుకోవడంలేదని ఆయన విమర్శించారు. అందరూ గౌరవంగా ‘త్యాగరాజ స్వామి’ అని పిలిస్తే ఈయన త్యాగరాజు అని మాత్రమే సంబోధించడం ప్రారంభించారు. త్యాగరాజు కృతులలో కుల, జెండర్, ఆధిపత్య ధోరణులున్నాయని, ఆయనను ఒక దేవుడిగానో, దైవ సమానుడిగానో భావించడం తప్పని ప్రచారం చేశారు. దేవదాసీ కులానికి చెందిన సంగీతకారిణి మధురై షణ్ముఖవాడివు సుబ్బులక్ష్మి బ్రాహ్మణీకరింపబడటం వల్లనూ, ఆమె భర్త టి. సదాశివన్ వ్యాపార వ్యూహకర్తగా, పేకేజింగ్ మరియు మార్కెటింగ్ చేసిన ఫలితంగా ఆమెకు పేరు ప్రఖ్యాతులు వచ్చాయిగాని ఆమె గొప్ప గాయని కాదని కృష్ణ అభిప్రాయపడ్డారు.

కృష్ణ 2016లో రాసిన మొదటి పుస్తకం ‘A Southern Music and Karnatic Story’లో, కర్ణాటక సంగీతంలో వున్న వర్గ, కుల,

లైంగిక వివక్షల గురించి ప్రశ్నించారు. మరో పుస్తకం Reshaping Artలో కర్ణాటక సంగీతాన్ని ప్రజాస్వామీకరించాలని వివరించారు. మృదంగాలను తయారుచేసేవారి జీవితాలపై మరొక గ్రంథం రచించారు. సామాజిక కార్యకర్త నిత్యానంద జయరామన్‌తో కలసి, తన భావాలను ఆచరణాత్మక రూపాన్నిచ్చి, "ఉరూర్ ఓల్కాత్ కుప్పం ఉత్సవాలను, 'స్వానుభవ ఇన్షియేటివ్' అనే చెన్నై పాటల సంస్థతో కలసి సంగీత కచేరీలను సాధారణ ప్రజలు శ్రోతలుగా నిర్వహించారు.

'సంగీత కళానిధి' బిరుదుతో తనను గౌరవించినందుకు ఎంతో ఆనందిస్తున్నాననీ, ఈ సందర్భంగా తనను తీర్చిదిద్దిన కుటుంబ సభ్యులకు, తన గురువులకు, సహచర సంగీతకారులకు ధన్యవాదాలు. 'ట్విట్టర్ (X)లో కృష్ణ తెలియచేశారు.

**(టి.ఎమ్. కృష్ణ రాసిన 'Reshaping Art' అనే పుస్తకాన్ని జి.వి.భద్రం 2019 మార్చి 'ప్రజాసాహితి'లో పరిచయం చేసారు.)** ✺

పాట


# మన పెరియార్!

– టి.ఎమ్. కృష్ణ

**యోచించమన్నాడురా!** మన తంతయ్ పెరియార్!
మథించమన్నాడురా మన మేధస్సును
ఆలోచించమన్నాడురా! మన పెరియార్!
కట్టుకథలను, ఆచారాలను, సంప్రదాయాలను
అర్థం చేసుకొని ప్రశ్నించమన్నాడురా!
స్పష్టంగా, శాస్త్రీయంగా విశ్లేషించుతూ
యోచించమన్నాడురా! మన తంతయ్ పెరియార్!
కులవివక్ష క్రూరత్వాన్నీ,
మతగ్రంథాల ఆంక్షలనీ,
అణచివేతలనీ
అన్యాయపు అంటరానితనాన్నీ
ప్రశ్నించమన్నాడురా!
నిలదీయమన్నాడురా మన పెరియార్!
బాధలనుభవిస్తున్నవారెవరు?
లాభాలు పొందుతున్నవారెవరు?
మెతుకన్నం లేనివారెవరు?
మోసగించి బతుకుతున్నవారెవరు?
అని నిలదీయమన్నాడురా మన పెరియార్!
మనోహరమైన మార్పుకోసం
సంకెళ్ళను తెగగొట్టమన్నాడురా మన పెరియార్!
ఆలోచించమన్నాడురా!
మేధస్సుకు పదునుపెట్టమన్నాడురా!
మన పెరియార్!

(టి.ఎమ్.కృష్ణ పెరియార్‌పై రాసిన ఈ పాటని కర్ణాటక బాణీలో పాడిన వీడియోలోని ఇంగ్లీషు సబ్‌టైటిల్స్ ఆధారంగా తెలుగులోకి అనువాదం చేసినవారు.... **హుష్కీ**) ✺

# ప్రముఖ కన్నడ ప్రజారచయిత స. రఘునాథతో విజయవాడలో ఇష్టాగోష్టి



**అఖిల** భారత ప్రజాసాహిత్య, సాంస్కృతిక వేదిక విస్తృత కార్యవర్గ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన ప్రముఖ కన్నడ ప్రజారచయిత స. రఘునాథతో 4 మార్చి 2024న 'ప్రజాసాహితి' కార్యాలయంలో ఇష్టాగోష్టి కార్యక్రమం జరిగింది. నగరంలోని సాహితీవేత్తలు, సాహిత్యప్రియులు పాల్గొన్న ఈ ఇష్టాగోష్టిలో స. రఘునాథ తన సాహిత్య జీవితక్రమాన్ని వివరించారు. స్కూల్ ఫైనల్ తర్వాత నిరుద్యోగిగా విసుగు చెంది, ఆత్మహత్యకై రైలుకెదురుగా వెళ్ళి, ప్రాణాలతో బయటపడి, కుడికాలు పోగొట్టుకున్న వైనం, ఒకటిన్నర సంవత్సరాలు హాస్పిటల్‌లో చికిత్స చేయించుకోవడం – ఆ తర్వాత తన స్వగ్రామమైన కోలారులో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ సాధారణ ప్రజల జీవితాలు గమనించి సాహిత్య రచన చేయడం గురించి వివరించారు. కర్ణాటకలోని బందాయ సాహిత్య ఉద్యమాన్ని వివరించారు. కన్నడ సాహిత్యంలోని ఉత్తమ రచయితల రచనల గురించి మాట్లాడారు. ప్రస్తుతం కన్నడ సాహిత్యం విషాద యోగంలో వుందని చెప్పారు.

స. రఘునాథ కన్నడ ఆధునిక సాహిత్యంలో కవిత్వం, కథలు, వ్యాసాలు అనేకం రచించారు. తెలుగు నుండి గురజాడ అప్పారావు సాహిత్యాన్ని, నిర్జన వారధి (కొండపల్లి కోటేశ్వరమ్మ ఆత్మకథ), చెరబండరాజు పుస్తకాలను, అన్నమయ్య వాఙ్మయాలను, వేమన సాహిత్యాన్ని జానపద కథలు, పాటలు, పౌరాణికాలు, మొదలగునవి కన్నడ, తెలుగు భాషలలోకి అనువదించారు. ఆయన అనువదించిన తెలుగు కథలు మూడు సంపుటాలుగా వచ్చాయి. తెలుగులోనే ఎనిమిది పుస్తకాలు రాశారు. మొత్తం కన్నడ నుంచి తెలుగు కానీ, తెలుగు నుంచి కన్నడ కానీ కన్నడలో స్వీయ రచనలు కానీ 84 ప్రచురణలు ఇప్పటివరకూ వచ్చాయి. 'ఆరంభ' కన్నడ త్రైమాస పత్రికకు వర్కింగ్ ఎడిటర్ బాధ్యతలు చూస్తున్నారు. ✺

# సలీంఖాన్ గిమ్మీ నవల 'సాంఝ్'

- కొత్తపల్లి రవిబాబు

**గిమ్మీ** పాక్ పంజాబీ రచయిత. ఈ నవలను ఆయన పర్షియన్ లిపిలో పంజాబీ భాషలో రాశారు. దానిని పంజాబీ కవి జిగ్‌తార్ గురుముఖి లిపిలోకి మార్చి 1976లో పంజాబ్ (ఇండియా)లో ప్రచురించారు. ఇది 150 పేజీల నవల. గిమ్మీ 1932లో గురుదాస్‌పూర్ సమీపంలోని జాన్‌పూర్‌లో జన్మించారు. 2010లో లాహోర్‌లో మరణించారు. ఆయన రేడియో పాకిస్తాన్‌లో సెంట్రల్ ప్రొడక్షన్ యూనిట్‌కి డైరెక్టర్‌గా పనిచేశారు. గిమ్మీ రెండు నవలలు, 3 కథా సంపుటాలు, 2 యాత్రా రచనలు రచించారు. ఈ నవలను గిమ్మీ పంజాబీ జానపద గాయకులైన ఆలం లుహార్ (పాకిస్తానీ పంజాబ్), యమ్లా జాట్ (ఇండియా పంజాబ్)లకు అంకితమిచ్చారు.

దేశ విభజనకు పూర్వం గురుదాస్‌పూర్ జిల్లాలోని ఫరీద్‌పూర్ గ్రామం కథాస్థలం. అది 80 గడపల గ్రామం. వారిలో సిక్కులు 40, ముస్లిం పఠాన్లు 30, వివిధ వృత్తి పనివార్లు, వైశ్యులు, నేతపనివారు, మంగలి మొదలైనవారు 10 కుటుంబాలు వున్నాయి. ఇది సిక్కుల ఆధిపత్యం గల గ్రామం కాగా, దీని పొరుగు గ్రామం ఖాన్‌పూర్‌లో ముస్లిముల ఆధిపత్యం వుంది.

ఫరీద్‌పూర్‌లో భూస్వాములైన మురాద్‌ఖాన్, హమామ్‌సింగ్‌లో గ్రామ పెద్దలేగాక ప్రాణ స్నేహితులు. మురాద్‌ఖాన్ కూతురు సుగ్గి (సుగ్రాన్ బీబీ). హమామ్‌సింగ్ కూతురు ప్రీతో (ప్రీతమ్‌కౌర్). వీరిద్దరూ గాఢమిత్రులు.

బూటేఖాన్ కొడుకైన కాదు దాద్‌ఖాన్ ఈ నవల కథానాయకుడు. సంతోక్‌సింగ్ అనే ఒక రౌడీని హత్య చేసినందుకు బూట్ ఖాన్ ఉరిశిక్షకు గురౌతాడు. ఆయన ఆస్తులన్నీ కరిగిపోగా, కొడుకు కాదు దాద్‌ఖాన్, మురాద్‌ఖాన్ సంరక్షణలో వుంటాడు. మురాద్‌ఖాన్ అతన్ని తండ్రిలా ఆదరిస్తాడు.

హమామ్‌సింగ్ చెల్లెలు పొరుగు గ్రామమైన ఓగ్రాన్‌లో వుంటుంది. ఆమె కొడుకు కృపాసింగ్, హమామ్ సింగ్ కూతురు ప్రీతోను ప్రేమిస్తాడు.

మొత్తం నవల మూడు భాగాలుగా సాగుతుంది. మొదటిభాగంలో మూడు సంతలు, లేక తిరునాళ్ళు లేక జాతరల వర్ణన వుంటుంది. మొదటి జాతర ముస్లిములది - సికందర్ జాతర. ఈ జాతరలో కాదు దాదాఖాన్, బిజిలీ అనే నాట్యకత్తెను, ఆమెను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించిన కృపాసింగ్ నుంచి రక్షిస్తాడు. ఈ క్రమంలో కృపాసింగ్ గాయపడ్డాడు. రెండవ తిరణాళ, చిట్టీ తిరణాలలో కృపాసింగ్ ప్రతీకారం తీర్చుకోవాలని కాదు దాదాఖాన్‌పై తన మిత్రుడు హీరాసాన్సితో కలసి దాడి చేస్తాడు. కాని ఈ దాడిలో వారిద్దరూ గాయపడతారు. మూడోది - వైశాఖి తిరునాళ్ళలో కృపాసింగ్, అతని బావమరిదితో కలసి కాదు దాదాఖాన్‌ను చంపినంత పనిచేసి పారిపోయి సైన్యంలో చేరతాడు. అది రెండవ ప్రపంచ యుద్ధకాలం.

తీవ్రంగా గాయపడిన కాదు దాదాఖాన్‌ను డా॥ లెహనాసింగ్ రక్షిస్తాడు. సుగ్గి అతనికి హాస్పిటల్‌లో నెలరోజులపాటు సేవచేస్తుంది. వీరిద్దరి మధ్య సాగుతున్న ప్రేమ వ్యవహారం గురించి గ్రామ ప్రజలు చెవులు కొరుక్కోవడం విని మురాద్‌ఖాన్. కాదు దాదాఖాన్‌ను సైన్యంలో చేరుస్తాడు. అతడు అయిష్టంగానే సైన్యంలో చేరతాడు. నవల రెండవ భాగంలో, బ్రిటిష్ సైన్యంలో వున్న కాదు దాదాఖాన్ బర్మా అడవుల్లో కృపాసింగ్‌ను కలుస్తాడు. కృపాసింగ్ అజాద్ హింద్ ఫౌజ్‌లో సైనికుడుగా వుంటాడు. కాదు దాదాఖాన్ తప్పనిసరి పరిస్థితుల్లో కృపాసింగ్‌ను చంపేస్తాడు. అతన్ని చంపకపోతే కృపాసింగ్ దాదాఖాన్ అంతం చూసేవాడు. చనిపోయే ముందు కృపాసింగ్, కాదును చంపడానికి ప్రయత్నించినందుకు పశ్చాత్తాపపడి తన బంగార వుంగరాన్ని తన ప్రేయసి ఐన ప్రీతోకి ఇవ్వమని కోరతాడు. అతను అంతకుముందే ప్రీతోకి వుంగరం కొనిపెడ్తానని వాగ్దానం చేశాడట!

జర్మనీ సైన్యం ఓడిపోగా, యుద్ధం ముగిసిన తర్వాత కాదు దాదాఖాన్ తిరిగి వస్తాడు. అప్పటివరకూ కృపాసింగ్ ఏమయ్యాడో ఎవరికీ తెలియదు. ప్రీతోకి కృపాసింగ్ ఇచ్చిన వుంగరాన్ని కాదు దాదాఖాన్ అందచేస్తాడు. తనను చంపాలని చూస్తున్న దర్శన్‌సింగ్ ముఠా నుంచి కాదు దాదాఖాన్ తప్పించుకుంటాడు.

ఇక మూడో భాగం. దేశ విభజన కాలం. పట్టణం నుంచి మతోన్మాదుల గుంపు వచ్చి గ్రామంలోని ప్రశాంత వాతావరణాన్ని విషతుల్యం చేస్తారు. వార్తాపత్రికలు ఇరువర్గాలను రెచ్చగొట్టే వార్తలను ప్రచారం చేస్తున్నాయి. మూడు మతాలవారూ తమ తమ వద్ద వున్న ఆయుధాలనుపయోగించి పరస్పరం చంపుకోవాలని ప్రచారం చేస్తున్నారు. మురాద్‌ఖాన్, హర్నామ్‌సింగ్, మౌల్వీ అక్బర్ పరిస్థితిని అదుపు చేయడానికి విఫలయత్నం చేస్తారు.

ఖాన్‌పూర్ గ్రామానికి చెందిన హమ్మేఖాన్, ఫరీద్‌పూర్ గ్రామంలోని సిక్కులపై దాడి చేస్తామని బెదిరిస్తాడు. దానికి మురాద్‌ఖాన్ అతడిని సవాలు చేస్తూ, తమ గ్రామంలోని సిక్కులను ప్రాణాలకు తెగించి రక్షిస్తామని ప్రకటిస్తాడు.

దేశ విభజన ఫలితంగా ఫరీద్‌పూర్ పాకిస్తాన్‌కు చెందిన గ్రామమైంది. ఆ గ్రామంలో మెజారిటీగా వున్న సిక్కుల నైతిక ధృతిపై దెబ్బగొడ్తూ, ఖాన్‌పూర్‌కు చెందిన ముస్లిం మూక ఫరీద్‌పూర్‌పై దాడి చేస్తుంది. ఈ దాడిలో మురాద్‌ఖాన్, హమ్మేఖాన్ చనిపోతారు. ఆ తర్వాత రోజు కూడా దాడి జరగవచ్చునని పుకారు వ్యాపించినా హర్నామ్‌సింగ్

గ్రామం వదలి పారపోవడానికి అంగీకరించలేదు. ప్రాణ స్నేహితుడు మురాద్‌ఖాన్ అంతిమయాత్రలో పాల్గొన్నాడు. తన స్నేహితుడి కోరిక ప్రకారం కాదు దాదాఖాన్, సుగ్గిల వివాహం జరిపిస్తాడు.

ఆ తర్వాత కాదు దాదాఖాన్ మిగతా ముస్లిములను, సిక్కులను రక్షిస్తాడు. సిక్కులను భారత భూభాగంలోకి ప్రవేశిస్తారు. ఆ సమయంలో ఖాన్‌పూర్ గ్రామానికి చెందిన బైరాంఖాన్ ప్రీతోని కిడ్నాప్ చేస్తాడు. కాదుదాదాఖాన్ అతన్ని ఎదుర్కొంటాడు. బైరాంఖాన్‌ను హతమారుస్తాడు. ప్రీతోని రక్షిస్తాడు కాని తాను తీవ్రంగా గాయపడ్డాడు. ప్రీతోని అతడు హర్నామ్‌సింగ్ కుటుంబానికి అప్పచెప్పి దాదాఖాన్ మరణిస్తాడు. దానితో నవల ముగుస్తుంది.

రచయిత గిమ్మీ దీనిలో హిందువులను తెలివిగలవారిగానూ, జిత్తులమారివారిగానూ, ముస్లిమ్‌ల విశాల దృక్పథమూ, మంచి ప్రవర్తన గలవారిగానూ చిత్రించారు. స్వాతంత్ర్యం వస్తే హిందుస్తాన్, పాకిస్తాన్, ఖలిస్తాన్‌లుగా దేశం విభజింపబడుతుందని రచయిత వూహిస్తాడు.✺

# సోహన్‌సింగ్ శీతల్ నవల 'టూటన్‌వాలా ఖుహ్'

## (మల్బరీ చెట్ల మధ్య వున్న బావి) "The Well Surrounded by Mulberry"

**పంజాబీ** రచయిత సోహన్‌సింగ్ శీతల్ కవి, గేయ రచయిత, నవలాకారుడు. ఆయన 7 ఆగస్టు 1909లో జన్మించారు. తన 89వ యేట 23 సెప్టెంబరు 1998లో మరణించారు. పంజాబీ భాషలో రాసిన ఈ నవల 1970 దశాబ్దపు మొదటి సంవత్సరాలలో వెలువడింది. ఇది 300 పేజీల నవల. శీతల్ 1947 తర్వాత సాహిత్యరంగంలోకి ప్రవేశించాడు. మొదట్లో ఎన్నో సాధారణమైన నవలలు రాశారు. ఆ తర్వాత సెంట్రల్ పంజాబ్ ప్రాంతంలోని గ్రామీణ జీవితాన్ని, ప్రజలను తన నవలల్లో చిత్రించారు. "యుగ్ బదల్‌గయా" అనే పుస్తకానికి 1974లో కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతిని అందుకున్నారు.

ఉమ్మడి పంజాబ్‌లోని కసూర్ పట్టణానికి సమీపంలో వున్న పిరువాలా గ్రామంలో ఈ కథ జరుగుతుంది. గ్రామం పొలిమేరలో ఒక బావి – దాని చుట్టూ మల్బరీ చెట్లు వుంటాయి. అక్కడ వున్న 16 బీఘాల భూమి ఎస్. చాంద్‌సింగ్‌కూ, చౌదురి చారాగిన్‌లకు చెరిసమానంగా వుంటుంది. కాని బావి మాత్రం ఉమ్మడి ఆస్తి. వేసవికాలంలో ఆ వూరివాళ్ళు ఈ మల్బరీ చెట్లక్రింద పేకాట ఆడుతూ కాలక్షేపం చేస్తుంటారు.

ఇక ఈ గ్రామ చరిత్ర చూస్తే – 130 ఏళ్ళపాటు బతికిన యాత్రి అనే అతను ఆరేడుతరాల క్రితం ఈ గ్రామాన్ని స్థాపించాడు. అతనికి సుధు, బుధు అని ఇద్దరు కొడుకులు. సుధు కుటుంబానికి చెందినవాడు సజ్జన్‌సింగ్. బుధు కుటుంబానికి చెందినవాడు ఇలామ్‌దిన్. వీరిరువురు సిక్కు, ముస్లిం కుటుంబాలవారైనాసరే వారి పూర్వీకుడు ఒక్కడే. యాత్రి సమాధి దగ్గర పూజలు జరుగుతుంటాయి.

ఈ నవల రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రారంభమై దేశ విభజనతో పూర్తవుతుంది. ఇలాందీన్, సజ్జన్‌సింగ్ ప్రాణ స్నేహితులు. కసూర్ పట్టణంలో ధన్నేషా వడ్డీవ్యాపారి. పిరువాలా గ్రామంలో మల్బరీ చెట్లున్న భూమిని కొనాలనుకుంటాడు. ముందుగా సజ్జన్‌సింగ్, ఇలాందీన్‌లను అప్పుల వలలో ఇరికిస్తాడు. ఇద్దరి మధ్య కలతలకు బీజాలు వేస్తాడు. ఫలితంగా ఆ గ్రామం సిక్కులు – ముస్లిములుగా విడిపోతుంది.

ఆ వూరిలో బాబా అకాలీ అనే పేరుతో అందరిచేతా పిలువబడే కరాంసింగ్ మిలిటెంట్ జాతీయవాది. స్వతంత్ర పోరాటంలో ఢక్కామొక్కీలు తిన్నవాడు. గాంధీ భావాలను సమర్థించేవాడు. చాలాసార్లు జైలు శిక్షలు అనుభవించినవాడు. 100 రోజులుపైగా నిరాహారదీక్ష చేసినవాడు. ఇక ఈయన జైలు నుంచి శాశ్వతంగా బయటకు రాడు అని నిర్ణయించుకుని, ఈయన భార్యకు ఆమె తల్లిదండ్రులు వేరే పెళ్ళి చేస్తారు. కాని ఆ భార్యకు ఈ భర్త అంటే తగని ప్రేమ కనుక ఆత్మహత్య చేసుకుంటుంది. ఈ విషాదాన్ని దిగమ్రింగి బాబా అకాలీ స్వాతంత్ర్య పోరాటంలో పూర్తిగా మునిగిపోతాడు. గ్రామమంతా ఆయన్ను గౌరవిస్తుంది.

బ్రిటీషువారిని మనదేశం నుంచి పారద్రోలాలనే లక్ష్యంతో సాగిన స్వాతంత్ర్య పోరాటంలోని వివిధ ఘట్టాలను చెప్పడానికి రచయిత ఈ పాత్రను ఉపయోగించుకుంటాడు. కర్తార్‌సింగ్ శరభ, భగత్‌సింగ్, బబ్బర్ అకాలీలు, జలియన్‌వాలాబాగ్ దురంతం, మైకేల్ ఓ డయ్యర్‌ను ఇంగ్లండ్ వరకు వెంటాడి 1440లో అతనిపై ప్రతీకారం తీర్చుకున్న ఉద్దమ్‌సింగ్, సిక్కు మోర్చాల కథ, "క్విట్ ఇండియా ఉద్యమం", నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్ ఉద్యమం మొదలగునవన్నీ అకాలీ బాబా వివరిస్తూ వుండేవాడు.

బాబా అకాలీకి జాతీయతా భావం పట్ల స్పష్టత వుంది. మత ప్రాతిపదికపై దేశాన్ని రెండు ముక్కలు చేయడాన్ని ఆయన అంగీకరించలేదు. హిందూ, ముస్లిం, సిక్కులకు అవినాభావ సంబంధం వుందని నమ్మాడు. వర్గదృక్పథం వుంది. పేద రైతులపై, కార్మికులపై జరిగే దోపిడీని వ్యతిరేకించాడు. భగత్‌సింగ్ కలగన్న వర్గరహిత, దోపిడీ రహిత సమాజం కావాలనేవాడు.

అయితే గ్రామంలోని ఇరువర్గాలవారు ఒకరిపై మరొకరు దాడి చేయడానికి మోహరించి వున్న సమయంలో – వారిని ఆపడానికి ప్రయత్నించకుండా ఆనందంగా చూస్తున్న వలస ప్రభుత్వ పోలీసులను అసహ్యించుకుంటూ – బాబా అకాలీ తన ప్రాణాన్ని లక్ష్యపెట్టకుండా ముందుకు వచ్చి – గ్రామస్తులలో మత ద్వేషపు భావాలను తొలగించడంలో కొంత విజయం సాధిస్తాడు.

ఆ సమయంలో దేశ విభజన ప్రకటన వచ్చింది. పిరువాలా గ్రామం పాకిస్తాన్‌లోకి వచ్చింది. ధన్నేషా పన్నిన వలలో పడిన ఇలాందీన్, సజ్జన్‌సింగ్‌లు తమ తప్పు తెలుసుకుంటారు. ఇలాందీన్ తన కుటుంబ

సమేతంగా గ్రామంలోని సిక్కు కుటుంబాలన్నిటికీ రక్షణగా వుండి ఇండియా సరిహద్దుకు క్షేమంగా చేరుస్తాడు.

నవల చివర్లో బాబా అకాలీ "బ్రిటీషువాడు పోతూపోతూ మనల్ని విభజించాడు. ఈ విభజన శాశ్వతంగా కొనసాగదు. మనందరిదీ ఒకటే రక్తం. ఒకటే జాతి. మనం మరలా కలసిపోతాం. ఎవరూ మనలను వేరు చేయలేరు" అని ఉద్వేగంగా అనడంతో నవల ముగుస్తుంది.

రచయిత శీతల్ ఈ నవలలో స్వాతంత్ర్య పోరాటంపై కేంద్రీకరించారు. మతమేదైనా సరే ప్రజలు ఐక్యంగా వుండాలనే సందేశం ఇచ్చాడు.

గిమ్మి, శీతల్ రాసిన రెండు నవలల్లోనూ ముస్లిములు తమ సిక్కు సహోదరులకు రక్షణ ఇచ్చి, సరిహద్దుకు చేరుస్తారు. గిమ్మి మత ప్రాతిపదికపై విభజనను సమర్థించగా, శీతల్ దానిని ఒక అసహజమైన దానిగా, విషాదకరమైనదానిగా పరిగణిస్తాడు. బ్రిటీషువారిని తరిమి వేయడమేగాక, దేశంలో శ్రామిక రాజ్యస్థాపనను శీతల్ సమర్థిస్తాడు.

రెండు నవలలు కథాస్థలం పాకిస్తాన్‌లోకి పోయిన సరిహద్దు గ్రామాలే. రెండింటిలోనూ గ్రామీణ పంజాబీ సంస్కృతి చిత్రీకరింపబడింది. గిమ్మి నవల 'సాంఝ్' వ్యక్తిగతమైన సంఘటనల సమాహారం కాగా, శీతల్ నవల "టూటన్‌వాలా...." జాతీయ సంఘటనల సమాహారం. ✷

# నా మాట

**(బూటకపు ఎదురు కాల్పులలో నవలా రచయిత విశ్వమోహనరెడ్డి, మహిళా కార్యకర్త మరియమ్మ మరణించి ఈ ఏప్రిల్ 12కి 24 ఏళ్ళు. విశ్వమోహనరెడ్డి తన ప్రగతి ప్రెస్ ద్వారా ఇంకొల్లు నుండి ప్రచురించిన నవల 'ఎవరి స్వార్థం వారిదే'కి రాసిన 'నా మాట' ఆయన సాహిత్య జీవితసారాన్ని తెలియచేస్తుంది. వారి వర్థంతి సందర్భంగా దీనిని అందిస్తున్నాం. – *సం॥*)**

ఇది నా మొదటి నవలా కాదు, తుది నవల కూడా కాదు. అందువల్ల నేనీ నవల వ్రాసినందుకు ఆత్మసంతృప్తి చెందడమో, లేక విర్రవీగడమో చేయవలసిన అవసరం నాకేమీ లేదు.

నా నవలలు చదువుతున్నవారికి, ఏదీ కేవలం ఊహాగానం కాదని తెలుసుకోగలరనే నేననుకుంటున్నాను. ఈ సమాజంలో ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయి. వీటన్నిటినీ విడచి కేవలం భ్రమలతో, ఊహలతో, రాయదలచుకోలేదు నేను.

పాఠకులను భ్రమింపచేయడానికి, వారితో 'శహభాష్' అనిపించుకోడానికి, ఎందుకు ఊకదండపుడు (కల్లబొల్లి) నవలలు రాయకూడదు? రాయడం చేతకాదా అని కూడా కొందరు పాఠకులు ఇంతకుముందే నాకు రాశారు. నా పదిహేనో ఏట డిటెక్టివ్ నవలా సాహిత్యంలో నేను సృష్టించిన పాత్రలు, సంఘటనలు అన్నీ ఊహాగానాలేననీ వీరికి తెలుపుతున్నాను. మొదట పాఠకులను కేవలం చదివించడానికి, వారు తర్వాత ఏమయితే నాకేం అన్న దృక్పథంతోనే నేనూ కొంతకాలం రాసాను. ఆ తర్వాత నా తప్పు తెలుసుకున్నాను. నా పాఠకులకు ఓ నీతి, ఓ సత్యం తెల్పాలి. ఈ సమాజంలో జరిగే కుళ్ళు, కుతంత్రాలు, మాయలు, మోసాలు, వాటిని ఎదిరించేవారిని గురించి కూడా తెల్పాలి. ఇవి ఊహాగానాల వల్ల జరిగే పనికాదు. ఉదాహరణకు ఒక స్త్రీని రేప్ చేసినట్లు నవలలో రాయడం తేలికే! కానీ నిజ జీవితంలో అంత తేలిక కాదు. ఆ రేప్ జరిగిన తర్వాత జరిగే సంఘటనలు ఊహించలేం కూడా! ఊహించినా అవి ఎన్నడూ యథార్థాలకు సంబంధం ఉండదు. అందువల్లే నా నవలలు చదివే పాఠకులు లక్షల సంఖ్యలో ఉండాలన్న ఆశ విడిచి, చదివిన తర్వాత కొద్దిమంది పాఠకులయినా ఆ నవలలో చెప్పిన విషయాన్ని ఆలోచించగల స్థాయిలోనికి తీసుకురావాలనీ, ఆ నవల ద్వారా సమాజంలో వున్న కుళ్ళును, దానికి ఎదురీతలను అర్థం చేసుకోవాలనే ఉద్దేశంతో కేవలం యథార్థ గాథల్ని మాత్రమే నేను రాస్తున్నాను.

యథార్థగాథలు రాయడం వల్ల రెండు ఇబ్బందులు వస్తున్నాయి. ఒకటి – అది ఫలానా కుటుంబానికి చెందిన కథగా అర్థమయినప్పుడు, వారితో పేచీలు, వ్యవహారాలు, కాగా రెండవది. పాఠకులను భ్రమలో ముంచడానికి అవకాశం లేకుండా పోతున్నది. యథార్థగాథ అని తెలియకున్నా, చదివినంతసేపూ, ఎక్కడో తాము చూశామన్న భావనలో ఉంటున్నారు పాఠకులు. "ఇది జరిగే అవకాశం వుందా?" అన్న భ్రమ కలుగడంలేదు. అందువల్ల యథార్థగాథలు రాసేవారికీ చదివేవారికీ కూడా కష్టంగానే వుంటున్నాయి. అయినా పాఠకులను సోమరిపోతులను చేసే కల్పితాలకంటే, ఆచరణలో ఒక్క పాఠకుడ్నయినా కదిలించడానికి పనికివచ్చే యథార్థాలే రాయడం నా ఉద్దేశం. చివరివరకూ ఇదే పద్ధతి అనుసరిస్తాననీ, ఎట్టి వాస్తవరహిత, ఆధారరహిత, అభూత కల్పనలు నేను రాయబోననీ, నా పాఠకులకు నేను తెల్పుకుంటున్నాను.



***అభినందనలతో***

మీ

కొమ్మిరెడ్డి విశ్వమోహనరెడ్డి

గల్పిక

# టముకు

– శంకరం

**"అక్కల్లారా,** అన్నల్లారా; తమ్ముల్లారా, సెల్లెల్లారా; అమ్మల్లారా, అయ్యల్లారా! ఇనుకొండినుకొండి! బూ పెపంచకం మొత్తం మీదే పేద్ద పండగొచ్చీసింది. అడిగినోడికీ, అగడనోడికీ కానుకలే కానుకలు. పరిగెత్తండి.. లంకించుకొండి.... లాక్కున్నోల్లకి లాక్కున్నంత.... దక్కించుకున్నోల్లకి దక్కించుకున్నంత.... తాగినోల్లకి తాగినంత.... తినగలిగినోల్లకి తినగలిగినంత.. లగించుకోండి.... ఆలీసం సెయ్యకండి".

"దాసూ!"

"ఏం బాసూ!"

"ఈరిగాడేటి ఊల్లోకొచ్చి టముకేత్తండు.... ఈడికి పిచ్చి బాగా ముదిరిపోనాదిరా".

"ఎహె! ఆడుసెప్పీ సంగతులు సానా కరెస్టుగుంటాయిరా".

"ఎల్దావంటావా?"

"ఎట్టాగూ పేక్ట్రీ మూసీసినారు.... నాలుగు లచ్చల టన్నులు ఆడాల్సింది రొండు లచ్చలు కూడా ఆడ్నేదు. సేసీ పనేటుంది గోల్లు గిల్లుకోడం తప్ప. ఆడు సెప్పే మాటలన్నా ఇందాం పదెల్దాం".

"ఔనుకానొరె! ఎవుడొచ్చినా పేక్ట్రీని పట్టించుకోడం నేదేట్రా?"

"ఏటి సేత్తాం మన గాచ్చారం అట్టుంది. ఇంగో రొండేల్లేనట పేక్ట్రీ ఆడీది, తొత్తుకొడుకులు పెతీఓడూ పేక్ట్రీని బెమ్మాండంగా ఆడించెత్తాం అనీవోడే...."

"ఏట్రా ఈరిగా ఈది మద్దెన సిందులేత్తన్నావ్?" అన్నారు చుట్టూ ఉన్న జనంలోంచి ఎవరో.

"సిందులు గాదు బావ్! మనోల్లు గిప్పలు తెచ్చుకోనీకి పరిగెడతన్ను గదా..... ఒక్కపాలి కుసింత ఆగి నాజ్జెప్పీదినమంతన్నాను".

"సర్లే సెప్పవోయ్ ముందు".

"అంతన్నాడింతన్నాడే గన్నురాజు.... ముంతమామిడి సిగురన్నాడే గన్నురాజు, నేనున్నా – నేనిన్నా అని దండాలెట్టాడే, బుగ్గలు నవిరినాడే ఒక్కసారి నన్ను పైకెక్కిస్తే – మిమ్మల్ని ఏడకో తీసుకుపోతానన్నడే అంతన్నాడింతన్నాడే గన్నురాజు.. ముంతమావిడి సిగురన్నాడే గన్నురాజు".

"వురేయ్! ఎకసెక్కం మానీసి తిన్నగ సెప్పరాదూ అరదవయ్యానాగ".

ఇక్కరమాదిత్య మారాజు పోసించినట్టు మన గన్ను మారాజు కూడా నవరత్నాలతో మనల్ని పోసించినాడు. అడిగినోడికి, అడగనోడికి సేతికి ఎవుక లేకుండా సొమ్ములు పంచుకుంటూ పోనాడు. మా సిన్నప్పుడు సోసలు మాస్టారు సెప్పినారు – ఎవుడో మారాజు.... ఆ అర్సుడు.... నాయాల్డి ఐదేల్లకోసారి ఆయనగ్గరున్న సొమ్ములన్నీ పెజానీకానికి దానం సేసీఓడట. అదిగలాగ మన గన్ను మారాజు కూడా పెతీ సవచ్చరం అందినకాడిన అప్పులు సేసీసి మరీ పంచీసినాడు దరమరాజు! అక్కడితో ఆగినేడా? అయ్యా! నానీ మట్టి తోలుకుంటాను, నానీ ఇసక తోడుకుంటాను, నానీ బూవులు లాక్కుంటాను, నానీ కొండలు గోక్కుంటాను అన్న పెతి ఒక్కడికీ వాల్‌రైట్ అనీసినాడు ఎంతదరమం?

"ఓ పక్క పనుల్లేక అల్లాడుతుంటే డబ్బులు పంచినాడు, ఎవుడు సేసేడలగ?"

ఒప్పుకుంతాను బావూ! గన్ను మారాజునాగ ఎవురూ సెయ్యనేదు. పెజల్ని సోమరిపోతుల్ని జేసి, రాస్టరాన్ని అప్పులకుప్పగ జేసి అవుసురం ఉన్నోల్లకీ, లేనోల్లకీ సొమ్ములు పంచినోడు ఎవ్వడూ లేడు.

"నోటికొచ్చిందంతా వాగమాకొరే, మక్కెలిరగదన్నీగల్ను!"

"ఓహో, నర్సిరెడ్డిగారా! బావూ పంచాయితీ నిండా మీవోల్నే ఎట్టుకుని ఏటిసకంతా తోలీసి అంపకాలు ఎట్టా జేసుకున్రో ఊరోల్లందర్కీ తెలుసు, కుసింత తగ్గండి".

"తాగీసు వాగుతున్నాడు ఈడితోఏట్రా పదండెల్దాం".

"ఆగండాగండి, ఏటిక్కడితో అయిపోనాదనుకుంతన్నారేటి, ఇంకా ఇసిత్రాలు సానా ఉన్నై, సివరాకరిదాకా ఇనెల్లండి.... నాయుడోరింటికాడ.... నల్లతుమ్మసెట్టు కింద నాయుడేమన్నాడే పిల్లా.... అమ్మో! గుండె జల్లుమన్నాదే బుల్లా....

అప్పసెల్లెల్లారా.... అన్నదమ్ముల్లారా.... ఈ సిత్రాలు గూడా ఇనండహో.... డుండుం డుం డుం డుం....

ఉట్టికెగరలేనమ్మ.... సొరగానికెగురుతాదంట....

నాయుడుబావంతన్నారు గదా.... వచ్చే ఐదేల్లలో పేదోల్లందర్నీ పెద్దోల్లుగా సేసీతారంట. ఎట్టాగో సెప్పమంతే.... నీకెందుకంతన్ను.... మరి ఎట్టా సేత్తరేమో!

దేశివంతా అనుకుంతన్నాది గన్నుమారాజు ఆందరాస్ట్రాన్ని ఇరవై ఏల్లు ఎనక్కి తీసుకుపోనాడని.... రాస్టరానికి మొత్తం మీన ఆరున్నర లచ్చల కోట్లు అప్పులున్నాయనీ.... అప్పుడే బుట్టిన పెతి పిల్లకాయ నెత్తిమీనా లచ్చరూపాయల్కి పైగానే అప్పుందట.

అంతే గాదండోయ్! అన్నదాతలంటే నాయుడుబావుకి ఇపరీతమైన ప్రేమ. గన్ను మారాజు రైతుల్కి సమచ్చరానికి ఏడేలు (ఏడు వేలు) ఏత్తే, ఈనగారు ఇరవైఏలేత్తారట (20 వేలు).

ఎట్టా ఏత్తారు బావూ అంతే.... నీకెందుకంతన్ను!

ఇంతకంటే సోద్దెం సెప్పమంతారా.... పెతీయింట్లో పద్దెనిమిదేల్లు నిండిన ఆడోల్లు ఎంతమందిరున్నా ఒక్కోరికి నెలకి పదిహేనొందలు ఆల్లెకవుంట్లో తిన్నగొచ్చి పడిపోద్దట భలేగుంది గదూ ఇంటానికి?

సొమ్ములేడనుండి ఎలిపొత్తాయి బావూ అంతే.... నీకెందుకంతన్ను!

"బీసీలందరి కోసం ఏదో సెట్టం సేత్తరంట గదా, మంచిదే గదూ?"

ఎవ్రా అది? ఈ మద్దిన పెతొక్కడూ నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ ఊగిపోత్రను. ఇట్టా ఊగిపోయినోల్లందరూ బీసీలకి ఏటి సేసీసినారు?

నాయుడు బావు బీసీలందర్నీ రచ్చించడానికి ఒక సెట్టం సేసి సేతులు దులుపుకుంటాడట. సెట్టాలు ఉన్నోల్లకి సుట్టాలని నీకు తెల్దేటి? ఇట్టాంటి సెట్టాలు ఎన్ని రానేదు?

పెతీ ఇంటికీ కొలాయిలు పెట్టి సుబ్బరవైన నీరు అందిత్తాడట. నా సిన్నప్పట్నుండి ఈ మాట ఇంటూనే వున్నాను. అసలుకి మందేశంలో కుల్లునీరు తాగడం వల్లే సగం మందిరి పోతున్నారట. ఎన్నిసార్లు పేరంబోస్తవాలు సెయ్యనేదు? సిలాపలకాలు మాత్రవే మిగిల్నాయి మట్టిగొట్టుకుపోయి.

ఆకరికీ అడిగా ఎట్టా ఇత్తావయ్యా అని? నీకెందుకూ అంతండు!

20 లక్షల ఉజ్జోగాలిస్తాడట కదా, అంతకంటే ఏం కావాల్రా?

పేక్ట్రీలొత్తాయా? యవుసాయం మంత్రం ఏసినట్టు ఒక్కసారే బాగుపడిపోద్దా?

ఐదేసి వేలిచ్చి వోలంటీర్లనెట్టినట్టు ఎట్టాలన్నా కోట్లు కర్సొత్తాయి. ఎక్కడ్నుండొత్తాయి? రావు కాబట్టే ఉజ్జోగం, సజ్జోగం తనోల్లకి నెలకి మూడువేలిత్తాడట. నోట్లు గుద్దుతావా అనడిగితే, నీకెందుకూ అంతండు!

గన్ను మారాజు సెట్టుకింద పిలీడర్లకు ఐదువేలు పంచితే నాయుడుబావు ఏడువేలిత్తాడట. ఇద్దూరంగా నేదా?

గన్ను మారాజు 'అమ్మఒడి' పేరుతో ఒకింటికి ఒక బిడ్డకి సవచ్చరానికి పద్దెదు వేలిత్తానని, రొండు తెగ్గోసి ఎట్టాగైతే పదమూడిచ్చినాడు. నాయుడుబావేమో 'తల్లీ నీకో నమస్కారం' అంటూ ఆ తల్లి ఎంతమందిని కంటే అందరికీ పద్దెదు వేలిత్తాడట. ఒక్కో కుటుమానానికి ఏడాదికి 3 చిలిండర్లు ప్రీగా ఇత్తాడట. ఇయ్యన్నీ గాకుండా ఆడోల్లందర్కీ బస్సులు ప్రీ.

ఇంటన్నారా తల్లుల్లారా, తండురుల్లారా, ఆడకూతుర్లారా, బొక్కలడిపోయిన రోడ్లు సూత్తే ఈ రాస్టరం ఎట్టాగుందో ఎవరికైనా అరదమవుద్ది. రోడ్లకి రిపేరులే సేయించలేనోల్లు, దేశింల రైతన్నలు ఆత్మత్యల్జేసుకుంటున్న మూడో రాస్టరంలో అయినకాడికి అందినంతా అప్పుల్జేసీసి మనందరికీ సొమ్ములు పంచుతారంట. ఇట్టా సొమ్ములు పంచుకుంటూ పోతే మిగిలేయి అప్పులే గదంట!

ఎల్లండెల్లండి.... లగెత్తండి.... తాయిలాలు తెచ్చుకోండి.... మనసొమ్మే గదా.... మల్లా కరెంటు సార్జీలు, బస్సు సార్జీలు, చినిమా టికెట్లు, పాలపేకెట్లు, ఉప్పూ, పప్పూ.... అన్నీ పెరుగుతాయి. బరించేది మనవే గదా! పరిగెత్తండో.... దుం దుం దుం దుం దుం!!

రాబందులు రంగేసుకు రాంచిలుకలమంటుంటే
పులులేమో ముసుగేసుకు మేకలమేనంటుంటే
పులులేవో, మేకలేవో తెలియక మేం ఛస్తుంటే
మళ్ళొచ్చినాయిరో మాయదారి ఎలచ్చన్లు
మళ్ళొచ్చినాయిరో మాయదారి ఎలచ్చన్లు
దుం, దుం, దుం, దుం, దుం!!

కవిత

# కవిత్వం ఎలా రాయాలో చెప్పకు!

- ప్రతిష్ఠా పాండ్య, గుజరాతీ కవయిత్రి,
పీపుల్స్ ఆర్కివ్ ఆఫ్ రూరల్ ఇండియా ఎడిటర్

అనువాదం : రాఘవ శర్మ

సిగ్గుపడమని నాకు చెప్పకు.
నా నోటికి పగ్గాలేయాలని చెప్పకు.
నీ కవితా సంప్రదాయాలన్నిటినీ పీకి పారేస్తున్నాను.

ఒకటొకటిగా,
ఒక్కో పాదాన్ని,
ఒక్కో పద్యాన్ని,
ఒక్కో చరణాన్ని,
ఒక్కో లయను,
నీ అనుకరణను, ముగింపు మాటలను కూడా!!

నా నగ్న ఎదపై రాసిన నీ దరిద్రపు అక్షరాలపై నుంచి
నా కన్నీరు కారుతోంది.

నా తొడల మధ్య నీవు గాయపరిచిన
నీ నిందా రూపకాన్ని నేను పీకి పారేస్తున్నాను

నగ్నంగా, రక్తం కారుతూ సిగ్గులేకుండా
నీ నాగరిక వీధుల్లో తిరుగుతున్నాను.

నోరు మూసుకో
నా గొంతు తగ్గించుకోమని చెప్పకు
నా అరుపులు, కేకలు, నా గర్జింపులు,
నా పేలుడు శబ్దాలు విను!
అవి ఆకాశాన్నంటుతున్నాయి!!

ఈ పురాతనమైన నేలలో బైటికి ఎగజిమ్ముకు
వస్తున్న గాయపు కోతకు గురైన నా ముతక పదాలు,
చెరిచిన మహిళల నగ్న శరీరాలు!


కుకి, మెయిటీ, దళితులు, క్రిస్టియన్లు, ఆదివాసీలు,
హిందువులు, ముస్లింలు తరువాత వరుసగా ఒక్కొక్కరు..

కవిత్వం ఎలా రాయాలో నాకు చెప్పకు!!

# జ్ఞానరంగం మీద పరుచుకుంటున్న రాబందు రెక్కలను చూపుతున్న "ఇవీ మన మూలాలు" పుస్తకం

– ఓపీవీయస్

**2023** చివరలో తెలుగులో వెలువడిన "ఇవీ మన మూలాలు" మానవ చరిత్రను గురించి, ప్రత్యేకించి భారతీయుల చరిత్రను గురించి సమగ్రంగా తెల్పే పుస్తకం. 7 లక్షల సంవత్సరాల నుండి 5 లక్షల సంవత్సరాల మధ్య చింపాంజీల పూర్వీకుల నుండి మానవజాతులు వేరుపడిన నాటినుండి.... అంటే 48 క్రోమోజోములు గల జంతువుల నుండి 46 క్రోమోజోములు గల మానవులుగా వేరుపడిన నాటినుండి, నేటి ఆర్యావర్త, అనార్యావర్త భావ సంఘర్షణల తాజా పరిణామాల దశ వరకు నడచిన చరిత్రను పట్టి యిచ్చిన పుస్తకమిది. చరిత్ర అధ్యయనానికి ఇంతవరకు పురావస్తు శాస్త్రము, మానవ పరిణామ శాస్త్రము, భాషల వికాస పరిణామాలు వంటి పనిముట్లు మనకున్నాయి. ఇంకా వేదాలు, పురాణేతిహాసాలు ఆధారంగానూ, ఉత్పత్తి క్రమ పరిణామ దశలు, శాసనాలు, నాణెములు వంటి సాధనాల ద్వారా చరిత్రను అధ్యయనం చేయడం, శాస్త్రీయ నిర్ధారణలకు రావడమూ తెలసిందే. కాగా ఇప్పుడు ఈ పుస్తకం అశాస్త్రీయ నిర్ధారణలను తన సూక్షదర్శినితో జన్యుశాస్త్రం పరిశీలించి పరిపుష్టిని ఇస్తుందన్న విషయాన్ని తెలియ జేస్తుంది.




నాలుగు భాగాలుగా విస్తరించబడిన ఈ పుస్తకంలోని మొదటిభాగం ఆధునిక మానవునికి దగ్గరవారైన నియాండర్తల్, డెనిసోవన్ మానవ జాతుల గురించి, అమెరికా ఆదివాసులు, అజ్ఞాత యూరేషియన్ల గురించి, మంచు యుగానంతర వ్యవసాయ విప్లవ చిత్రపటాన్ని ఆవిష్కరించింది. రెండవ భాగం మానవాభివృద్ధి క్రమంలో ఆయుధాల పుట్టుక, పరిణామం గురించి, ఐరోపా ఇంకా భారత్ – ఐరోపాల సామ్యాలను చర్చకు పెడుతుంది. మూడవ భాగం ఆధునిక మానవులు ఆఫ్రికా నుండి తీసుకున్న వలసల క్రమంలో రచయిత చెప్పినట్టు ఇతిహాసపు వస్తువా అనేంత ఆశ్చర్యపరుస్తుంది. ప్రాచీన ఉత్తర దక్షిణ భారతీయులు, మెహర్‌గఢ్‌లో హరప్పా మూలాలు, హరప్పా జనులలో ఇరాన్ జన్యువులు నుండి భారత్ చైనా వరి సాంకర్యం వరకు అంశాలుగా మన ముందుంచుతుంది. అంతేగాక ద్రవిడ భాషలకు పశ్చిమాసియాతో సంబంధం, తెలుగు తమిళ ఈలమైట్ మూలాలు మొదలుగా భాషాశాస్త్ర ఆధారాలుగా, పెద్దన పద్యంలో ప్రస్తావించబడిన శంబర భిల్లులు.... ఇంకా కిరాతార్జునీయం వంటి ఆసక్తిని రేకెత్తించే సాహిత్యాంశాలు ఈ భాగంలో ఉన్నాయి. నాలుగవ భాగం స్టెప్పీలలో వర్ణ విభజన మూలాల నుండి ఋగ్వేద రాముడు, రామాయణ ఇంద్రుడు, గుర్రం – రథం వినియోగ పరిణామాలను, అశ్వమేధయాగాలను గురించి చర్చిస్తుంది. ఇంకా ఈ భాగంలో ధర్మరాజులో స్టెప్పీ వారసత్వం, భారత్ గడపలో స్టెప్పీజనం, ఆర్యావర్త విజయాలు, కులవ్యవస్థ మొదలైన విషయాలు చర్చించారు. ఐతే ఆర్యావర్త విస్తరణ అజెండాకు పెద్ద అడ్డుగా మారింది గాంధీజీ అని అంటూ స్త్రీలనే కాక, నిద్రాణంగా ఉన్న రైతుకులాలను, దళితులను, గిరిజనులను, ముస్లిములతో కూడిన అనార్యావర్తాన్ని, ఆర్యావర్త వ్యతిరేక శక్తిగా నిలిపారని తద్వారా ఆర్యావర్త పురోగమనాన్ని తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారని చెప్పడాన్ని అంగీకరించలేము. ఆర్యావర్త వ్యతిరేక శక్తిగా వీరిని సంఘటితపరచిన ఘనత గాంధీగారిదేనా?.. భారతదేశం వంటి వలస దేశాలలో ఈ ప్రజారాశులను జాతీయోద్యమంలోకి సమీకరించిన ఇతరేతర భావజాలాలు, శక్తులు, పరిస్థితులు లేవా? అనే ప్రశ్నలు పుట్టుకొస్తాయి.

చరిత్ర అధ్యయనమనే పరిశోధనాలయంలో అమరిన ఈ కొత్త పరికరమైన జన్యుశాస్త్రపు ప్రాథమిక సమాచారాన్ని రచయిత సాధారణ పాఠకులకు సైతం అర్ధమయ్యే విధంగా సరళంగా పొందుపరచారు. 1940లలో మొదటిసారిగా డిఎన్ఏ (డీ ఆక్సీరైబో న్యూక్లియిక్ ఆమ్లం) ఆవిష్కృతమైన నాటి నుండి నేటి వరకు జరిగిన జన్యుశాస్త్ర అభివృద్ధి చరిత్ర అధ్యయనానికి తోడ్పడుతున్న విధానం వివరించారు. ఒక జనాభాకు చెందిన మొత్తం జన్యుచరిత్ర, ఇతర జనాభాలతో ఈ

జనాభాకు ఉన్న సంబంధాలను గురించి తెలియాలంటే మొత్తం జన్యు సంపుటిని అధ్యయనం చేయాల్సిన అవసరం గురించి, ఈ దిశలో శాస్త్రజ్ఞులు చేస్తున్న అధ్యయనాలు మానవ చరిత్రను సాధికారికంగా వివరిస్తున్న వైనాన్ని పాఠకులకు పరిచయం చేశారు. తల్లివైపు పారంపరికతను మైట్రోకాండ్రియన్ డిఎన్ఏ ఆధారంగా తెలియజెప్పే అత్యంత పురాతనమైన హేప్లో గ్రూపులు L0, L1, L2, M2 వంటివనీ, తండ్రివైపు పారంపరికతను తెలియజెప్పే హేప్లో గ్రూపులు A, B, CT, D వంటివనీ, ఆయన వివరిస్తూ, మామూలు మాటల్లో చెప్పుకుంటే ఇవి 'శాస్త్రీయ గోత్రాల' వంటివి అనడం నవ్వు తెప్పిస్తూ అర్థం చేయిస్తుంది. 'అమ్మ పుట్టిల్లు ఆఫ్రికా' అంటూ మనందరికీ తెలిసిన శాస్త్రనానుడి వెనుక ఆఫ్రికా వెలుపల ప్రపంచమంతా వ్యాపించి ఉన్న జనం యొక్క మైటోకాండ్రియల్ DNAను పరిశీలిస్తే వారంతా L3 అనే ఒకే ఒక హైప్లోగ్రూపు నుండి వచ్చిన వారేనన్న సంగతి రచయిత వివరిస్తున్నపుడు మనలో విశ్వమానవ సహోదరత్వ భావన కలుగుతుంది.

ఈ పుస్తకంలో భారతీయుల జన్యువారసత్వం గురించిన అంశాలు కూడా ఎంతో ఆసక్తి కలిగిస్తాయి. భారతీయుల్లో తల్లివైపు నుండి సంక్రమించే మైటోకాండ్రియల్ DNA అత్యధిక భాగం కేవలం భారత ఉపఖండానికి చెందినవిగానే ఉన్నాయని శాస్త్రవేత్తల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు పురుషుల నుండి సంక్రమించే Y క్రోమోజోమ్ కథ ఇందుకు భిన్నంగా ఉంది. ఇది యూరోపియన్లతో, మధ్య మరియు పశ్చిమ ఆసియన్‌లతో సన్నిహిత సంబంధాన్ని తెలుపుతుంది. అంటే భారత్ వెలుపల జన్యు వారసత్వం గల మగవారికి, భారత్ లోపలి స్త్రీలకు సౌంకర్యం జరిగిందన్నమాట. నలుపు, ఛామనఛాయ, గోధుమ రంగుల చర్మపు వర్ణాల వ్యత్యాసాల నుండి యూరోపియన్ ముఖ కవళికలు, చైనీయ ముఖ కవళికలు గల వైవిధ్యపు జనం మన కళ్ళముందే కదలాడడమే దీనికి సాక్ష్యం. అలాగే భారతీయులలో జన్యువారసత్వపు రెండు ప్రధాన రకాలు, ఉత్తర భారతానికి చెందిన పూర్వీకులు (Ancestral North Indians - ANI), దక్షిణ భారతానికి చెందిన పూర్వీకులు (Ancestral South Indians - ASI) అనీ, ANIకి యూరేషియా, కాకసస్ జనాలతో జన్యు సంబంధం ఉందనీ, ASIకి నేటి భారత ఉపఖండానికి బయటి జనాలతో జన్యుసంబంధం లేదన్న నిర్ధారణ ఆశ్చర్యం కలిగిస్తుంది. భారత్‌లో ప్రధానంగా 20% నుండి 80% వరకు యూరేషియా మిశ్రమ జన్యువులు ఉన్నట్టు శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. విచిత్రమేమిటంటే ఈ మిశ్రమం పెద్ద, చిన్న కులాలలోనేగాక కుల వ్యవస్థకు వెలుపలి గిరిజనుల్లో కూడా కనిపించడమే. ఇది, మిశ్రమం కాని జనాలు భారత్‌లో ఎవ్వరూ లేరన్న సత్యాన్ని వెల్లడిస్తుంది. అంతేగాక మానవుల ఈ జన్యుచరిత్ర మన నిచ్చెనమెట్ల కులవ్యవస్థకు అతికినట్లు సరిపోతున్నది?

ఈ పుస్తకంలోని అంశాలన్నింటిలో ముఖ్యమైనది, మనల్ని హెచ్చరించేది 'జ్ఞానరంగంపై రాబందు రెక్క' అనే అంశం. సమాజాన్ని సరైన పద్ధతిలో ఉంచడంలో రాజకీయాలదీ ముఖ్యపాత్రేగానీ, ఏకైక పాత్ర కాదనీ, సంస్కృతి, సాహిత్యం, శాస్త్ర విజ్ఞానాలు కూడా అంతే ముఖ్యపాత్రను నిర్వహిస్తాయనీ, ఏదీ మరొక దానిని మింగేయకుండా హద్దులను పాటించినపుడే అది ఆరోగ్యవంతమైన సమాజమౌతుందనీ రచయిత చెప్పిన మాటలు అక్షర సత్యాలు. రాజకీయానికి సమాంతరంగా జ్ఞానరంగానికున్న ప్రాముఖ్యతను, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గుర్తిస్తూ, దాని ఉనికిని ఎప్పటికప్పుడు పరిపుష్టం చేసుకోవడమే రాజకీయ స్వైర విహారానికి విరుగుడు అంటారాయన. ఇవి జ్ఞానరంగానికి బాధ్యత వహించే ప్రతి ఒక్కరికీ చేసిన దిశానిర్దేశంగా భావించాలి. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న జన్యు పరిశోధనల్లో ఎంతో ముఖ్యుడైన డేవిడ్ రైక్ మరియు అతని సహచరుడైన నిక్ పీటర్సన్‌లకు ఎదురైన చేదు అనుభవాన్ని వివరించినపుడు జ్ఞానరంగాన్ని గురించిన కనీస అవగాహన కలిగిన వారెవరైనా భయాందోళనలకు గురౌతారు. 2008 అక్టోబర్‌లో వారిద్దరూ Centre for Cellular and Molecular Biology (CCMB) శాస్త్రవేత్తలైన లాల్జీసింగ్ మరియు తుంగరాజ్‌లను కలిసేందుకు వచ్చారు. డేవిడ్‌రైక్, నిక్‌పీటర్సన్, లాల్జీసింగ్ మరియు తుంగరాజ్‌లు నలుగురూ Reconstructing Indian Population History మరియు Genetic Evidance of Recent Population mixture in India అనే పత్రాల రూపకల్పనలో భాగస్వాములు. రైక్ ప్రతిపాదించిన పత్రంలో అంశమైన నేటి భారతీయుల్లో చెప్పుకోదగిన పరిణామంలో పశ్చిమ యూరేషియా జన్యు వారసత్వం ఉందన్న విషయాన్ని పరిశోధనల నిర్ధారణలు తెలిసి కూడా వారు ససేమిరా అంగీకరించలేదు. ఇండో యూరోపియన్ల ఈ వలసను నిర్ధారించే సూత్రీకరణను అంగీకరిస్తే, పూర్తిగా దేశీయమైనదిగా చంకలు గుద్దుకుంటున్న ఈ మత సాంస్కృతిక నిర్మాణము. దాని అహంకారపూరిత భావజాలమూ పునాదులతోసహా కదిలిపోతాయనేదే వారి ఆందోళన. వారిపై పనిచేసే తిరోగమన రాజకీయ, భావజాలం తప్ప ఇందుకు మరకొటి కారణం కాదు.

పుస్తకమంతా చదివి పూర్తిచేసినపుడు మనలో వున్న పురామానవు లెందరో.... "రా!.. నన్ను అధ్యయనం చేయి. నీలో ఉన్న 'మన'లందరినీ ఆవాహన చేయి, విముక్తి కోసమై నడవమన్న" కవి పలుకులను గానం చేస్తూ కదలమంటున్నట్లు అనిపిస్తుంది. సౌకర్యం లేని స్వచ్ఛత పేర నడుస్తున్న, ఘనీభవిస్తున్న, విలువలకేసి చూసి పగలబడి నవ్వాలని పిస్తుంది. జ్ఞానరంగాలన్నిటిమీదా రాబందుల రెక్కలు కప్పుతున్న తిరోగామి రాజకీయాలను నియంత్రించే అంకుశాన్ని ప్రజలకందించాలనే బలమైన కోరిక పుడుతుంది.

**ఇవీ మన మూలాలు**

రచయిత : శ్రీ కల్లూరి భాస్కరం

ప్రచురణ : అన్వ్ర పబ్లిషర్స్

దొరుకుచోటు : www.analpabooks.com

# లద్దాక్ ప్రజా ఉద్యమానికి సంఘీభావం ప్రకటిద్దాం!

**లద్దాక్** ప్రాంతానికి రాష్ట్ర హోదా కల్పించడం, దానిని రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చడం, స్వయం ప్రతిపత్తిని ప్రకటించటం వంటి ప్రధాన డిమాండ్లతో ఇరవై ఒక్క రోజులపాటు నిరాహారదీక్షకు దిగిన ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ మంగళవారం తన దీక్షను విరమించారు. మైనస్ పది డిగ్రీల తీవ్ర వాతావరణంలో వందలాదిమంది అనుచరులతో ఈ దీక్ష జరిగింది. మార్చి 6న లేహ్‌లో వందలాదిమంది స్థానిక నాయకులు, ప్రజలు హోమ్ మంత్రిత్వశాఖతో జరిపిన చర్చలు విఫలం కావడంతో వాంగ్‌చుక్ నిరాహార దీక్షను ప్రకటించారు. గత నాలుగేళ్ళలో ఇటువంటి చర్చలు తొమ్మిదిసార్లు జరిగాయి. గతంలో హామీలిచ్చిన కేంద్ర పాలకులు నిష్కర్షగా ఆ హామీలను తోసిపుచ్చారు. గత సం॥ము జనవరిలో కూడా వాంగ్ చుక్ ఐదురోజులపాటు నిరాహారదీక్ష చేశారు.

ఆరవ షెడ్యూల్ గురించి మాట్లాడుతూ వాంగ్ ఇలా అన్నారు : "ఎందుకంటే ఇది (ఆరవ షెడ్యూల్) విభిన్న స్థానిక గిరిజన సంఘాలతో కూడిన కొండ ప్రాంతాలకు అనుగుణంగా రూపొందించబడింది. మరియు సాధారణంగా యాభైశాతం గిరిజన జనాభా దీనికి అర్హత సాధించడానికి సరిపోతుంది. కానీ లద్దాక్‌లో గిరిజన జనాభా తొంభై ఏడు శాతం ఉంది. కనుక స్పష్టంగా మేము దీనికి అర్హులం. ఆరవ షెడ్యూల్‌ను వర్తింపచేయడం ద్వారా గిరిజన సంఘాలతో కూడిన మా ప్రాంతీయ కౌన్సిళ్ళకు తాగునీరు, అడవులు, భూమి, గ్రామ పరిపాలన, వివాహాలు మరియు విడాకులు, వారసత్వపు ఆస్తి, ప్రజారక్షణ (పోలీస్), ప్రజారోగ్యం, పరిశుభ్రత వంటి పలు అంశాలపై నిర్ణయాలు తీసుకునే అధికారం వస్తుంది. అంతేగాకుండా చట్టబద్ధత లేకుండా ఎక్కడో ఢిల్లీలో కూర్చున్న పెద్దలు తీసుకునే నిర్ణయాలు అమలు కావు".

తమ వనరులను ఇతరులు దోచుకుంటారనే లద్దాక్ ప్రజల భయం క్రమంగా నిజమవుతోంది. అంతేకాదు పచ్చదనంతో పరవళ్ళు తొక్కే తమ పర్యావరణం, తమ సంస్కృతి, చివరికి తమ ఉనికే ప్రశ్నార్థకం కాబోతున్నదని వారికి అర్థమవుతూంది. దీనికి కారణాలు కూడా లేకపోలేదు. లద్దాక్ వ్యూహాత్మకంగా, భద్రతాపరంగా ఎంతో కీలకమైంది. చైనాకు సరిహద్దుగా వుంటుంది. ఈ దృష్టితో ఇప్పటికే కేంద్రం మిలటరీ అవసరాల రీత్యా రోడ్లు, వంతెనల నిర్మాణానికి కొంత వ్యవసాయ భూమిని ఆక్రమించుకుంది. భూములను కోల్పోయిన రైతులకు ఇంతవరకూ ఎటువంటి సహాయాన్నీ పాలకులు అందించలేదు.

లద్దాక్ ప్రాంతం విహార యాత్రలకు అనుకూలంగా ఉండడంతో పర్యాటకుల కొరకు రిసార్టులు నిర్మించాలని, ఏడు జల విద్యుచ్ఛక్తి కేంద్రాలు నిర్మించాలని, ఇక్కడ పుష్కలంగా లభించే బొరాక్స్, గ్రానైట్, సున్నపురాయి, పాలరాయి వంటి సహజవనరులను దోపిడీ చేసుకోవడానికీ కార్పొరేట్లు కేంద్రంపై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. 157 హెక్టార్లలోని అడవిని నిర్మూలించి సోలార్ ప్రాజెక్టులు నిర్మించడానికి బిడ్లు దాఖలు చేసుకోవలసిందిగా ప్రకటనలు కూడా వెలువడ్డాయని కథనాలు వస్తున్నాయి.

ఇప్పటికే విపరీతంగా వస్తున్న పర్యాటకుల కారణంగా తాగునీరు వంటి సహజవనరులు కొరత ఏర్పడటం, పర్యావరణం ఛిద్రం కావడం చూస్తూనే వున్నారు. పర్యావరణకారుల ప్రకారం రానున్న రోజుల్లో లద్దాక్ పెద్ద స్థాయిలో పర్యావరణ విపత్తు కేంద్రంగా మారనున్నది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. హిమానీనదాలు వేగంగా కరిగిపోతున్నాయి, నీటి బుగ్గలు కనుమరుగైపోతున్నాయి, నీటి కొరత వెంటాడుతోంది.

బయటివారు వచ్చి ఇక్కడ నివాసాలు ఏర్పరచుకొని, ఇక్కడి భూములను కొనుగోలు చేసి, వ్యాపారాలు కొనసాగించుకొనేలా కేంద్రం చట్టాలు చేస్తున్న కారణంగా ఇక్కడి ప్రజల్లో నానాటికీ అభద్రత అధికమవుతోంది. ఆర్టికల్ 370 రద్దుతో ఇప్పటికే మోదీకి అత్యంత ఆప్తులైన అంబానీ, ఆదానీలు రంగప్రవేశం చేసారు. నయవంచనలో ఆరితేరిన కేంద్ర పాలకులు కార్పొరేట్లకు అనుకూల విధానాలతో లద్దాక్‌ను స్వాధీనం చేసుకోవాలనుకుంటున్నారు.

వాంగ్‌చుక్ ఈ సందర్భంగా మోదీ, అమిత్‌షాలను రాజకీయ నాయకులుగా కాకుండా పరిణతినొందిన రాజనీతిజ్ఞులుగా దేశ భవిష్యత్తులు దృష్టిలో పెట్టుకొని తమకు న్యాయం చేయవలసిందిగా కోరుతున్నారు. ఇదే సందర్భంలో దీక్ష విరమణ తాత్కాలికమేనని, నిరసనను కొనసాగిస్తూనే ఉంటామని ఉద్ఘాటించారు.

కేంద్రం మాకు ప్రాంతీయ అవసరాల ఆధారంగా విధానపరమైన నిర్ణయాలను తీసుకునే హక్కు మాకు కల్పిస్తుందా, లేదా అన్నదే అసలైన ప్రశ్న అంటున్నారు వాంగ్! ఈ రకమైన అభివృద్ధిని మేము కోరుకోవడంలేదు. లద్దాక్ భూమి పారిశ్రామికవేత్తల, పర్యాటకులకు స్వర్గధామంగా మారి వారి లాభాపేక్షకు దాసోహం కావాలని మేము కోరుకోవడంలేదు అంటున్నారు లద్దాక్ ప్రజలు!

లద్దాక్ ప్రజల న్యాయమైన పోరాటానికి సంఘీభావం ప్రకటిద్దాం! ✺

# భూమికోసం, భుక్తికోసం, విముక్తి కోసం సాగిన తెలంగాణా సాయుధ పోరాటం ప్రారంభానికి ముందు తరువాత తెలంగాణ ప్రజల వ్యధల్ని, గాథల్ని చిత్రించిన గొల్లపూడి నారాయణరావు రెండు నవలలు - ఒక విహంగ వీక్షణ

- మండవ సుబ్బారావు

**ఆధునిక** భారతదేశ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాట చరిత్రది ఒక ప్రత్యేక స్థానం. సాయుధ పోరాటం ప్రారంభమైన నాటి నుండి పోలీసు చర్య వరకు తెలంగాణలోని గ్రామగ్రామాన జరిగిన లూటీలు, మానభంగాలు, నిర్బంధాలు అనుభవించిన వారికి బాగా తెలుసు. ఈ ఉద్యమం అనేకమంది కవుల్ని కళాకారుల్ని స్పందింప జేసింది. 1933లో స్పెయిన్‌లో ప్రజాప్రభుత్వాన్ని కాపాడుకోవడం కోసం ప్రజాశక్తులు చేసిన పోరాటంతో తెలంగాణ సాయుధ పోరాటాన్ని పోలుస్తారు చరిత్రకారులు. ఈ పోరాటం ఎందరో రచయితలు, కవులు, కళాకారులుద్భవించడానికి ఊపు, రూపునిచ్చింది. "రుద్రవీణ", "అగ్నిధార", "వజ్రాయుధం", "త్వమేవాహం", "తెలంగాణ" వంటి కావ్యాలు, "మా భూమి", "ముందడుగు" వంటి నాటికలు, "ప్రజల మనిషి", "గంగు", "చిల్లర దేవుళ్ళు" వంటి నవలలు పుట్టుకు వచ్చాయి. ఇంకా బుర్రకథలు, పల్లెసుద్దులు, పాటలు, పదాలు లాంటి అనేకానేక ప్రజాకళారూపాలు కొత్తగా రూపుదిద్దుకున్నాయి. దాశరథి ఆళ్వారుస్వామి మొదలగు కవులు, కళాకారులు నైజాం ప్రభుత్వ అక్రమాలను వర్ణించి ప్రజల్లో సమరోత్సాహాన్ని కల్పించారు. తత్ఫలితంగా వాళ్ళందరిని పట్టుకొని జైళ్ళలో పెట్టారు.

1947 ఆగష్టు 15, భారతదేశానికి 'అధికార మార్పిడి' ప్రకటించడం జరిగినప్పటికీ, నైజాం నవాబు మాత్రం తనది స్వతంత్ర దేశమని, భారత యూనియన్‌లో చేరననీ బహిరంగ ప్రకటన చేసాడు. రజాకారులను తయారుచేసుకొని గ్రామాలపై దాడులు సాగిస్తూ, ధన మాన ప్రాణాలను అపహరించి గ్రామాలను తగులబెడుతుండేవాడు. 1947 నవంబర్‌లో భారత ప్రభుత్వం నిజాంతో యధాతథ ఒడంబడిక చేసుకుంది. కమ్యూనిస్టుల్ని అంతమొందించటానికి మతతత్త్వ శక్తుల్ని రెచ్చకొట్టాడు నిజాం. మరోప్రక్క కమ్యూనిస్టుల సాయుధ పోరాటం ఫలితంగా వేలాది ఎకరాల భూమి పేద ప్రజలకు పంచి పెట్టబడింది. ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగడం నచ్చని కేంద్ర ప్రభుత్వం నిజాంతో చేసుకున్న ఒడంబడిక గడువు ముగియక ముందే 1948లో పోలీసు చర్యతో తెలంగాణను యూనియన్‌లో విలీనం చేయడం జరిగింది. 1956లో మద్రాసు రాష్ట్రం నుండి అంతకుముందే విడిపోయిన ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలను తెలంగాణతో కలిపి విశాలాంధ్రతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ జరిగిన విషయం అందరికీ తెలిసిందే.

పోరాట కాలంలో రాసిన నవలలకంటే ఆ తరువాత వచ్చిన నవలల సంఖ్యే ఎక్కువ. గొల్లపూడి నారాయణరావు స్వయంగా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపిన వ్యక్తి. వీరు రాసిన మూడు నవలలు 1960 దశకంలో రాసినవే. నారాయణరావుగారు తన అనుభవాలు, ఉద్యమాల తీరుతెన్నుల జోలికి పోలేదు. కేవలం నాటి ప్రజల వ్యధల్ని, గాథల్ని మాత్రమే కథాంశంగా రాశారు. 1961లో విశాలాంధ్ర ప్రచురణాలయంవారు నిర్వహించిన నవలల పోటీలో తృతీయ బహుమతి పొందిన "కొత్తరోజులు", 1965లో రాసిన "పాత రోజులు", 1966లో 'జనశక్తి' దినపత్రికలో సీరియల్‌గా వెలువడిన "తెలుగు గడ్డ". పై రెండు నవలల గురించి ఒక విహంగ వీక్షణ.

### "కొత్తరోజులు" :

ఆనాటి తెలంగాణ గ్రామ జీవితం - 'కొత్తరోజులు'లో కథావస్తువు. గ్రామాలలోని ఫ్యూడల్ భూస్వామ్య వ్యవస్థని, భూస్వామ్య శక్తుల్ని సంఘ చైతన్యంతో ప్రతిఘటిస్తున్న తెలంగాణ ప్రజల రోజులు మారుతున్నాయి, కొత్తరోజులు వచ్చాయని చెప్పడమే రచయిత ఉద్దేశం. కృష్ణాపురం జమీందారు వెంకట్రావు తన చేలో శనగ పీకడానికి ఊరి జనం వెట్టికి రాలేదనే కోపంతో, ఊరి వారి గేదల్ని తన ఆవుల దొడ్డిలో బందీ చేశాడు. "కూటికి లేకపోతేనే తెగబలసి కొవ్వెక్కి పోయారే, ఇక కూడు, గుడ్డ, నీలు నిట్ర అన్నీ వుంటే మీకు పట్టపగ్గాలుంటాయట్రా!" అని బెదిరించడం ద్వారా ఆనాటి జమీందారి పెత్తనం ఎలా వుండేదో తెలుస్తుంది. జమీందారు తమ్ముడు విఠల్ రావు, ఆయన మామ కేశవరావు. గ్రామ పెద్దకాపు శేషయ్య, మరో పెద్దకాపు నర్సిరెడ్డి వచ్చి శనగ పీకుతున్న కూలీలను పీకుడు ఆపుచేయించే - సన్నివేశాన్ని సృష్టించడం ద్వారా ఆవులు ఆవులు కొట్లాటలో దూడల పరిస్థితిని విశదీకరించాడు రచయిత. అందితే జుట్టు పట్టు. అందకుంటే కాళ్ళు పట్టు - అన్న సామెత వెంకట్రామరావుకు చక్కగా సరిపోతుంది. తమ్ముడు విఠల్‌రావుతో సమస్య వచ్చినపుడు కుమార్ ఇంటికి స్వయంగా వెళ్ళి చేతులు

పట్టుకొని సహాయం చేయమని కోరతాడు. ఆ కుమారే ఊరి జనానికి చైతన్యం కలిగిస్తున్నాడని తెలిసినప్పుడు ఆ కుమార్‌ను అంతం చేయడానికి కూడా వెనకాడడు, కుమార్ ఆ గ్రామం వాడు కాదు. ఎక్కడ నుండి వచ్చాడో ఎవరికీ తెలీదు. ఎవ్వరూ అడగలేదు. తనూ చెప్పుకోలేదు. కానీ ఆ గ్రామ ప్రజలందరికీ ఆప్తుడయ్యాడు. సమస్యల్ని తెలుసుకునేవాడు. చదువు విలువ తెలియజేశాడు. అన్నిటికన్నా అతను కొత్త వ్యవసాయ పద్ధతులు, కొత్త విత్తనాలు రకరకాల ఎరువులు రైతులకు పరిచయం చేశాడు. ఊరి కూలీల పక్షాన నిలబడి జమీందారును నిలదీసి వారికి రావలసిన కూలీ ఇప్పించి కథానాయకుడైనాడు.

గ్రామంలోని కూలీలందరు సంఘంలో చేరారు. కుర్రాళ్ళల్లో ఎంతో మార్పు వచ్చింది. "ఏమోయ్, గీమోయ్!" అని పిలిస్తే ఊరుకోడం లేదు. వెట్టికి పోవడం లేదు. "ఇంత కూలి ఇస్తేనే పనికి వస్తా"మని చెప్పే ధైర్యం వచ్చింది. పాతరోజులు, కొత్తరోజులు వచ్చాయని చెప్పే సంఘటనలు నవలలో ఆయా సందర్భాలలో కథానుసారంగా కనిపిస్తాయి. వరి కోతలకు వచ్చినపుడు జమీందారు తన పనివాడు తిరుమలగిరిని కూలీల కోసం పంపిస్తాడు. అప్పుడు కామయ్య "మనిషికి రెండు మానికలు జొన్నలు యిస్తే కూలికి వస్తాం. అదయినా, ముందుగా యిస్తేనే" అని ఖరాఖండిగా చెప్పేశాడు. దొర పేరు చెప్పి భయపెట్టే తిరుమలగిరి ఇంకొక క్షణం అక్కడ నిలువబడితే ఒళ్ళంతా హూనం చేస్తారని భయపడ్డాడు. – తలవంచుకుని వెళ్ళిపోయాడు. ఎంత మార్పు? "ఈ దిక్కుమాలిన వెధవలకు నా తడాఖా ఏమిటో రుచి చూపించాలి" అనుకున్నాడు దొర. కానీ రోజులు మారాయి, అనే సంగతి గుర్తుకు వచ్చింది. తడాఖాలు చూపించే కాలం కాదని గూడా సమాధానపడ్డాడు. ఈ మాటల్తో కాలం ఎంత మారిందో చెప్తాడు రచయిత. తన వరి పొలం కోపించుకోడానికి జమీందారు మరో మారు కుమార్ కాళ్ళు పట్టుకోవలసి వచ్చింది. కుమార్ చెబితే కూలీలు తప్పక వింటారని ఆయన నమ్మం, నమ్మకమే కాదు. అదీ నిజమే. కుమార్ మాట మీద గౌరవంతో జమీందారు పని జరిగిపోతుంది. ఆ ఊరి ప్రజలకు కుమార్ మీద ఎందుకంత గౌరవం? ఎందుకంటే, ఎన్నో తరాలనుండి వస్తున్న వెట్టి బాధను తప్పించాడు. రైతులందరికీ ఇష్టం లేకపోయినా కూలిరేట్లని పెంచాడు. అప్పటికీ ఇప్పటికీ కూలిరేట్లు దాదాపు మూడు రెట్లు పెరిగింది. జమీందారు గూడా చాలా వరకు మారిపోయాడు. ఇన్నాళ్ల మాదిరిగా కాములూ, సోములూ అని పిలవడం మరిచిపోయాడు. కామయ్యా, సోమయ్యా అని పిలుస్తున్నాడు. కానీ పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకల్లోగాని పోదంటారు. పైకి భయపడినట్టు, మారినట్టు కనిపించినా నక్కజిత్తులు మానలేదు. కోసే వరి కోస్తుంటేనే, ధాన్యం కొట్టించి ఫ్యాక్టరీకి తోలేశాడు. కూలీలకు అనుమానం వచ్చింది. కాకపోతే కుమార్ ఉన్నాడుగా అనే ధైర్యంతో కోతలన్నీ కోశారు.

జమీందారు ఒక్కడే కాదు. గ్రామాల్లో పెద్ద కాపులూ కూలీల శ్రమల్ని దోచుకోవడం రివాజు. కృష్ణాపురం పెద్దకాపు శేషయ్య వరికోత కూలీని కొలిచేటప్పుడు జరిగిన సంఘటన ఆ విషయాన్ని స్పష్టం చేస్తుంది. తన మానికతోనే కొలుస్తానంటాడు శేషయ్య. చంచయ్య అనే కూలివాడు "మాది నెంబరు మానిక. మోరుంది. దీంతో కొలసి ఇమ్మం"టాడు. నేను మోరు మానెకతో ఇస్తానని మీతో ఒప్పుకున్నానా ఏమిటి?' అని దబాయించాడు. తన చిన్న మానెకతోనే కొలిచిస్తాడు, అంతేకాదు. తప్పుడు లెక్కలతో మధ్య మధ్యన ఒకటి రెండు అంకెలు తప్పగొడ్తాడు. చంచయ్య ఊరుకోడు. మళ్ళీ తిరగ్గొల్వమంటాడు. తప్పు తనకు తెలుసు కాబట్టి. "నువ్వు అన్న లెక్కగట్టుకుందాం పొరపాటున లెఖ్ఖ తప్పు పడి వుండవచ్చు", అంటూ సర్దుకుంటాడు. ఇదొక్కటే కాదు పొలం లెక్కలోనూ తప్పుడు లెక్కలే. "నాకున్న నాలుగు ఎకరాలకు లెఖ్ఖ ప్రకారం ఇచ్చా", అంటాడు శేషయ్య. "ఆ పొలమంతా నాలుగు ఎకరాలేనా అల్లుడా? అయిదు ఎకరాలకు పైమాటేగాని, లోపల వుండదు", అని చంచయ్య అంటే – "మరీ మీకు నమ్మకం లేకపోతే కరనంగారింటికెల్లి నకసా చూపించుకోండి" – "కుడి ఎడమల దగా దగా" అని శ్రీశ్రీ అన్నదిందుకే.

జమీందారు వరికోత కూలి కుమార్ వస్తేనే ఇస్తానని పేచి పెట్టాడు. కుమార్ ఏదో పనిమీద కొన్నిరోజులు ఊళ్ళో లేడు. వచ్చినాక అందరూ కలిసి జమీందారు దగ్గరకు వెళ్ళారు. వాళ్ళకు రావలసిన కూలి ధాన్యం వాళ్ళకు ఇవ్వమని కుమార్ అడిగాడు. ఏవో పనికిరాని వాదోపవాదాలు పెట్టుకొని "కుమార్‌గారూ! యిప్పటికి చాలా పొద్దు పోయింది. పాలేళ్లు యిళ్ళకు వెళ్ళిపోయారు. రేపు ఉదయం తప్పకుండా ధాన్యం కొలుస్తా"నంటాడు. సరే "ఈ ఒక్క రాత్రికి మునిగిపోయేదేమిటి?" అని అందరిని పంపించాడు కుమార్. కానీ, ఆ రాత్రి జమీందారు మరో పాడు పని చేశాడు. భూపయ్య అనే రైతు కోడలు రుక్మిణి కాస్త అందగత్తె, ఆమె మీద జమీందారు కన్ను పడింది. తార్పుడుగత్తె నాగమ్మ, జమీందారు తొత్తు తిరుమలగిరి సహాయంతో, బయలు ప్రదేశానికి వచ్చిన రుక్మిణిపై అత్యాచారానికి పూనుకున్నాడు. జమీందారు మీద కలిగిన అనుమానంతో, కుమార్ ముసుగులు వేసుకుని వెళ్తున్నవారిని అనుసరించి వెళ్ళాడు. అనుకొన్నంతా జరుగుతుంటే, కుమార్ అడ్డుకొన్నాడు. కైజారుతో కుమార్‌ను పొడవబోయాడు, కుమార్ ఒడుపుగా తప్పుకొని రెండవ చెయ్యి మెలిపెట్టాడు. బాధకు తట్టుకోలేక "కుమార్‌గారూ రక్షించండని" మొరపెట్టుకొన్నాడు.

ఈ సంఘటన జరిగాక జమీందారు ఊరు విడిచి పారిపోయాడు. తమకు మూడు పుట్ల కూలి ధాన్యం ఇవ్వాలని అది తప్పించుకోడానికి నాలుగు రోజులు ముఖం తప్పించాడని ఊరి జనం అనుకుంటారు. భూషయ్య, గురవయ్య, నర్సిరెడ్డి లాంటి రైతులు ఒకరికి తెలియకుండా ఒకరు జమీందారుకు అప్పు ఇచ్చారు. అప్పు పత్రాలూ లేవు. ఇక తమ డబ్బులు పోయినట్టేనని కుమార్ ముందు వాపోతారు. ఊరు వదిలి పారిపోయిన జమీందారు పోలీసుల్ని తీసుకొని వచ్చాడు. డి.యస్.పి కుమార్‌ను అరెస్టు చేసి తీసుకువెళ్తారు. గ్రామంలో పోలీసు క్యాంపు పెడ్తారు. రిజర్వుదళం కాపలాతో జమీందారు గ్రామంలో అడుగు పెడ్తాడు. శేషయ్య జమీందారుతో మిలాఖతై ఆడింది ఆట పాడింది పాటగా సాగిస్తుంటారు. మిల్టరీ సిపాయిని వెంటబెట్టుకొని ఊరి మీద పడి బియ్యం, డబ్బులు చందా పోగు చేస్తుంటారు. గ్రామమంతా విచ్చలవిడిగా తిరుగుతూ, చెయ్యరాని అకృత్యాలు చేస్తుంటారు. స్త్రీలు

కనబడితే చాలు కన్నులు గిలపడం, మీద పడటం అమాంతం వాటు వేసుకోవడం. ఈ స్థితి ఒక్క కృష్ణాపురానికే పరిమితి కాలేదు. తెలంగాణలోని ప్రతి పల్లెలో జరుగుతున్న తంతే. దాదాపు 1948లో ఆరుద్ర రాసిన "త్వమేవాహం" కావ్యంలో ఇదే చెప్పాడు. "చెయిన్సులో మగాళ్ళు, చెరచబడ్డ ఆడవాళ్ళు" - అంటూ, "చెట్ల గురించి - చిట్టెలుకల గురించి - చెదపురుగుల గురించి చిన్న చిన్న చీమల" గురించి చెప్పాడు.

కుమార్ మీద జమీందారును చంపబోయాడని హత్యానేరం మోపారు. సెషన్సు కోర్టులో విచారణ జరిగింది. సాక్ష్యం శేషయ్య, నేరం రుజువు కాలేదు. పైగా అబద్ధపు కేసులకు పూనుకొన్నందుకు పోలీసు ఉద్యోగులపై అభిశంసనం చేశాడు జడ్జి. కుమార్ విడుదలయ్యాడు.

ఒక వైపున మిల్టరీ దాడులు, మరోవైపు ప్రజలను సమాధాన పరచే ఏర్పాట్లు ఎలా జరుగుతుందో కథా సందర్భంగా నవలలో వివరించాడు రచయిత. ప్రజల మహజరుపై సుబేదారు కృష్ణాపురం వచ్చి, జమీందారుకు ఊరి రైతులకు కూలీలకు సఖ్యత కూర్చే ప్రయత్నం చేస్తాడు. జమీందారు తప్పు ఒప్పుకొని కూలీల డబ్బులు ఇస్తాడు. రైతుల బాకీలు చెల్లించడానికి గడువు కోరి, కుమార్ కోరిన ప్రకారం నోట్లు రాసిస్తాడు. తేనే పూసిన కత్తి జమీందారు. వీలు దొరికినప్పుడల్లా కుమార్‌ను అంతం చేయడానికి ప్రయత్నాలు చేస్తూనే వుంటాడు. ఆరోజు కుమార్ వెంకటాపురం స్టేషన్‌లో రైలుబండి దిగి కృష్ణాపురం వెళ్తున్నప్పుడు దాడి చేయించాడు. ఇక సహనం చచ్చిపోయింది జనానికి. ఊరు ఊరంతా కదిలింది. ఆవేశంతో ఉడికిపోయింది. "పదండి గడీ మీదకు" అంటూ జన ప్రవాహం గడీ మీద పడింది. జమీందారి వర్గం పారిపోయింది.

ఈ విధంగా యీ నవల నాడు తెలంగాణలో జరుగుతున్న సంఘటనలకు ఒక సాక్షిగా నిలిచింది. నవలంతా ఓ కథలా సాగిందే గానీ, రచయిత స్వయంగా పాల్గొన్న ఒక ఉద్యమంగా చేసిన జన చైతన్య కార్యక్రమంగా కనిపించదు. శైలీ కథనంలో చిక్కదనం లోపించింది. భాష, యాస, పాత్రల సంభాషణలలో సహజత్వం కొరవడింది. ఏదేమైనా, 1946 తరువాత తెలంగాణలో కొత్త రోజు లొచ్చాయని సూచన ప్రాయంగా చెప్పడమే నవల ఉద్దేశంగా కనిపిస్తోంది.

**పాతరోజులు :**

1961లో 'కొత్తరోజులు' రాసి. 1965లో 'పాతరోజులు' రాశారు. ముందుగా పాతరోజుల గురించి పాఠకులు తెలుసుకుంటే కొత్తరోజుల్లో వచ్చిన మార్పులేంటో చక్కగా అవగాహన చేసుకునేవారు. బహుశా ముందుగా అనుకోకపోవడం వలన వెనకది ముందుకు. ముందుది వెనక్కు వచ్చి వుండవచ్చు. 1965లో మహీధర రామమోహనరావుగార్కి అంకితమిచ్చిన ఈ నవల విశాలాంధ్ర ప్రచురణాలయం వారు ప్రచురించారు. 1946లో తెలంగాణాలో సాయుధ పోరాటం ప్రారంభం కాకముందు తెలంగాణలో ప్రజల సాంఘిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులు ఎలా వుండేవో తెలుసుకోడానికీ ఈ నవల కొంతవరకు ఉపకరిస్తుంది.

తెలంగాణాలో రెండు రకాల పరిపాలన సాగుతుండేది. నైజాం నవాబు ప్రత్యక్ష పాలన క్రింద వున్న గ్రామాలను "ఖల్సా" గ్రామాలని, సంస్థానాదీశులు, జాగీరుదార్ల పరిపాలన క్రింద గల గ్రామాలను "ఖల్సేతర" ప్రాంతమని పిలిచేవారు. తెలంగాణాలోని ప్రతి గ్రామంలో దేశముఖో, దేశపాండ్యో, బంజరుదారో, మఖ్తాదారో, ఇనాందారో, గ్రామాధికార్లో, ఆయా గ్రామ ప్రజానీకంపై తమ పెత్తనం, అంతులేని దౌర్జన్యకాండ సాగిస్తుంటారు. వెట్టి పనులు చేయించుకుంటారు. దొరల ఇండ్లలో చాకలి, మంగలి సంవత్సరం పొడవునా వెట్టి చేయవలసిందే. సంవత్సరము పొడవు సరిపోయే పొయ్యిలో కట్టెలు హరిజనులు కొట్టి పెట్టాలి. మరుగుదొడ్లు శుభ్రపరచాలి. చంటి పిల్లల తల్లులను, 3, 4 రోజుల బాలింతలైన తల్లులను కూడా దొరల వ్యవసాయ పనులకు నిర్బంధంగా తీసుకొని పోయేవారు. గ్రామాలలో భార్య-భర్తల, తండ్రి-కొడుకుల, అన్నదమ్ముల మధ్య వచ్చే తగువులన్నిటిలో దొరలు జోక్యం చేసుకొనేవారు. దొరల భూముల్లోకి దారితప్పి పశువులు, గొర్రెలు - మేకలు వెళ్ళితే, పంట నష్టం కలుగనప్పటికీ మోయలేని జుల్మానాలు విధించేవారు.

ఎరగొండ గ్రామాన్ని నవలాక్షేత్రంగా తీసుకున్నాడు రచయిత. షికారు వెట్టికి రాజా సాహెబ్ తీసుకురమ్మన్నాడని హుసేన్ - కథానాయకుడు రామయ్యతో చెప్పే దృశ్యంతో నవల ప్రారంభమవుతుంది. అడవి కొట్టి పోడు చేసుకున్నందుకు కూడా వెట్టి చెయ్యవలసిందే. ఎరగొండ గ్రామంలో బసవయ్య పెద్దకాపు. పెద్దకాపు అంటే చాలా భూమి వున్నవాడు కాదు, మరి పెద్దకాపు అని రచయిత ఎందుకు చెప్పినట్టు. బహుశా పెద్ద కులానికి చెందినవాడు కావచ్చు. బసవయ్యకు ఒక కొడుకు, రామయ్యకు కూతురు గౌరమ్మ ఉన్నారు. గొడ్డూగోదాతో పాటు చిన్న కొంప - అతని ఆస్తి. వయసు మీదపడినా రోహిణీకార్తె ఎండలు మాడిపోతున్నా పశువులను అడవికి మేతకు తోలుకు పోతుంటాడు బసవయ్య. ఎండలకు, చెట్ల రాపిడికి అడవులు తగలబడితే పశువుల కాపర్ల మీద నేరం పెట్టి పై అధికారులకు చెప్పి శిక్షలు వేయించేవారు చౌకీదారులు. ఏ శిక్ష వేసినా ఇదంతా తమ "కర్మ" అని సరిపెట్టుకొని శిక్షలు అనుభవిస్తారే గానీ, మారు మాటాడరు జనం. ఎండా కాలం పశువులకు మేత దొరకదు. కూలీనాలీ లేక కూలి జనం తింటానికి తిండిలేక నకనకలాడుతుంటారు. మరోపక్క రాజాసాహెబ్ వేట, వినోదం, మందు పొందులతో జల్సాగా కాలం గడుపుతుంటాడు. రాజాసాహెబ్ వేటకు బయలుదేరితే, రివాజు ప్రకారం గ్రామ ప్రజలు యింటికొకడు చొప్పున కర్రలు, ఈటెలు, గొడ్డళ్ళు తీసుకొని బయలుదేరాలి, రాజాసాహెబ్ బండి ఎదురైతే ఎంత పనిమీద వున్న, దారి వెంట వెళ్ళేవారైనా సరే అందరూ తల చుట్టలనూడదీసి వంగలేనివారు కూడా వంగి వంగి దండాలు పెట్టూ, "దండాలు సామీ బానిసోళ్ళం" అనాలి. లేకపోతే "ఎవడ్రా లంజకొడ్కా?" అని నోరు పారేసుకుంటాడు. ఐనా రైతులు గజగజలాడిపోతూ దండాలు పెట్టుంటారు. "లంజా కొడుకుల్లారా! నక్క వినయాలు" అని తిడుతూ హంటర్‌తో తలా ఒక దెబ్బ అంటిస్తాడు. ఇక నవలలో మరో ప్రతి నాయకుడు గ్రామాధికారి అప్పారావు. గ్రామంలోని ప్రతి రైతుమీద తన ప్రతాపం

చూపిస్తుంటాడు. రాజాసాహెబ్‌కు ఉన్నవి లేనివి చెప్పి పురి ఎక్కిస్తుంటాడు.

ఈ నవలలోని ఒకానొక సంఘటన రచయిత హాస్య, వ్యంగోక్తిని తెలియజేయడమే గాక నాటి పాలకుల తీరు తెలియచేస్తుంది.

రోహిణీకార్తె ప్రారంభంలో అడవి తగలబడితే చౌకీదారు ఈ విషయాన్ని జంగ్లాతు అధికారులకు రిపోర్టు చేస్తాడు. ఆ రిపోర్టు అందుకున్న అధికారులు చర్చలు జరపి, "ఫౌరన్ బుఝాయ్ యేగ" అంటూ క్రింది అధికారి అమీనాకు ఉత్తరువులు పంపారు. ఆ ఉత్తరువులు అమీనాకు అందేసరికి ఆశ్లేషకార్తె ప్రవేశించింది. కార్తె ప్రవేశించిన నాటి నుండి వర్షం ఏకధారగా ప్రారంభమైంది. ఏర్లు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆ కుంభ వర్షంలోనే అమీనా ఎరగొండ గ్రామానికి వచ్చి "అరణ్యం తగులబడిపోతుంది. గేమంలోని చిన్నా పెద్ద మనిషికొక బుంగ నీళ్ళు ఎత్తుకొని మంటలనార్పడానికి రావల్సివుంద"ని చాటింపు వేయిస్తాడు. ఎవరూ ప్రశ్నించరు. ఎదురు తిరిగితే కొరడా దెబ్బలు, అందుకే గ్రామంలో జనాభా అంతా మనిషికొక బిందె తీసుకొని యర్రచెరువు నీళ్ళు ముంచుకొని, కాలు పెడితే బారెడు దూరం జారుతున్నా లెక్కజేయక కాలుగడ ప్రదేశానికి చేరుకుంటారు. అక్కడ మోకాటి లోతు సెలయేరు ప్రవహిస్తుంది. "జల్దీ చేయండి – ఎక్డా మంటల్ వుంటే, అక్డా బిందెల్ గుమ్మరించండి" అని ఆజ్ఞాపిస్తాడు. అతని మతి భ్రమణ జూసి అందరికీ నవ్వు వచ్చింది కానీ, అధికారి ముందు పెదవులు కదిలించడానికి భయం. బిందెల్లో నీరు కాలుగడలో గుమ్మరించి వచ్చారు.

"ఆర్పివేశాము" అన్నారు

"ఠీక్ హై" అన్నాడు అమీనా.

ఈ సంఘటన చదువుతున్నంతసేపు పాఠకుడు ఆనందాన్ని పొందుతాడు "దున్న యీనిందంటే గాటగట్టి వేయమనే ప్రభుత్వం".

జనానికి తింటానికి లేకపోయినా కొందరు తాగుడుకు బానిసలై సంసారాల్ని ఎలా పాడు చేసుకుంటున్నారో నాగుమయ్య కుటుంబంలోని అంజమ్మ, పున్నయ్య పాత్రల ద్వారా తెలియజెప్పాడు రచయిత.

రామయ్యలాంటి యువకులు కష్టపడి అడవి కొట్టి పోళ్ళు చేసుకుని విత్తు వేసి, ఎండకు ఎండి, వానకు తడిసి పంటలు పండించుకుంటే అప్పారావు లాంటి కరణాలు తనిఖీ పేరుతో జాడు పీక్కు పోవడం, రైతులు నెత్తి నోరు బాదుకున్నా వినే నాథుడు లేకపోవడం, కుర్రవాళ్ళు ఎదురు తిరిగితే వాళ్ళ మీద దొంగతన నేరాలు అంటగట్టి, రాజాసాహెబ్‌తో కొరడా దెబ్బలు కొట్టించడం మామూలుగా జరిగే సంఘటనలు.

రాజాసాహెబ్ ఆగడాలకు అడ్డు చెప్పేవారే లేరు రామానాయకుడి కూతురు మాణిక్యం పొలంలో పని చేస్తుండగా బలవంతంగా దివాణంకు లాక్కుపోతాడు. జనం చూస్తూ ఊరుకుంటారేగానీ ఎదురు చెప్పరు. రామయ్య దివాణంకు వెళ్ళి ఆమెను, తన తండ్రిని విడిపించుకుంటాడు. ఆ సందర్భంలో రామయ్యను తన తుపాకీతో కాల్చాలనుకుంటాడు. ఆ ప్రయత్నం విఫలమవుతుంది. కరణం జనన మరణ రిజిస్టరులో నమోదులు చేయడానికి కూడా లంచాలు తీసుకునే సన్నివేశం నాటి పరిస్థితులకు వో నిదర్శనం. "కరణం మనవాడయితే కలం మనది గాకుండా పోతుందా?" అనే మాటలు కరణాల పెత్తనం ఎలా వుండేదో సూచిస్తుంది.

ఈ నవలలోని మరో సన్నివేశం తప్పక చెప్పుకోవాలి. కొట్టుకున్న పోళ్ళకి పట్టాలు పొందడానికి ఎరగొండ ప్రక్క గ్రామస్తులు సర్కారుకు ఎలా విసుగు కలిగించారో చెప్పే సంఘటన. కొత్త పోళ్ళు కొట్టుకున్న కొత్త రోజుల్లో అధికారి వచ్చి గ్రామంలో దండోరా వేయించాడు. "పంటకున్న చివరి భాగం అంతా సర్కారీ అంబారం" అని రైతులు మొక్కజొన్న పంట వేశారు. సర్కారీ వారికి వెన్ను మిగిలింది. మిగిలిన పంట రైతుకు దక్కింది. మరుసటి సంవత్సరం మధ్యభాగం తీసుకుంటా మన్నారు. రైతులు చిలకడదుంప, చామ, పెండలం పండించారు. మూడవ సంవత్సరం మొదళ్ళు తీసుకుంటామన్నారు. ఆ సంవత్సరం పునాస జొన్న వేశారు. ఇక ఏమీ చేయలేక చివరకు విసుగెత్తి ఎవరి భూమి వారికి పట్టాలిస్తూ, భూసార పరిమితిని బట్టి శిస్తులు అంటగట్టారు. ఇది చదవడానికి బాగానే వుంది. కానీ అప్పారావు లాంటి కరణాలు అంత దద్దమ్మలు కారు. వేలుకేస్తే కాలికి, కాలుకేస్తే వేలుకు వేసే రకం. ఇది వాస్తవానికి దూరంగా వుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

నవలలో చివరకు బసవయ్య పట్టణం వెళ్ళి వచ్చి, ఎరగొండ రైతుల పోడు భూములకు పట్టాలు తేవడంలో సుఖాంతమవుతుంది. అసలు ఆ పట్టాలు ఎలా వచ్చాయి? ఆనాటి పరిస్థితుల్లో అది సాధ్యమేనా? అన్న సందేహం పాఠకుడికి తప్పక కలుగుతుంది. దానికి సమాధానం లేదు. కానీ "తెలంగాణా పోరాట స్మృతులు" అనే పుస్తకంలో ఆరుట్ల రామచంద్రారెడ్డిగారు రాసిన దాన్ని బట్టి పట్టాలు రైతులకు రావడం సాధ్యమయ్యే పనే కాదు. బంజరు భూముల్ని పోడు భూముల్ని నైజాం ప్రభుత్వం సంస్థానాదీశులు పెద్ద జాగీరుదారులు తమ పరిపాలన ప్రాంతంలో వారి బంధువులకు, వారి మెప్పు మన్ననలను బడిసిన వారికి కానుకల రూపంలోనో మరో రూపంలోనో ఇచ్చేవారని చెప్పారు.

**ముగింపు :**

పైన పేర్కొన్న రెండు నవలల తరువాత 1966లో మరో నవల 'తెలుగు గడ్డ' రాశారు గొల్లపూడి వారు. ఈ నవల 1946–51 మధ్య తెలంగాణా ప్రజల జీవితం, నిజాం పాలన తెలుసుకోవడానికి కొంతవరకు ఉపయోగపడుతుంది. మొత్తంగా ఈ మూడు నవలలు 1920–1951 మధ్య ప్రజల కదిలే జీవితాలకు ప్రతిబింబమని చెప్పవచ్చు. నాటి ఆర్థిక, సాంఘిక చారిత్రక నేపథ్యాలను అర్థం చేసుకోవచ్చు. నవలలు ఆవిర్భావానికి ప్రాథమికంగా రెండు కారణాలుంటాయి. ఒకటి రచయిత తాను ప్రత్యక్షంగా చూసిన సంఘటనలు. రెండు తన చుట్టూ ఉన్న పరిస్థితులపై తన పరిశీలన. ఇవి రచనకు ప్రేరణ అవుతాయి. సామాజిక బాధ్యత కలిగిన రచయిత తన తరంవారికే గాక ముందు తరాలవారికి ఆ చరిత్రను అందించడానికి నిరంతరం తపనబడతాడు. ఇలాంటి నవలల వలన గతకాలపు వాతావరణమూ, జీవితమూ, ఆచార వ్యవహారాలు పునరుజ్జీవనం పొందుతాయి. చరిత్రకే ప్రాణం వస్తుంది. ✺


సినిమా సమీక్ష

# రజాకార్లతోవలో నడిచేవాళ్ళు తీసిన సినిమా
# రజాకార్

- ఐ.టీ.ఆర్.వి. శివాజీరావు

**కొంతమంది** చరిత్ర తమ చేతిలో చెయ్యేసి నడిస్తే బాగుండునని అనుకుంటారు. మరికొందరు చరిత్ర తమ ప్రయోజనాల కోసం ఆడించే కోతిగా ఉండాలనుకుంటారు. ఏది ఏమైతేనేం తమకు నచ్చిందే చరిత్ర అనుకునే రోజులు వచ్చాయి. చరిత్ర తనకు తానుగా నడవడం కాక వీళ్ళు చెప్పినట్టు నడవాలని అనుకుంటారు. తమ భావజాలాన్ని సుస్థిరం చేసుకోవడానికి చరిత్రను కూడా తమ కింద పనిచేసే పాలికాపుగా మార్చాలని అనుకుంటున్నారు ఈ పెత్తందారులు.

వాట్సప్‌లో టైపింగ్ వచ్చినవాళ్ళల్లో చాలామంది చరిత్రకారుల సరసన చేరిపోయినట్లే, కెమెరా చేతబట్టి సినిమా తియ్యడం చేతనైన వాళ్ళంతా కూడా చరిత్రకు కు వ్యాఖ్యానం చేసేస్తున్నారు. ఇలాంటి ఫాల్తూ మేకర్స్ తీసివదిలిన సినిమాల కోవకు చెందినదే "రజాకార్" సినిమా కూడా. భూమి కోసం భుక్తికోసం విముక్తికోసం జరిగిన ఒక మహత్తర పోరాటాన్ని ఒక మతం కోసం జరిగిన పోరాటంగా ఈ సినిమాలో కుదించేసారు.




సినిమా మొదట్లోనే వాచ్యంగా కొంత చరిత్రను తమకు అనుకూలంగా మలిచే ప్రయత్నం చేశారు. అటు మహారాష్ట్ర, ఇటు కర్ణాటక వరకు విస్తరించిన ఈ రాజ్యంలో ప్రజలు సుఖశాంతులతో వుండేవారనీ సంస్కృతంతో బాటూ తమ ప్రాంతాల భాషలు స్వేచ్ఛగా మాట్లాడుకునేవారనీ చిత్రించారు. ఎప్పుడూ సంస్కృతం ప్రజల భాష కాదు. కొద్దిచోట్ల పాలకవర్గాల పండితుల భాషగా మాత్రమే ఉండేది. కానీ సినిమా కథను చెప్పేవాళ్ళ ఉద్దేశ్యం వేరు. అది బాగా బ్రతికిన భాష అనీ బహమనీ సుల్తానులు ఆ తర్వాత వచ్చిన మొగలులూ, అసఫ్ జాహీవంశస్థుల వంటిముస్లిం రాజుల పరిపాలనలో స్థానిక తెలుగు, మరాఠా, కన్నడ భాషలతో బాటు సంస్కృతం కూడా నాశనమైపోయిందని చూపారు. దానితో ప్రజల మనోభావాలు మరింతగా గాయపడి హిందువులనుకునేవారంతా ముస్లింలపట్ల ద్వేషం పెంచుకోవాలనేది ఈ చిత్రం తీసినవారి ఉద్దేశం.

ఈ సినిమా కొన్ని సంఘటనల అతుకుల బొంత. వాటికి సాక్ష్యాలుగా అక్కడి వూర్ల పేర్లను కూడా వాడారు. కథని ఏకమొత్తంగా చూపించేకన్నా ఇలా శకలాలుగా చూపించడం వలన ఒక వెసులుబాటు వుంది. అదేమిటంటే తాము ఏ లక్ష్యం ఆశించి కథ చెప్పాలనుకుంటున్నారో అది నెరవేరుతుంది. ఇంతకీవాళ్ళ లక్ష్యం ఏమిటి?!

భూమికోసం, భుక్తికోసం వ్యవసాయక విప్లవం ఇరుసుగా హిందూ ముస్లిం ప్రజలు చేయి చేయి కలిపి తమ హక్కులకై, తరతరాల వెట్టిచాకిరీ నుంచి, బానిసత్వం నుంచి విముక్తికై చేసిన పోరాటమే తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం. ముస్లిం పాలకులు అడుగడుగునా హిందూ మతాన్ని కించపరిచి అవమానించారు అని హిందువులలో ముస్లింలపై ద్వేషం రగిల్చి హిందూ ఓట్లను సంపాదించు కోవాలని, హిందూ ముస్లింలు, అణచబడుతున్న ప్రజలందరినీ ఐక్యం కానీయకుండా విడగొట్టి అధికారంలోకి రావాలనే ప్రయోజనంతోనే ఈ సినిమాను తీశారు.

తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటాల చరిత్రని యధాతధంగా తీసుకొని తెరకెక్కిస్తే ఆ స్ఫూర్తిని అందుకున్న హిందూ ముస్లింలు మరలా ఐక్యం కావడం ప్రారంభిస్తారు. కులాల, మతాల అడ్డుగోడలు కొంతైనా బద్దలవడం ప్రారంభం అవుతుంది. ఇంకా నేటి దోపిడీ పాలకుల నైజం, నాటి నైజాము సరకారోడికన్నా ఏమాత్రం తీసిపోలేదు అని ప్రజలు అర్థం చేసుకుంటారు. మరొక విముక్తి పోరాటపు స్ఫూర్తిని అందిపుచ్చు కుంటారు. అందుకోసం జరిగిన చరిత్రను జరిగినట్టుగా కాకుండా తాము లక్ష్యించిన విషయాలు సాధించుకోవాలంటే చరిత్రను చరిత్రగా కాకుండా అందులోని కొన్ని సంఘటనలు తీసుకొని, కొంత మసాలా దట్టించి చూపారు.

ప్రస్తుత పాలకపార్టీ బీజేపీకి తన పాలు పట్టి పోషించిన ఆర్ఎస్ఎస్‌కి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న చరిత్ర లేదు. ఒకవేళ సావర్కర్ లాంటివాళ్ళు పాల్గొన్నా బ్రిటిష్ వాళ్ళ బూట్లు నాకే పని చేశాడు కాబట్టి చెప్పుకోలేని పరిస్థితి. అయితే ఇప్పుడు క్షమాభిక్ష కోరితే తప్పేముందని కొత్తకొత్త వాదనలు ముందుకొస్తున్నాయి అది వేరే విషయం. ఇపుడు వాళ్లకంటూ చెప్పుకోవడానికి ఒక నాయకుడు కావాలి. ఆ నాయకుడే పటేల్! గాడ్సే, సావర్కర్‌ల భుజాల మీద గన్ పెట్టి కాంగ్రెస్‌ని కాల్చడం కన్నా ఒక కాంగ్రెస్ నాయకుడి భుజం మీదే గన్ పెట్టి కాంగ్రెస్ నాయకులని, వాళ్ళ స్వాతంత్రోద్యమ చరిత్రని కాల్చి పారేస్తే తమ కళంకం కడిగేసుకొని దాన్నే వాళ్ళ మీద చల్లేయ్యొచ్చు. ఇది బాగా వర్కౌట్ అయినట్టుగా బీజేపీకి అనిపించింది. అందుకని ఆ ఫార్ములానే అమలు పరుస్తున్నారు. అయితే ఇది బీజేపీ సొంత టెక్నిక్ కాదు.

సామ్రాజ్యవాదులు ఎన్నో దేశాలలో అవలంబిస్తున్న ఎత్తుగడే! రష్యాలో ట్రాట్స్కీ వంటి రివిజనిస్ట్ నాయకుల్ని ముందుకు తేవడం, లాటిన్ అమెరికాలోని దేశాలలో విముక్తి పోరాటాలకు నాయకత్వం వహించిన వాళ్లకు కౌంటర్‌గా వాళ్ళ వ్యతిరేకులను తెరముందుకి తీసుకురావడం దీంట్లో భాగమే!

పటేల్‌కి గాంధీ, నెహ్రూ ప్రభృతుల వల్ల అన్యాయం జరిగిందనీ, పటేలే ఆనాడు ప్రధానమంత్రి అయి వుంటే ఈనాడు దేశ స్థితిగతులు ఇలా వుండేవి కావనీ, ఇటు శ్రీలంక దగ్గరనుండి ఆటు మలయా, జావా వరకూ వున్న అఖండ భారత్‌ను సాధించేవాడనే వాదన తీసుకొస్తున్నారు. గాంధీని గాడ్సే హత్య చేసిన తర్వాత ఆర్‌ఎస్‌ఎస్‌ని నిషేధించింది అప్పటి హోంమంత్రి పటేలే.

**చరిత్రను వక్రీకరిస్తూ తీసిన ఈ సినిమా కథ :**

కథా ప్రారంభంలోనే నిజాం పాలనలో జరుగుతున్న అరాచకాలను పరిశీలించి సాక్ష్యాలు సేకరించడానికి కేఎం మున్షీని హైదరాబాద్‌కు ఏజెంట్ జనరల్‌గా పంపిస్తాడు అప్పటి హోంమంత్రి పటేల్ ! మూడు నెలల్లో నిజాం రాజ్యాన్ని భారత్‌లో విలీనం చేద్దాం అంటాడు. హైదరాబాద్ స్టేట్‌లో ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్‌ను భారత్‌లో కాకుండా తుర్కిస్తాన్ అనే స్వతంత్ర దేశంగా ఉంచాలని పాకిస్థాన్‌తో, ఇటు ముస్లిం రాజ్యాలతోనూ, ఐక్యరాజ్యసమితితోనూ సంప్రదింపులు జరుపుతాడు. ఫలితంగా ఐక్యరాజ్యసమితి, నిజాం సంస్థానం భారత్‌లో విలీనం కాకుండా వుండడానికి ఒక సంవత్సరం గడువు ఇస్తుంది. లాయక్ అలీ ప్రధానమంత్రిగానూ, ఖాసిం రజ్వీ సైన్యాధ్యక్షుడిగానూ వుంటారు.

ఖాసిం రజ్వీ నిజాం రాజ్యాన్ని ముస్లిం రాజ్యంగా మార్చే ప్రక్రియ చేపడతాడు. ఆ క్రమంలో రజాకార్లు గ్రామాల మీద పడి హత్యలు మానభంగాలూ దోపిడీలు చేస్తారు. చాలా మందికి మీసాలు గొరిగి ముస్లింలుగా మారుస్తారు. తెలుగు పాఠాలు చెబుతున్న పంతులు నోట్లో కత్తి దించి, అక్కడి పిల్లల్ని దారుణంగా చంపుతారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్యసమాజం వాళ్ళు రజాకార్లని చంపేస్తారు. ఈ పోరాటంలో ఆవు కూడా పాల్గొంటుంది. తన శరీరం మీద నెలవంక, నక్షత్రం గుర్తు వేసిన రజాకార్‌ను తన కొమ్ములతో పొడిచి చంపేస్తుంది. ఇలా సినిమాలో చాలా అరాచక సంఘటనలను చేర్చి, మతం కోసమే తెలంగాణా పోరాటం జరిగినట్టు చూపించారు. అంటే ఈ ఘోరాలు, నేరాలు చేసినవాళ్ళు ముస్లింలే అని చెప్పదలుచుకున్నారు. అయితే కొన్ని వాస్తవాలు కూడా చూపించక తప్పలేదు. అందులో చాకలి అయిలమ్మ సంఘటన ఒకటి. చాకలి అయిలమ్మ పంటను కాజేయాలనుకున్నది విసునూరు రామచంద్రారెడ్డి అయితే ఇక్కడ మత కోణం చూపించడానికి అతను హిందువాయే! హిందువు గాబట్టి అంత నరరూప రాక్షసుడికి చిన్న వెసులుబాటు ఇచ్చారు. అతని దుర్మార్గాలు పెద్దగా చూపించకుండా కేవలం అయిలమ్మతో జరిగిన సంఘటనే చూపించి వదిలేశారు.

రామచంద్రారెడ్డి అనుచరులు తన ధాన్యం కాజెయ్యడానికి రాగానే అయిలమ్మ ఒంటిచేత్తో వాళ్ళని కొట్టేస్తుంది. అయిలమ్మకి ఆ చైతన్యం అందించిన సంఘం గురించి గానీ, కమ్యూనిస్ట్ పార్టీ గురించి గానీ ఎక్కడా ప్రస్తావన లేదు. కాకపోతే అయులమ్మను కొడుతున్నప్పుడు సంఘనాయకుడు నర్సింహారెడ్డి అతని సహచరుడు అడ్డుకుంటారు. కానీ వాళ్ళని కూడా వ్యక్తిగత హీరోయిజంకి పరిమితం చేశారు తప్ప ఒక విముక్తి పోరాటంలో భాగంగానే ఇది జరిగిందని ఎక్కడా చెప్పలేదు. భైరాన్‌పల్లి ఘటన కూడా అదేవిధంగా కొంతమంది వ్యక్తులు చేసినదిగానే చూపించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న సంఘటనలు నెహ్రూ ముందుంచుతారు మున్షీ, పటేల్‌లు. కానీ నెహ్రూ ఐక్యరాజ్యసమితి ఒప్పందాన్ని ప్రస్తావిస్తారు. అంటే ఇక్కడ ఉద్దేశ్యం స్పష్టమే! నెహ్రూని విలన్‌గానూ, పటేల్‌ని హీరోగానూ చూపించాలి. పటేల్ చేతులు నెహ్రూ కట్టేసాడు అనే భావం ప్రేక్షకుల్లో రావాలి. అలాగే 'ఇమ్రోజ్' పత్రిక ఎడిటర్ షోయబుల్లాఖాన్ హత్యను కూడా చూపించక తప్పలేదు.

మొత్తంగా చూసుకుంటే ఇదొక రెండు మతాల రెండు ధర్మాల మధ్య పోరాటంగా చిత్రించాలనుకున్నారు. ఈ విధంగా అసలైన ప్రజా పోరాటాలను, చరిత్రను మరుగుపరచాలనుకున్నారు. మీర్ ఉస్మాన్ అలీఖాన్, రజాకార్ల నాయకుడు ఖాసిం రజ్వీ వీళ్లంతా ముస్లింలే! అయితే వీళ్ళకి సహకరించిన దేశ్‌ముఖ్‌లు పటేల్‌లు,పట్వారీలు, వేలాది ఎకరాల భూములు ఆక్రమించుకొని వేలాది గ్రామాలను తమ ఏలుబడి కింద వుంచుకొని తమ గడీలలో అరాచకాలు చేసిన వాళ్లంతా ఎవరు? తన పొలాలలో వెట్టిపని కోసం వచ్చిన బాలింతలు, మధ్యలో తమ పిల్లలకు పాలివ్వడానికి వెళుతుంటే పనికి ఆటంకం కలుగుతుందని వాళ్ళ రొమ్ముల్లో పాలు పిండించి పారబోయించిన విసునూరు రామచంద్రారెడ్డి హిందువా, ముస్లిమా?

పెళ్ళయిన మొదటిరాత్రి స్త్రీలను తన పక్కలోకి పిలిపించుకున్న దొరలంతా ఏ మతానికి చెందినవారు! తమ ఏలుబడిలో ఉన్న ప్రజల మాన ప్రాణాలు దోచుకొని వాళ్ళ పుట్టుకకు చావుకు పన్నులు వేసి వాళ్ళ రక్తమాంసాలు పీల్చి పిప్పిచేసిన వాళ్లంతా హిందూ దొరలే! ఒక్కొక్కడూ ఒక్కో నరరూప రాక్షసుడు! ఈ హిందూ దొరలంతా హింసించింది తమ కిందనున్న హిందువులనే! హిందువులనే కాకుండా పేద ముస్లింలను కూడా!

వీళ్లేవరూ మా హిందువులను ఎందుకు హింసిస్తున్నారనిగానీ, అదేవిధంగా నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ గానీ, ఖాసిం రజ్వీ మా పేద ముస్లింలను ఎందుకు హింసిస్తున్నారని గానీ అడిగింది లేదు. వీళ్ళ లక్ష్యమల్లా ప్రజలను వారి మతంతో సంబంధం లేకుండా దోచుకోవడమే!

ఒక నాటికి ఈ హిందూ దొరల ఆగడాలు పెరిగిపోయాయని గ్రహించిన నిజామే "మీరు! మేము చెప్పిన విధంగా మాత్రమే పన్నులు వసూలు చేసుకోవాలి" అని ఫర్మానా ఇవ్వాల్సి వచ్చిందట. ఆనాటి ఆంధ్ర మహాసభ కూడా ఈ విషయంలో నిజాంని సమర్థించిందట.

కమ్యూనిస్ట్ పార్టీ ఆంధ్రమహాసభ పేరుతో ప్రవేశించిన తర్వాత ప్రజల్లో చైతన్య బీజాలు వేయడం ప్రారంభించింది. మొట్టమొదటిసారిగా తమ భాష, తమ సాంస్కృతిక అస్తిత్వాన్ని నిలబెట్టుకున్నారు. ఈ దొరలను, పటేల్ పట్వారీ వ్యవస్థను ఎదుర్కోవాలంటే సంఘంలో చేరాలని నిర్ణయించుకున్నారు. అప్పటి ఉద్యమ అవసరాల డిమాండ్ మేరకే ఆయుధాలు కూడా పట్టుకున్నారు. ఆనాటి కమ్యూనిస్ట్ పార్టీ ప్రజలతో కలిసి నడిచింది. వారికి చైతన్యం అందించింది. దీని ఫలితంగానే 3000 గ్రామాలు విముక్తి అయ్యాయి. దొరలు తమ గడీలను వదిలి

హైదరాబాద్ పారిపోయారు. ప్రజలు పది లక్షల ఎకరాలను పంచుకున్నారు. గ్రామ కమిటీలు సమస్త నిర్ణయాలు తీసుకున్నాయి. స్త్రీలు తుపాకీలు, వడిసెలలు చేతబట్టి దొరలనూ, రజాకార్లను ఎదుర్కొన్నారు. బాలల దళం ఏర్పడింది. ప్రజలకు కమ్యూనిస్ట్ చైతన్యం పెరుగుతున్న కొద్దీ కులమతాల ప్రస్తావన పోయింది. కులాలకు, మతాలకూ అతీతంగా పెళ్ళిళ్ళు జరిగాయి. ఎంతోమంది నిరక్షరాస్యులు విద్యావంతులయ్యారు. భారతదేశ చరిత్రలోనే ప్రజల్ని ఇంతగా చైతన్యం చేసిన ఉద్యమం మరొకటిలేదు. 'రజాకార్' సినిమా తీసినవాళ్ళకి ఇదంతా ఏమీ కనిపించలేదు, ఒక్క మత కోణం మాత్రమే కనిపించింది. అది అసత్యం. నిజాం మీద, రజాకార్ల మీద సంఘంతో కలిసి పోరాడిన వేలాదిమంది సామాన్య ముస్లిం ప్రజానీకం కనిపించలేదు.

పోనీ భారత ప్రభుత్వం చేపట్టిన సైనిక చర్యని కూడా వక్రీకరించి చూపించారు. కానీ జరిగిన చరిత్రని ఎవరూ మరుగుపరచలేరు. అది నట్టనడి సూర్యుడిలా సత్యాల వెలుగును వెదజల్లుతూనే వుంటుంది.

హైదరాబాద్ సంస్థానంలోకి అట్టహాసంగా ప్రవేశించిన భారత్ సైన్యాలకు యెటువంటి చెప్పుకోదగ్గ ప్రతిఘటన లేకుండానే నిజాం సైన్యాలు లొంగిపోయాయి. "నువ్వు కొట్టినట్టు కొట్టు, నేను లొంగినట్టు లొంగుతాను", అనే చీకటి ఒప్పందంలో భాగంగానే ఈ డ్రామా జరిగింది. అయితే మరి భారత్ సైన్యాల పని అయిపోయాక వెనక్కి వెళ్లిపోవాలి కదా, కానీ అలా జరగలేదు. భారత సైన్యాలు నిజాం రాజ్యంలోకి వచ్చిన కారణాలు వేరు. అది కమ్యూనిస్ట్‌లను వెంటాడి వేటాడి చంపడం, పారిపోయిన దొరలను గడీలకు రప్పించడం, ప్రజలు పంచుకున్న భూములను తిరిగి దొరలకి అప్పగించడం. ఆ క్రమంలో వందలాది మంది కమ్యూనిస్ట్ కార్యకర్తలను సైన్యం కాల్చి చంపారు. ఎంతోమంది ఆడపిల్లలను రేప్ చేశారు. పళనియప్పన్ ముఠా రజాకార్లకు మించిన ఆకృత్యాలు చేసింది. ఇదంతా రికార్డ్ అయివున్న చరిత్ర. మరి ఈ చరిత్రను ఎందుకు చూపించలేకపోయింది 'రజాకార్' సినిమా?! అంటే కారణాలు స్పష్టమే అనాడు రజాకార్ల కంటే కమ్యూనిస్ట్‌లను ప్రజలనూ చూసే నెహ్రూ, పటేల్ ప్రభుత్వం ఎక్కువ భయపడింది. నిజాంను లొంగదియ్యడానికి వచ్చిన భారత ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొని రాజ్ ప్రముఖ్ బిరుదును, లక్షల రూపాయల భరణాన్ని ఇచ్చి వెళ్ళింది. పరమ దుర్మార్గుడు ఖాసిం రజ్వీను సురక్షితంగా పాకిస్థాన్‌కు పంపించింది. ఇక్కడి హిందూ దొరలను యదావిధిగా గడీలలో ప్రతిష్టించింది. ఇపుడు దానిని కొనసాగించడానికే 'రజాకార్' సినిమా వచ్చింది. ప్రజల్లో మత విద్వేషాలు రగుల్కొల్పి వారిని ఐక్యం కాకుండా చేసే, చరిత్రను వక్రీకరించే ఇటువంటి సినిమాలను ప్రజలే తిప్పికొడతారు. ✹

## నా విలువైన పదేళ్ళ జీవిత కాలాన్ని ఎవరు తిరిగి ఇవ్వగలరు?

**2024** మార్చి 6న నిరపరాధిగా విడుదలైన జి.ఎన్. సాయిబాబా సంధించిన ఈ ప్రశ్నకు ఏ ప్రభుత్వ చట్టాలు సమాధానమీయగలవు? నిషేధిత మావోయిస్టు పార్టీతో సంబంధాలున్నాయన్న ఆరోపణతో 9 మే 2014న అరెస్టయిన 90 శాతం దివ్యాంగుడైన జి.ఎన్. సాయిబాబా మార్చి 6న విడుదల అయ్యారు. ఈ పదేళ్ళ కాలంలో ఆయనపై పెట్టిన కేసు, బెయిలు, పెరోల్ దరఖాస్తులు మొదలైనవన్నీ అనేక మలుపులు తిరిగి ఆఖరికి బొంబాయి హైకోర్టుకు చెందిన నాగపూర్ బెంచి తీర్పుతో ఆయన విడుదల సాధ్యమైంది.

గోకరకొండ నాగ సాయిబాబా (జననం 1967) అమలాపురంకు చెందిన పేద రైతాంగ కుటుంబానికి చెందినవాడు. పోలియో కారణంగా కాళ్ళు చచ్చుబడి తన ఐదవ ఏట నుండీ చక్రాల కుర్చీ వాడుతున్నవాడు, ఆయన అమలాపురంలో బి.ఏ., హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు సాహిత్యంలో ఎం.ఏ., ఢిల్లీ యూనివర్శిటీలో పిహెచ్‌డి చేశారు. ఆదివాసీ సమస్యలపై, మానవ హక్కులపై, ఇతర సామాజిక సమస్యలపై క్రియాశీల కార్యకర్తగా వివిధ ప్రజాసంఘాలలోను పనిచేశారు. 2003 నుండీ ఢిల్లీ విశ్వవిద్యాలయపు రామ్‌లాల్ ఆనంద్ కళాశాలలో ఇంగ్లీషు శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసరుగా చేశారు. 2014లో అరెస్టయిన తర్వాత ఆయనను సస్పెండ్ చేసి 2021లో యావజ్జీవ ఖైదు శిక్ష విధించినప్పటివరకు సగం జీతం ఇచ్చి, ఆ తర్వాత ఉద్యోగం నుంచి తొలగించారు.

90 శాతం పనులకు ఇతరులపై ఆధారపడ్డ సాయిబాబా నాగపూర్‌లోని కోడిగ్రుడ్డు ఆకారంలో వుండే అండా సెల్‌లో ఏకాంత నిర్బంధాన్ని అనుభవించారు. ఆ గదిలో వున్నవారికి బయట ప్రపంచం ఆకాశం, ప్రకృతి ఏమాత్రం కనబడదు. విడుదల తర్వాత సాయిబాబా వ్యాఖ్యానించినట్లు "ఇన్నాళ్ళు బతికి బయటపడటం ఒక అద్భుతమేనని చెప్పాలి. ఎందుకంటే ఈ పదేళ్ళ కాలంలో జైలులో సరైన సదుపాయాలు, మందులు చికిత్స ఏమీ లేవు. ప్రస్తుతం ఆయన గుండె 55 శాతమే పనిచేస్తోంది. కండరాలు, లివర్, గాల్‌బ్లాడర్, పాంక్రియాస్ అవయవాలకు కొత్త వ్యాధుల బారినపడ్డారు. కుడిచేయి సక్రమంగా పనిచేయడంలేదు. డాక్టర్లు పలు ఆపరేషన్లు అవసరమని చెప్పారు.

వృద్ధాప్యంలో అనారోగ్యంగా వున్న తల్లిని చూడటానికి గానీ, ఆమె మరణించినపుడు అంత్యక్రియలకు వెళ్ళడానికి గానీ పెరోల్, లేక బెయిల్‌కు కోర్టు తిరస్కరించింది. 90 శాతం ఇతరులపై ఆధారపడే ఈ దివ్యాంగుడి 'మేధస్సు' ప్రభుత్వానికి ప్రమాదకరం అని కోర్టు బెయిల్‌ను పదేపదే తిరస్కరించింది.

సాయిబాబాపైనగానీ, భీమా కోరెగావ్ కేసు అంటూ అరెస్టు చేసిన ప్రజాస్వామికవాదులు, రచయితలు, సామాజిక కార్యకర్తలపై గానీ వారిపై చేసిన నేరారోపణలకు దశాబ్దాల తరబడి ఆధారాలు చూపలేని ప్రభుత్వం, వారిని వేధించటానికీ, తద్వారా వారి భావాలతో ప్రభావితమైనవారిని భయపెట్టడానికి ఈ అరెస్టుల తతంగాన్ని కొనసాగిస్తోంది. ✹

స్పందన

# అంబానీ ఇంట పెళ్లి.... మనకెందుకంత లొల్లి?

- మనస్విని

**పుత్తడి** గలవాని పుండు బాధైనను /
వసుధలో చాల వార్తకెక్కు /
పేదవాని ఇంట పెండ్లైన ఎరుగరు /
విశ్వదాభిరామ వినురవేమ!

ప్రస్తుతం ప్రపంచ అత్యంత ధనవంతుల్లో ఒకరైన మన స్వదేశీ ధనవంతుడు ఇంట్లో జరగబోతున్న పెళ్లి గోల, ఏనాడో వేమన రాసిన ఈ పద్యానికి అద్దం పడుతుంది. మూడు రోజులపాటు, జాతీయ, అంతర్జాతీయ సెలబ్రిటీలంతా తమ పనులన్నీ పక్కన పెట్టేసి, అంబానీ కుటుంబాన్ని అలరించిన హంగామా చూసాక, మన దొంగలందరూ దోచుకున్న సొమ్మును ఎంత నిర్భీతిగా ప్రదర్శిస్తున్నారో కదా అన్పించింది.

ఏమయినప్పటికీ, మొన్న అంబానీ ఇంట్లో జరిగిన "ముందస్తు వివాహ వేడుక" చాలానే చర్చరేపింది. బిల్‌గేట్స్, మార్క్ జుకెర్బర్గ్, ఇవాంకా ట్రంప్ లాంటివారే కాక అమెరికన్ పాప్ సింగర్ రిహాన్నా లాంటివారు కూడా రావడం, వాళ్ళతోపాటు బాలీవుడ్ స్టార్లు అంతా అక్కడే ఉండడం మొదలైనవన్నీ అంబానీ దగ్గర పోగుపడిపాయిన సంపద ఎంతో ఆ సంపద పోగుపడటంలో ఏ స్థాయివారున్నారో ప్రపంచానికి తెలిసింది. ఈ సెలబ్రిటీలు అంతా ఏదో చుట్టపు చూపుగా వచ్చి వెళ్ళిన వారేమీ కాదు. రిహాన్నాకి మొత్తం 72 కోట్ల రూపాయలు ఇచ్చారట, బాలీవుడ్ స్టార్లు అందరికీ కనీసం 4-5 కోట్ల రూపాయలు ఇచ్చి మరీ ఈ ఈవెంట్కి రప్పించారట. దీనికోసం, ప్రభుత్వ / మిలిటరీ పర్యవేక్షణలో నడిచే జమ్నగర్ విమానాశ్రయాన్ని (అంబానీ ఇంటికి దగ్గరలో ఉంది) కొన్ని రోజులపాటు అంతర్జాతీయ విమాన రాకపోకలకు ఉపయోగించారు. (ఇది రోజుకు 16 విమానాలను మాత్రమే ఆపరేట్ చేయగల చిన్న విమానాశ్రయం)

చిన్నారుల ఆకలి మరణాలు, మూడు పూటలా తిండి నోటికి వెళ్లని పేదరికం, పెరిగే ధరలకు పోటీగా పరిగెడుతూన్నా ప్రజలు బ్రతకలేక బతుకుతుంటే, ఇంత నిస్సిగ్గుగా సంపదను ప్రదర్శిస్తున్నారని కొందరు విమర్శించారు. 1200 కోట్ల ఖర్చు జరగడంతో సంపద పంపిణీ జరిగి, రెవెన్యూ వస్తుందనీ, అసలు డైరెక్టుగా ప్రజలకి దానధర్మాలు చేస్తే సోమరులైపోతారు. కాబట్టి, జాతి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అంబానీ ఇలా ఇండైరెక్టుగా దేశానికి మేలు చేస్తున్నారని కూడా కొందరు వాట్సాప్ యూనివర్శిటీ పట్టాదారులు వాదించారు. కానీ నిజంగానే 1200 కోట్ల రూపాయలను అంబానీ ఖర్చు చేశాడా?

2021 ఫిబ్రవరిలో రైతులు మొదటిసారిగా మూడు నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన చేసినపుడు, మొన్న అనంత్ అంబానీ ముందస్తు పెళ్లి వేడుకలో పెర్ఫార్మెన్స్ ఇచ్చిన రిహాన్నాయే "Why aren't we talking about this" అని రైతుల ఆందోళన గురించి ట్వీట్ వేసింది. ఆమె 72 కోట్ల కోసం భారత్ వచ్చి డాన్స్ చేసింది. ఇది జరిగిన కొద్ది రోజుల తర్వాత, రిహాన్నాకు చెందిన "ఫెంటీ" అనే బ్యూటీ ప్రొడక్ట్స్ బ్రాండ్, నైకా మరియు సెఫోర అనే కంపెనీల కలాబోరేషన్‌లో ఇండియాలో లాంచ్ అయింది. ఇందులో సెఫోర అనేది రిలయన్స్‌కి సంబంధించిన సౌందర్య ఉత్పత్తుల సంస్థ. ఒకపక్క మాకు ఎంత డబ్బు ఉన్నా, మా జీవితాలేవీ పూలపాన్పులు కాదని మొసలి కన్నీరు కారుస్తూనే, మరోపక్క ఖర్చు చేసిన ప్రతి రూపాయికి పదిరెట్లు ఎక్కువ వచ్చే వ్యాపారాలు జరుపుతున్నారన్నమాట!


సందట్లో సడేమియా అన్నట్టు, ఒకపక్క అంబానీ కుటుంబం గురించిన చర్చలు, వాళ్ళు వేసుకున్న నగలు, బట్టల వివరాలు సోషల్ మీడియా అంతటా చక్కర్లు కొడుతూనే ఉండగా, గతంలో "యువత వారానికి 70 గంటలపాటు పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి" అని చెప్పిన ఇన్ఫోసిస్ ఫౌండర్ నారాయణ మూర్తి, దాదాపు 240 కోట్ల రూపాయల ఆస్తిని అప్పుడే జన్మించిన మనవడికి రాసి ఇవ్వడం జరిగింది. పది, పదిహేను వేల జీతానికి పదిరెట్లు ఎక్కువ చాకిరీ చేయించుకొని దోచుకున్న డబ్బంతా మా సౌకర్యవంతమైన జీవితాల కోసమే అని ఈ సంఘటనలు చెప్తున్నాయి. ప్రజలు తమపై జరుగుతున్న దోపిడీ ప్రతిఫలాలే అంబానీల, అదానీల హంగు ఆర్భాటాలని గుర్తించలేని స్థితిలోకి, సామాన్యుల బతుకులోని దారిద్ర్యాన్ని వాళ్ళకే టీవీ సీరియళ్ళలా చూపించి, అవసరంలేని విషయాలపై అనవసరమైన వాదోపవాదాలు చేస్తూ ఐక్యం కాలేని స్థితిలోకి నెట్టేస్తున్నారు. తత్ఫలితంగా గొర్రె కసాయి వాడ్ని నమ్మినట్లు, ఈ దళారీ బూర్జువావర్గాన్ని గుడ్డిగా వెనకేసుకొస్తున్నారు.

పేదరికంలో, ఆకలి మరణాల్లో, ఆరోగ్యంలో, కనీసంగా బతకడానికి అవసరం ఉన్న ప్రతి విషయంలోనూ అట్టడుగు స్థానంలో ఉన్నా, సిగ్గు లేకుండా విశ్వగురు అఖండ భారత్ అని చంకలు గుద్దుకుంటున్న నాయకులు మనవాళ్ళు. మొన్నటికి మొన్న జి20 సమావేశాలు జరిగినపుడు, నీతా అంబానీ మెడలో 500 కోట్ల రూపాయల వజ్రమంత అందంగా లేదని, దేశపు పేదరికాన్ని, తెరలు కట్టి దాచేసారు. ఇంక ఎలెక్టోరల్ బాండ్లలో జరిగిన అవినీతి మొత్తం బయటపడిపోయినా, దాని గురించి ఒక్క నేతా మాట్లాడింది గానీ, ఖండించింది గానీ ఏమీ లేదు. ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా, కులమతాల కొట్లాటలకి బలయ్యే గొర్రెలుగా చూస్తూ, 5 ఏళ్ళకి ఒకసారి నాలుగు ఎంగిలి మెతుకులు పారేస్తే చాలన్న విధంగా ఉంది పాలకుల తీరు. అందుకే, ఒకపక్క శ్రమను దోచుకుంటూ మరోపక్క మతమౌఢ్యంతో ప్రజల్ని అలౌకిక జీవితంలోకి నెట్టి మెదడులేని యంత్రాల్లా తయారుచేస్తున్న వాళ్ళెవరూ మనకి మిత్రులు కాదని అందరూ గుర్తించాలి. మేకతోలు కప్పుకు తిరుగుతున్న మోడీలూ, అంబానీ, అదాని, టాటా బిర్లాలూ, సద్గురు జగ్గి బాబాలూ అందరిదీ ఒకటే కసాయి జాతి అని ప్రజలు గుర్తించాలి. బలవంతమైన సర్పము, చలిచీమల చేతజిక్కి చావదే సుమతీ అని బద్దెన అన్నట్టుగా, ఈ బలవంతమైన సర్పాలను చావగొట్టడానికి, మనమంతా ఐక్యం కావాలిక. ✷

# ఎన్నికల ప్రజాస్వామ్యం

- హరిబాబు

**సిటిజన్స్** కమీషన్ ఆన్ ఎలక్షన్స్ అనే సంస్థ కోఆర్డినేటరూ, ఫోరమ్ ఫర్ ఎలక్టోరల్ ఇంటెగ్రిటీ సంస్థ కన్వీనరూ, కాన్సిట్యూషనల్ కాండక్ట గ్రూపు సభ్యుడూ, పీపుల్ ఫస్ట్ సంస్థ ఛైర్మన్ అయిన, మాజీ ఐ.ఎ.ఎస్. అధికారి సంపాదకత్వంలో, భారతదేశ ఎన్నికల ప్రక్రియ నిర్వహణతో సంబంధమున్న 17 మంది అధికారులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు వ్రాసిన వ్యాసాలను, "ఎన్నికల ప్రజాస్వామ్యం – భారతదేశంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా, చిత్తశుద్ధితో నిర్వహింపబడటంపై ఒక విశ్లేషణ" అన్న శీర్షికతో పరన్ జయ్ గుహ తకుర్తా ఒక పుస్తకాన్ని ప్రచురించారు. ఎం.జి. దేవసహాయం సంపాదకత్వం వహించారు. ఈ పుస్తకానికి ముందుమాట జస్టిస్ మదన్.బి.లోకుర్ రాశారు.




జి–20 సదస్సులో మాట్లాడుతూ ప్రధాని మోడీ "భారతదేశం ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు అనీ, భారతదేశంలో ఎన్నికలు క్రమం తప్పకుండా నిర్వహించబడుతున్నాయని, భవిష్యత్తులో కూడా అదేవిధంగా భారతదేశంలో (అతిపెద్ద ప్రజాస్వామ్యమైన) నిర్వహింపబడతాయనీ" ఘనంగా ప్రకటించారు. పలు సందర్భాలలో యిదే విషయాన్ని ఆయనే అంతర్జాతీయ వేదికలపై పదే, పదే ప్రకటిస్తున్నాడు.

గోపాలక్రిష్ణ గాంధీలాంటి ప్రముఖులు సహితం, "ప్రపంచమంతటా అనేక గొప్ప విషయాలపై భారతదేశాన్ని విలువైనదిగా పరిగణిస్తారనీ, వాటన్నింటికీ మించి మూడు విషయాలు : తాజ్‌మహల్, మహాత్మాగాంధీ, భారతదేశపు ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని గురించి భారతదేశానికి విలువనిస్తారు" అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అంటే భారతదేశపు ఎన్నికల ప్రాశస్త్యాన్నే, ప్రజాస్వామ్యానికి ప్రతీకగా భావిస్తున్నారు, ప్రచారం చేస్తున్నారు. దేశంలోని విద్యావంతులతో సహా, ప్రజలందరూ, యీ ఎన్నికలు జరపగటమే ప్రజాస్వామ్యంగా నమ్ముతున్నారు. సిటిజన్స్ కమీషన్ ఆన్ ఎలక్షన్స్ సంస్థ కూడా అదే అభిప్రాయంతో వుంది. అయితే ఎన్నికలను నిష్పాక్షికంగానూ, చిత్తశుద్ధితోనూ రాజ్యాంగము చెప్పినట్లుగా నిర్వహించాలనీ, యీ ఎన్నికల నిర్వహణ అనేది పారదర్శకంగానూ, జవాబుదారీతనంతోనూ కూడినదై వుండాలన్నది ఆ సంస్థ యొక్క నిశ్చితాభిప్రాయం. ఆ ప్రకారం ఎన్నికలు నిర్వహింపబడితే (రాజ్యాంగం చెప్పినట్లు, ఎన్నికల కమీషన్ యొక్క ప్రవర్తనా నియమావళిని తూ.చ. తప్పకుండా అమలు జరిపితే) దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని ఆ సంస్థ అభిప్రాయపడుతోంది. తదనుగుణమైన అభిప్రాయాలతో జరిపిన పరిశీలన ఆధారంగా, ఈ పుస్తకంలోని వ్యాసాలు ప్రతిబింబిస్తున్నాయి.

అయితే యీ వ్యాసకర్తలు అభిప్రాయపడుతున్నట్లు ఎన్నికలు సక్రమంగా, నిష్పక్షపాతంగా నిర్వహింపబడక పోవటం, ఎన్నికల్లో ధనబల ప్రభావం ఎక్కువగా వుండటం, ఎన్నికల్లో అక్రమాలు సాగటం, బలహీన ప్రజాసమూహాలను ఎన్నికల్లో పాల్గొనకుండా నివారించటం, ఓట్ల జాబితాలు తారుమారు చేయటం, ఓటరు బూత్‌లను ఆక్రమించుకోవటం, ఓట్లు లెక్కింపులలో అవకతవకలు జరపటం, ఓటర్లను వివిధ రూపాలలో ప్రలోభపరచటం, తమ వ్యతిరేక ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి, దౌర్జన్యం జరిపి ఓట్లు వేయకుండా ఆపటం, యీ ఏడు దశాబ్దాల కాలంగా ఏదో రూపంలో జరుగుతూనే వున్నాయి. ప్రస్తుత అధికార పాలకపార్టీ నిర్వీతితో, జంకూ – గొంకూ లేకుండా, యీ రకంగా ఎన్నికలను అక్రమంగా, పక్షపాతపూర్వకంగానే బాహాటంగా జరిపే స్థాయికి జేరుకొంది.

నిజానికి అంగబలం, ధనబలం లేకుండా ఎన్నికలలో పోటీచేసి, గెలవటమన్నది నాటినుండి నేటిదాకా ఎన్నడూ అసాధ్యంగానే వుంది. అందువలన చిత్తశుద్ధితో పోటీ చేసేందుకుగానీ, పోటీ చేసి నెగ్గేందుకు గానీ యీ ఎన్నికలలో అవకాశమే లేకుండా పోయింది. పొరపాటున అలా చిత్తశుద్ధి కలిగిన ఒకరిద్దరు అభ్యర్థులు గానీ, పార్టీకి చెందినవారు గానీ గెలిచినా, మొత్తం ప్రతినిధుల (ఎన్నికైన)లోని మెజార్టీ సభ్యుల నిర్ణయాలకూ, విధానాలకూ లోబడి వుండవల్సిందే! అందువలన నిజమైన అర్థంలో యీ "ఎన్నికల ప్రజాస్వామ్యం" ద్వారా నిజమైన ప్రజాప్రతినిధులు అన్నవారు ఎన్నుకోబడటమే అబద్ధమైన విషయం. ఇక ప్రజల ప్రతినిధులు, ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పాలనా విధానాలను, శాసనాలను చేబట్టడం అన్నది నేతిబీరకాయలోని నెయ్యి మాదిరిగానే మిగిలిపోయింది.

ప్రజాస్వామ్యాల పరిరక్షకుడిగా చాటుకొనే అమెరికా దేశంలోని ఎన్నికలు సహితం యిదేవిధంగా సక్రమంగా, నిష్పక్షపాతంగా నిర్వహింప బడకపోవటం, ఎన్నికలను ధనబలం శాసించటం, పలు అక్రమాలు సాగుతూండటం అన్న విషయాలను మనం చూస్తున్నవే! అందువలన యీ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి సంకేతంగా, ప్రజాస్వామ్యాన్ని నిర్ధారించే అంశాలుగా పరిగణించటంలోనే అసలు పొరపాటు వుంది.

ఈ ఎన్నికలు యిలా అక్రమంగా నిర్వహింపబడటానికి, పక్షపాతంతో నిర్వహింపబడటానికి మూలకారణం మనదేశం యొక్క రాజకీయ, ఆర్థికవ్యవస్థ యొక్క స్వభావంలోనే వుంది. ధనాఢ్య పెట్టుబడిదారీ, భూస్వామ్యవర్గాల పాలనలో, పెత్తనం క్రింద సాగే వ్యవస్థ వర్గస్వభావంలో వుంది. పాలకవర్గాలుగా వున్న పెట్టుబడిదారీ భూస్వామ్యవర్గాల ప్రతినిధుల పాలనలో వున్న యీ వ్యవస్థలో ఎన్నికలలో ఓట్ల ద్వారా ఎంపిక కాబడుతున్న అభ్యర్థులను ప్రజాప్రతినిధులుగా భ్రమపడటంలోనే వుంది.

నిజానికి ఎన్నికలు యీ రకంగా నిష్పక్షపాతంగా నిర్వహింప బడకపోవటానికి మూలం రాజ్యాంగంలోనే వుంది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల మాదిరిగానే, ఏ అధికరణలో పేర్కొన్న అంశాన్నీ పాటించనవసరంలేని ఏర్పాటు రాజ్యాంగంలోనే పొందుపరచబడింది. అంతర్గత, బహిర్గత అత్యావసర పరిస్థితిని విధించే అవకాశం, ప్రజా పౌర హక్కులను రద్దుచేసే అవకాశం, దేశరక్షణ, దేశ సమగ్రతల రక్షణ పేరిట ప్రజలకు యివ్వబడ్డాయన్న సర్వస్వేచ్ఛలనూ హరించే అవకాశం యీ రాజ్యాంగంలోనే కల్పించబడింది. అందువల్లనే ధనాఢ్య పాలకవర్గాల ప్రతినిధులైన పాలకపార్టీల ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని తమ ప్రయోజనాలకు అనుగుణంగా యిష్టారాజ్యంగా సవరించగలుగు తున్నారు. న్యాయవ్యవస్థ ఆయా సందర్భాన్ని బట్టి పాలకపార్టీ (అధికారంలోని) అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగానికి భాష్యం చెప్పి ఆయా ప్రభుత్వాలకు తోడ్పడకల్గుతోంది. నిజానికి యిది ప్రజల చేత, ప్రజల ఆకాంక్షలకు – అవసరాలకూ అనుగుణంగా రూపొందించబడ్డ రాజ్యాంగం కాదు. అది ప్రజల కోసం అమలుజరపటానికి రూపొందించిన రాజ్యాంగం కాదనీ, కేవలం భ్రమల్లో ముంచి, తమ వర్గపాలనను సాగించటానికే రూపొందించిన రాజ్యాంగం అనీ యీ ఏడు దశాబ్దాల అనుభవం చాటిచెప్తోంది!

కేవలం ఎన్నికల నిర్వహణను, ప్రక్రియను సంస్కరించటం ద్వారా దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందనే 'భావన' నిజమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుతుందని భావించలేము. మౌలికంగా మన వ్యవస్థ స్వభావం, సక్రమ ఎన్నికల ద్వారా వ్యవస్థను నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థగా మార్చుతుందని భావించటం ఊహాజనితమే అవుతుంది.

అందువలన యీ వ్యాసకర్తలు కానీ, మేధావులు కానీ, నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థను కోరుకొనే ప్రజలు కానీ, మన వ్యవస్థ యొక్క మన రాజ్యాంగం యొక్క మౌలిక స్వభావ, స్వరూపాలను అధ్యయనం చేసి, నిర్ధారణలకు చేరుకోవాల్సిన అవసరం మనముందుకొచ్చింది. రాజ్యాంగం యొక్క పవిత్రత పేరిట ప్రజల్లో భ్రమలను పెంచి, తమ అవసరాలు – ప్రయోజనాల కోసం విచక్షణారహితంగా రాజ్యాంగాన్ని సవరణలకు గురిచేస్తున్న పాలకవర్గాల ప్రతినిధులైన పాలకవర్గ పార్టీల ప్రభుత్వాల యొక్క ప్రజాప్రాతినిధ్య బూటకాన్ని అర్థం చేసుకోవాలి!

బహుళ పార్టీ ఎన్నికలపేరిట, ఏదో ఒక పాలకవర్గ పార్టీ కూటమినే ఎంచుకోవటం తప్ప, ఓటర్లకు మరో గత్యంతరం లేని యీ ఎన్నికల ప్రజాస్వామ్యం రాజకీయ క్రీడ యొక్క మోసపూరిత స్వభావాన్ని అర్థం చేసుకోవాలి! కేవలం ఓటు వెయ్యటమే ప్రజాస్వామ్యంగా జరిగే ప్రచారంలోని వంచనను అర్థం చేసుకోవాలి!

ఈ పార్శ్వాలన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసి, పరిశీలించి, ఎన్నికల ద్వారా సాగుతున్న ప్రజాస్వామ్యం, మేడిపండు ప్రజాస్వామ్యం అన్న వాస్తవాన్ని అందుకవసరమైన విరుగుడు పరిష్కారమార్గాన్నీ ప్రజల ముందుకు తీసుకురాగల్గినప్పుడే, 'ఎన్నికల ప్రజాస్వామ్యం' లాంటి అధ్యయన, నిర్ధారణలకు ఎంతోకొంత ప్రయోజనం వుంటుంది. అంతవరకూ 'ఎన్నికల అరిస్టోక్రసీ' పలు రూపాల్లో కొనసాగుతూనే వుంటుంది!

**Electoral Democracy?**

*Published by* **Pranjoy Guha Thakurta**

*Edited by* **M.G. Devasahayam**

*First Edition :* **2022**

✺

# కృతజ్ఞతలు



**జనసాహితి రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.డి. సోషలిజం, శివపార్వతి దంపతుల కుమార్తె అరుణాంజలి, హేమంత్‌ల వివాహం (27-3-2024) సందర్భంగా ఏప్రియల్ 'ప్రజాసాహితి' ప్రచురణకై ఆర్థిక సహాయం అందించారు.**

**వారికి మా కృతజ్ఞతలు**

# కృతజ్ఞతలు



**'ప్రజాసాహితి'కి సన్నిహితుడు దండా వెంకట రామిరెడ్డి, అరుణ దంపతుల కుమారుడు ఉదయ్‌కిరణ్, చంద్రికల వివాహం (3-4-2024) సందర్భంగా ఏప్రియల్ 'ప్రజాసాహితి' ప్రచురణకై ఆర్థిక సహాయం అందించారు.**

**వారికి మా కృతజ్ఞతలు**

# చైతన్యవాహిని

**గుంటూరు, 7-3-24 :**

గుంటూరులోని కొరిటిపాడు ఓరియంటల్ హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళాదినోత్సవం సభను ఏపిటిఎఫ్ జిల్లాశాఖ నిర్వహించింది. ఈ సభకు ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి. పార్వతి అధ్యక్షత వహించారు.

ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జనసాహితి ప్రధాన కార్యదర్శి డా॥ బి. అరుణ మాట్లాడుతూ అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంను క్లారాజెట్కిన్ ప్రకటించారనీ, నేడు అది మహిళాదినోత్సవంగా రూపాంతరం చెంది ఒక వేడుకలా నిర్వహించుకుంటున్నామనీ మహిళా పోరాటదినం రూపొందటానికి జరిగిన కృషిని వివరించారు. ప్రస్తుత ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులు మహిళలను ఎంతగా పీడన, దోపిడీలకు గురిచేస్తున్నాయో సోదాహరణంగా వివరించారు. విద్య, వైద్యం ప్రైవేటీకరణ, నిత్యావసర వస్తువుల పెరుగుదల, వెర్రితలలు వేస్తూన్న సాంస్కృతిక భావజాలపు చట్రం, పైపై మెరుగులతో అభివృద్ధిగా చూపిస్తూ దోపిడీ పీడనలకు ఎలా గురిచేస్తున్నదీ వివరించారు. మన జీవితాలపై సామ్రాజ్యవాద సంస్కృతి పట్టు ఎలా సాధించుకుంటుందీ చెప్తూ – ప్రజలందరితో పాటు మహిళలు మరింత జాగరూకతతో, ఎరుకతో ఉండాలని సంఘటితపడాలని చెప్పారు. స్త్రీలపై నానాటికీ పెరుగుతున్న లైంగిక దాడులకు, హింసలకు గల మూలాలను వివరించారు. స్త్రీలూ, పురుషులు, మనుషులందరూ సమానంగా చూసే రాజ్యస్థాపననీ, సొంత ఆస్తులులేని ప్రపంచాన్ని మహిళాదినం లక్ష్యాలుగా ఆరోజు ప్రకటించుకున్నామనీ – అవి ఇంకా నెరవేర్చుకోవాల్సిన లక్ష్యాలుగానే మిగిలి ఉన్నాయని, ఆ లక్ష్య సాధనలో పయనించటమే మహిళాదినం స్ఫూర్తిని స్వీకరించటం అని తెలియచేశారు. మరొక ముఖ్య అతిథి ఏపిటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు వి. రాధిక మాట్లాడుతూ నేటికీ మహిళలపై కొనసాగుతున్న ఇంటా, బయటా మహిళలు ఎదుర్కొంటున్న వివక్షలను వివరించారు. సామూహిక వంటగదుల అవసరాన్ని గుర్తుచేశారు. శ్రమ నుండి విముక్తి పొందటమే స్త్రీ పురుషుల సమానత్వానికి మార్గమని అన్నారు. ఇంకా ఈ సభలో ఏపిటిఎఫ్ పూర్వ ఉపాధ్యక్షులు బి. మల్లీశ్వరి, జిల్లా మహిళా కార్యవర్గ కన్వీనర్ డి. నాగభారతి, జిల్లా గౌరవ అధ్యక్షులు టి. రామలీల, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు బి. సాయిలక్ష్మి మొదలగువారు ప్రసంగించారు.

**హైదరాబాద్ :** అంతర్జాతీయ మహిళా పోరాట దినం మార్చి 8 సందర్భంగా "మహిళల హక్కులను కాలరాస్తూ దాడులను, హింసను ప్రేరేపిస్తున్న మతతత్త్వ రాజకీయాలకు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం" అని పిలుపునిస్తూ స్త్రీ విముక్తి సంఘటన, జనసాహితి సంస్థల ఆధ్వర్యంలో మార్చి 10, 2024 తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రం సెల్లార్ హాల్‌లో సభ జరిగింది.

సభకు అధ్యక్షత వహించిన స్త్రీ విముక్తి సంఘటన జంట నగరాల శాఖ కన్వీనర్ కరుణశ్రీ, అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాటదినం మార్చి 8 ప్రాధాన్యతను చెప్పారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ప్రొఫెసర్ తోట జ్యోతీరాణి మాట్లాడుతూ 1910లో క్లారా జెట్కిన్ ప్రకటించిన అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంలోని శ్రామిక, పోరాటం అన్న రెండు అంశాలు 1975లో ఐక్యరాజ్యసమితి ప్రకటించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో అదృశ్యమైనాయన్నారు. నిజానికి సంవత్సర కాలం పాటు స్త్రీ విముక్తి కోసం అమలైన కార్యక్రమాల ఫలితాలను సమీక్షించుకుని, లక్ష్యసాధనను త్వరితం చేయడానికి, కొత్త వ్యూహాలను రూపొందించుకోవడానికి ఈ దినం ఏర్పడిందన్నారు. గ్లోబలైజేషన్ స్థిరపడి, బలపడిన నేపథ్యంలో మహిళా సాధికారత, స్త్రీ విముక్తి దిశగా తీసుకున్న చర్యలే లేవన్నారు. స్త్రీ విముక్తి లక్ష్యాన్ని విస్మరించిన పాలకుల స్వభావాన్ని వివరించారు. 2014 నుండి బలంగా అమలవుతున్న నయా ఉదారవాద విధానాల వల్ల ఆర్థిక అసమానతలు శిఖర స్థాయికి చేరుకున్నాయన్నారు. సకల మానవసంబంధాలలో ఆధిపత్య, అధీనత్వ సంబంధాలు బలపడ్డాయనీ, అందులో భాగంగా జెండర్ వివక్ష తీవ్రమైందన్నారు. సంపాదన పనులు దొరకకపోవడం, పేదరికం పెరుగుదల, పన్నుల భారం, విద్య, వైద్యం, వివిధ రంగాల ప్రైవేటీకరణ – వీటన్నింటి అంతిమ భారం శ్రామిక, మధ్యతరగతి మహిళల మీదనే ఎక్కువగా ఉందన్నారు. సామాన్య మహిళల మీద దోపిడీ, పీడన తీవ్రమవుతూనే ఉన్నాయన్నారు. ఫ్యూడల్ సంస్కృతి, సామ్రాజ్యవాద దోపిడీ సంస్కృతిలో మిలాఖత్ అయిందనీ; టీవీ, సినిమా, ఇంటర్నెట్‌లు ఈ సంస్కృతిని బలోపేతం చేస్తూ స్త్రీలపై హింసను పెంచుతున్నాయన్నారు. స్త్రీ విముక్తి వాస్తవం కావాలంటే స్త్రీలపై దోపిడీ, హింసను తీవ్రతరం చేస్తున్న దోపిడీ వ్యవస్థ అంతం కావాలన్నారు. స్త్రీ పురుషుల మధ్య ప్రజాస్వామిక సంబంధాలను నెలకొల్పుకోవడం కోసం పోరాటాలు జరగాలన్నారు. ఈ దిశగా మన అవగాహనను, చైతన్యాన్ని పెంచుకోవాలని, ఈ లక్ష్యం కోసం సంఘటితంగా పోరాడాలన్నారు.

జనసాహితి జంట నగరాల శాఖ కార్యదర్శి డాక్టర్ భట్టు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ – మహిళలపై వివిధ రూపాల్లో అమలవుతున్న వివక్ష, దోపిడీ రూపాలను ప్రశ్నిస్తూ, స్త్రీ విముక్తి పట్ల ఒక స్పష్టమైన దృక్పథాన్ని అందించే సాహిత్యం విరివిగా రావాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటి సాహిత్యాన్ని 'ప్రజాసాహితి' పత్రిక నిరంతరాయంగా తీసుకొస్తున్నదనీ, ఆ దిశగా కృషి చేస్తూందన్నారు.

స్త్రీ విముక్తి సంఘటన ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి ప్రసంగిస్తూ – మహిళలపై వివిధరూపాల్లో సాగిన సామాజిక దౌష్ట్యాలకు, అణచివేతలకు, దోపిడీలకు వ్యతిరేకంగా సంఘసంస్కరణ ఉద్యమం, కమ్యూనిస్టు ఉద్యమం, మహిళా సంఘాలు సాగించిన కృషిని, పోరాట అనుభవాలను నేటితరం స్ఫూర్తిగా స్వీకరించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల ఉపాధి, సాధికారత, స్వావలంబన పేరిట మహిళల శ్రమను కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న పాలకుల దోపిడీ స్వభావాన్ని ఎండగట్టారు. సామ్రాజ్యవాద అనుకూల పాలకుల విధానాలు మహిళల జీవితాలను రోజురోజుకీ సంక్షోభంలోకి నెడుతున్నాయని, సామ్రాజ్యవాద ప్రేరేపిత యుద్ధాలు మహిళల, పిల్లల జీవితాలను విధ్వంసం చేస్తున్నాయన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దారుణ మారణకాండను వివరించారు. నిరంతరాయంగా మహిళలు, ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను పరిష్కరించకుండా ప్రజల మధ్య విద్వేషాలను హింసను పెంచుతున్న మతతత్త్వ రాజకీయాలను తిప్పి కొట్టాలన్నారు. మార్చి 8 పోరాట స్ఫూర్తిని స్వీకరించి మహిళలపై అమలవుతున్న అన్ని రకాల దోపిడీ, అణచివేతలకు, విష సంస్కృతులకు వ్యతిరేకంగా సంఘటిత పోరాటాలు సాగించాలన్నారు.

ఈ సభ ప్రారంభంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం మార్చి 8 స్ఫూర్తిని, ప్రాముఖ్యతను వివరించే "Bread and Liberty" (తిండి – స్వేచ్ఛ) షార్ట్ ఫిల్మ్‌ను ప్రదర్శించారు. ✷




**'కామోత్సవ' దహనం :** ఎడిటర్ : **ఈదర గోపీచంద్.** సహకారం : **కొత్తపల్లి రవిబాబు – పెనుగొండ లక్ష్మీనారాయణ**

శేషేంద్రశర్మ 1987లో 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలో రాసిన సీరియల్ నవల 'కామోత్సవ్'పై రాష్ట్రస్థాయిలో ఏడు సంవత్సరాలపాటు (1987–1994) సాగిన సుదీర్ఘ న్యాయ, ప్రజా, సాహిత్య పోరాటాల సచిత్ర చరిత్ర.

'కామోత్సవ్' నవల పరమ అశ్లీలమైన రచన అనీ, దీనిని రాసిన గుంటూరు శేషేంద్ర శర్మనూ, ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి' వారపత్రిక వారినీ శిక్షించాలని ఈదర గోపీచంద్ నరసరావుపేట కోర్టులో అశ్లీలతా ప్రతిఘటన వేదిక తరఫున కేసు వేయగా, ఆయనపైనా, 'కామోత్సవ్' నవల ఏవిధంగా అశ్లీలమైనదో, వివరిస్తూ సుదీర్ఘమైన వ్యాసం రాసిన సాహితీ విమర్శకుడు కొత్తపల్లి రవిబాబుపైనా, నరసరావుపేటలోనూ, విజయవాడలోనూ శేషేంద్ర, ఆంధ్రజ్యోతివారూ పరువునష్టం కేసులు పెట్టగా, ఆ కేసులు ఎలా వీగిపోయాయో తెలియచేసే విశేషాలన్నీ ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఆనాడు 'కామోత్సవ్'పై వచ్చిన విమర్శనా వ్యాసాలు, ఉత్తరాలు మొదలగునవి పునః ప్రచురించారు.

ఇటీవల శేషేంద్ర కుమారుడు తన తండ్రి రాసిన 'కామోత్సవ్' నవలను అచ్చువేసిన సందర్భంగా పాఠకులకు ఈ నవల స్వభావాన్ని అర్థమయ్యేట్లు చేస్తుందీ పుస్తకం.

(18+212 పుటలు – వెల : రూ.150/– 1/8 డెమ్మీ – ప్రథమ ముద్రణ : 2024. ప్రతులకు : ఈదర గోపీచంద్ గాంధీవనం, లింగంగుట్ల, ఎన్.ఎస్.పి. కాలనీ రోడ్డు, నరసరావుపేట, పలనాడు జిల్లా – 522601. ఫోన్ : 94403 45494.

**చితాగ్ని :** విప్లవ రచనల సంపుటి. రచన : **క్రాంతికిరణ్ (బొర్రా గోవర్ధన్).**

బొర్రా గోవర్ధన్ రాసిన 14 కథలు, గల్పికలు, నాలుగు వ్యాసాలు, పాములపాడు ప్రజాకళారూపం, నివాళి వ్యాసాలు రెండు, శ్రీశ్రీపై నాలుగు వ్యాసాలు, ఆరు నవలల పరిచయాలతో కూడిన రచనల సంపుటి ఇది.

1/8 డెమ్మీ – 244 పుటలు. వెల : రూ.200/– ప్రథమముద్రణ : 2024. ప్రతులకు : గోలి సీతారామయ్య, బుద్ధభూమి. 11/285సి, భద్రావతి నగర్, పాత మంగళగిరి, గుంటూరుజిల్లా – 522503. ఫోన్ : 99491 45650.

**చల్లారినలావా : పాటలూ – గేయాలు – కవిత్వం.**

రచన : **క్రాంతికిరణ్ (బొర్రా గోవర్ధన్)**

దీనిలో 1978–80 మధ్య రాసిన 21 జనం పాటలు, ఆ తర్వాత రాసిన కవితలూ, భావగీతాలు, బాలల గీతాలు, నివాళి గీతాలు మొదలైనవి 110 రచనలున్నాయి. దీనికి ముందుమాట గోవర్ధన్ సహచరుడు, సినీ గేయ రచయిత వెనిగళ్ళ రాంబాబు రాశారు.

1/8 డెమ్మీ 220 పుటలు. వెల : రూ.220/– ప్రథమముద్రణ : 2024. ప్రతులకు : పై పుస్తకంలాగానే.

**మట్టి మొగ్గలు : (మనిషి కథలు)** రచయిత : **సద్దపల్లె చిదంబరరెడ్డి.**

ఉపాధ్యాయునిగా రిటైరైన చిదంబరరెడ్డి రాయలసీమ మాండలీకంతో, రాయలసీమ జీవనచిత్రాన్ని 76 కథల ద్వారా అందించారు.

1/8 డెమ్మీలో 18+442 పుటలు. వెల : రూ.450/– ప్రథమ ముద్రణ : 2021. ప్రతులకు : సి. కళానిధి, 21–6–139, టీచర్స్‌కాలనీ, హిందూపూర్–515211. అనంతపురం జిల్లా. ఫోన్ : 94400 73636.

**కళాప్రపంచం :** లలితకళలపైనా, రచయితలపైనా, సంగీతకారుల పైనా 53 వ్యాసాల సంపుటి. రచన : ఎల్.ఆర్. వెంకటరమణ.

చిత్రకారుడు కళాసాగర్ 12 ఏళ్ళుగా అవిరామంగా నిర్వహిస్తున్న 64 కళలు డాట్‌కామ్‌లో 2010 నుండి 2016 వరకు రచయిత, చిత్రకారుడు ఎల్.ఆర్. వెంకటరమణ రాసిన వ్యాసాల సంపుటి ఇది. కేవలం లలితకళల గురించి కేంద్రీకరించి ప్రచురింప బడుతున్న ఏకైక పత్రిక 64 కళలు డాట్‌కామ్. ఇది ఎలక్ట్రానిక్ పత్రిక. గతంలో నాటకరంగంపైనా, సంగీతం, చిత్రలేఖనంపై కొన్ని అచ్చుపత్రికలు వెలువడ్డాయి. కాని ఇప్పుడు 'మిసిమి' తప్ప ఏదీ చిత్రకళా ప్రపంచం గురించి పట్టించుకోవడంలేదు.

ఈ పుస్తకం లలితకళాప్రియులందరికీ ఒక బహుమతి అంటూ ఈ పుస్తకాల ఆవశ్యకతను వాడ్రేవు చినవీరభద్రుడు, ఈమని శివనాగిరెడ్డి వివరించారు. ఈ 56 వ్యాసాలూ చిత్రకళ, శిల్పకళ, సాహిత్యం, నృత్యం, సినిమా మొదలైన అంశాలపై రేఖామాత్ర పరిచయాలు. ఈ రచయిత గతంలో 'సౌందర్యసృజన', 'కళాసౌందర్యం', 'వర్ణపదచిత్రణ', 'కవిత్వోదయం', 'చదువుల చెలమ', 'విన్ చెప్పిన విజయగాథలు', 'పసిమొగ్గల పరిమళం' అనే గ్రంథాలు రచించారు.

ఈ 'కళాప్రపంచం'లో శంకర్స్ వీక్లీ పత్రిక నడిపిన కేశవశంకర పిళ్ళై (శంకర్), శ్రీలంకలో జన్మించి బ్రిటన్‌లో స్థిరపడిన ఆనంద (కెంటిష్) కుమారస్వామి, పద్మభూషణ్, పద్మవిభూషణ్ అందుకున్న ఎమ్.ఎఫ్. హుస్సేన్, డా॥ సంజీవదేవ్, చలసాని ప్రసాదరావు, శివరాజు సుబ్బలక్ష్మి, చిత్రకళావధానం చేసే సింగంపల్లి సత్యనారాయణరావు, మోనాలిసా, మైకెలాంజిలో, రాఫేల్ మెక్సికన్ చిత్రకారిణి ఫ్రిదా కాహ్లో, అవనీంద్రుడు, ఠాగూరు, చిత్తప్రసాద్ ఎ.యస్.రామన్, సత్యజిత్‌రే, హిట్లర్, ఆఫ్రికన్ చిత్రకారుడు ఆఫ్రిక్‌టిల్లే మొదలగువారి చిత్రకళను పరిచయం చేశారు.

సాహిత్యరంగంలో బెర్నార్డ్‌షా, టాల్‌స్టాయ్, గురజాడ, తిలక్, బుచ్చిబాబు, బాపిరాజు, పద్మరాజు, మాలతీచందూర్, కరుణశ్రీ విశ్వనాధ, సినారె, భరద్వాజల కృషిని వివరించారు. సంగీత ప్రపంచంలో బిథోవిన్, మైకేల్ జాక్సన్‌లను పరిచయం చేశారు.

ప్రతి పుటలోనూ రచయితల ఫోటోలో, చిత్రాలో సేకరించి అలంకరించిన ఈ 1/4 పరిమాణంలో 200 పుటల గ్రంథం వెల : రూ. 250/– ప్రతులకు : కళాసాగర్, విజయవాడ. ఫోన్ : 98852 89995. ✺

## పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా, అమెరికా ఇజ్రేల్‌కు మద్దతుపలకడాన్ని తప్పపడుతూ తన ప్రతిష్టాత్మకమైన డిగ్రీలను తిరిగి ఇచ్చేసిన విద్యావేత్త, సామాజిక కార్యకర్త సందీప్ పాండే

**ఆసియా** నోబుల్ బహుమతిగా పేర్కొనే రామన్ మెగసెసే అవార్డు విజేత అయిన సామాజిక కార్యకర్త సందీప్ పాండే యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా నుండి తాను పొందిన పిహెచ్‌డి డిగ్రీని, అలాగే అమెరికాకే చెందిన సిరాక్యుజ్ యూనివర్శిటీ నుండి పొందిన డ్యుయల్ ఎం.ఎస్‌సి. డిగ్రీలనూ అధికారికంగా తిరిగి యిచ్చేశారు. ఆయన జనవరి 2024లో కూడా తాను పొందిన అత్యంత ప్రతిష్టాత్మకమైన రామన్ మెగసెసే అవార్డునూ తిరిగిచ్చేశారు. ఇందుకు ఫిలిప్పీన్స్ ప్రజలకు క్షమాపణ చెబుతూ మెగసెసే అవార్డు వెనుక రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ (అమెరికా) నిధులు ఉండడం వల్లనే తానీ నిర్ణయం తీసుకున్నాను తప్ప, తాను ఫిలిప్పీన్, అమెరికా దేశాల ప్రజలకు వ్యతిరేకం కాదని ప్రకటించారు. తాజాగా అమెరికాలో తాను పొందిన డిగ్రీలను కూడా తిరిగి ఇచ్చివేస్తూ ఆయన పాలస్తీనాలో ఇజ్రాయెల్ దురాక్రమణ 32000 మందికి పైగా అమాయక ప్రజల ప్రాణాలను హరించివేసిందని, మధ్యవర్తిత్వం చేసి ఇజ్రాయిల్‌ను నిలువరించగలిగిన అమెరికా కాల్పుల విరమణ తీర్మానాన్ని వీటో చేసి తన యుద్ధోన్మాదాన్ని నిర్లజ్జగా బయటపెట్టుకున్నదని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు, మానవ హక్కుల పరిరక్షణకు అమెరికా అండగా నిలుస్తుందని తాను భావించడంలేదని అన్నారు.

## ఢిల్లీలో సాహిత్య ఉత్సవం

**కేంద్ర** సాహిత్య అకాడమీ 12 మార్చి 1954లో ప్రారంభమైంది. దాని 70వ వార్షికోత్సవం సందర్భంగా అకాడమీ ప్రాంగణం రవీంద్రభవన్‌లో మార్చి 11 నుండి 16 వరకు ఆరు రోజులపాటు ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ – బహుళ భాషల సాహిత్య ఉత్సవం జరిగింది. 175 పైగా భాషలకు చెందినవారు, 1100 మంది పైగా రచయితలు, కవులు, ఆరు రోజులపాటు 190 సమావేశాల్లో పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో కవిత్వ ఉత్సవం జరిగింది. అన్ని భాషల పుస్తకాల ప్రదర్శన అమ్మకం నిర్వహించారు. వార్షిక ఉపన్యాసం ఇటీవల జ్ఞానపీఠ పురస్కారం అందుకున్న ప్రముఖ కవి గుల్జార్ ఇచ్చారు. ఈ సభల్లోనే 2023లో అకాడమీ బహుమతులందుకున్నవారిని సత్కరించారు.

## విశ్రాంత భారత నౌకాదళాధిపతి రామదాస్ మరణం

**అడ్మిరల్** లక్ష్మీనారాయణ రామదాసు 1990–1993లో భారత నౌకాదళాధిపతిగా చేశారు. ఆయన తన 90వ ఏట మార్చి 15, 2024న సికింద్రాబాద్‌లో మరణించారు. ఆయన మాతుంగ (ముంబాయి)లో 5–9–1933లో జన్మించారు. విద్యాభ్యాసం ఢిల్లీ కాన్వెంట్‌లో తర్వాత రంజాస్ కళాశాలలో.

ఆయన 1949లో డెహ్రాడూన్‌లో సైన్యంలో చేరారు. 1953లో నౌకాదళంలో చేరారు. కొచ్చిన్‌లో నేవల్ అకాడమీ స్థాపనలో ముఖ్యపాత్ర వహించారు. 1973–76లో పశ్చిమ జర్మనీలో పనిచేశారు. 13వ నౌకాదళాధిపతిగా 1990 నుండి 1993 వరకు పనిచేశారు. ఈయన హయాంలోనే మహిళలకు సైన్యంలో ప్రవేశం లభించింది.

రిటైరైన తర్వాత మహారాష్ట్రలోని ఒక గ్రామంలో వ్యవసాయదారునిగా కాలం గడిపారు. సేంద్రియ వ్యవసాయం చేశారు. పాకిస్తాన్ ఇండియా ప్రజావేదిక – శాంతి ప్రజాస్వామ్యం కొరకు PIPPFDలోనూ, ఇండియా పాక్ సైనికుల ఇన్షియేటివ్ for peaceలోనూ, అణ్వస్త్ర వ్యతిరేక ఉద్యమంలోనూ, లైంగిక సమానత్వం కోసం, మత్స్యకారుల హక్కుల కోసం, రైతుల హక్కుల కోసం, మైనారిటీ మత, తెగల హక్కుల కోసం, సెజ్‌కు వ్యతిరేకంగా గావో బచావో ఆందోళన్ (మహారాష్ట్ర)లోనూ క్రియాశీలంగా కృషి చేశారు. PIPFPDలో సభ్యులుగా వున్న జనసాహితి తరపున దివికుమార్ ఆయన అంత్యక్రియలకు హాజరయ్యారు.

## సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో 733 యాక్ట్ అప్రెంటిస్ పోస్టులు

బిలాస్‌పూర్ డివిజన్‌లోని సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో ఒప్పంద ప్రాతిపదికన అప్రెంటిస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా మొత్తం 733 పోస్టులను భర్తీ చేయనున్నారు. పదో తరగతి లేదా తత్సమాన విద్యార్హత, సంబంధిత ట్రెడుల్లో ఐటీఐ ఉత్తీర్ణత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. సరైన అర్హతలున్నవారు ఏప్రిల్ 12 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. టెన్త్, ఇంటర్ మార్కుల మెరిట్‌లిస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.

కవిత

# అంకేయ లేక

- రవి నన్నపనేని

ఇక ఈ జీవితం
ఈ బతుకు
ఇంక చాలనుకొని వెళ్లిపోయాడు

మట్టిలో పుట్టి
మట్టిలో పెరిగినవాడు
మట్టితో సహజీవనం
ముప్పొద్దూ చేసినవాడు
ఇక అంకేయ లేక
ఆత్మాభిమానం చంపుకోలేక
మట్టి సాక్షిగా
మృతిచెందాడు

తలకాయలో
ఏ చీడపురుగు తొలిచిందో
కలత నిద్రలో
ఏ పీడకల వెంటాడి, వెన్ను విరిచిందో
ఇక ఈ అగచాట్ల వృత్తి ఇంక వద్దనుకొని
ఇంక తెల్లారిపోవడమే తగునైన చర్యని
నిర్భయంగా
నిర్ణయించుకున్నాడు
పురుగుమందు డబ్బా పొద్దున్నే పైకెత్తాడు
'ఇది వ్యవసాయం కాదు
ఇది వ్యథ సాయమని
తల్లీ - ఇక తీసుకుపొమ్మని'
నమ్ముకున్న నేలపై
నవ్వుతూనే కూలబడిపోయాడు

ఓపికైనా ఓర్పైనా ఎన్ని రోజులనీ
దినదిన గండం నూరేళ్లుగా ఎన్ని దినాలనీ
ఒకవైపు బీడు పడిన భూమీ
ఇంకోవైపు శూన్యమైన భవిష్యత్తూ
మరోవైపు అప్పు రాకాసి -
చూసీ చూసీ
ఇక ఈ బండి చక్రం తిప్పలేనని
నిస్సంకోచంగా
నిశ్చయించుకున్నాడు
విషం -
ఆ గరళ రసాయనక ద్రవం
అలా పరగడుపులోకి
పాములా
చొరబడిన నిమిషంలోనే -

పొట్టలో సొద పుట్టి
పేగుల్లో అగ్గిరేగి
పెరట్లో పొర్లాడుతూ దొర్లుతూ
కేకలేస్తూ కళ్లు తేలేస్తూ -
ఈ పస్తుల్తో ఈ జబ్బుల్తో
ఈ తలవంపుల్తో
ఇక ఈ దురవస్థ ఇంక భరించలేనని
చస్తే చాలనుకున్నాడేమో
అవనిపై
అవతరించిన మనిషి
ఎప్పుడైనా
అంతరించక తప్పదనుకున్నాడేమో
కాని కాలంలో
కడతేరి పోవడమే మేలనుకున్నాడేమో


ఏదీ ఎప్పుడూ ఎవరికీ
చెప్పకపోయినా
ఇప్పుడు ఎన్నో ప్రశ్నలకి
శవ రూపంలో
సమాధానం చెబుతానన్నట్టు
తుదిశ్వాస వదిలేశాడు
తన జంట పక్షినీ తన పికిలి పిట్టల్నీ
ఒక దుఃఖ ద్వీపంలో
అలా ఒంటరిగా వదిలేసి
చెట్టంత మనిషి
ఇలా సగం పొద్దులోనే నిష్క్రమించాడు
ఇక్కడెక్కడ లేని
వేకువనీ వెన్నెలనీ ఇంకెక్కడో
ఏ లోకంలోనో వెతుక్కుంటూ
దహనమైపోయాడు
చీకట్లో చీకటైపోయి
చీకటిలా చిరాయువైపోయాడు
ఇంటి దీపం కంటిలోకి
చీకటి రాత్రిని విసిరేసి పోయాడు

రాజ్యమూ
రాజూ
మౌనం పాటించలేదు
ఎప్పటిలా
మౌనం వహించారు

✤

PRAJA SAAHITI April 2024 (TELUGU) Rs. 20/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2024-2026

No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month




ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada

A PUBLICATION OF JANASAAHITHI